V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శుక్రవారం
31-01-2025

సంపుటి : 01 | సంచిక : 269 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# ఏపీలో ఈ గవర్నెన్స్ వాట్సాప్ పాలన

- ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్
- చంద్రబాబు 2.0 పనితీరుకు ఇదో మరో మైలురాయి
- సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాదు
- ఇప్పటివరకూ ఎవరూ చేయని విధానానికి శ్రీకారం చుట్టాం
- 80 శాతం సేవలను సెకన్లలోనే అందిస్తాం
- ప్రభుత్వమే వినియోగదారుడికి ఫోన్ చేసి పరిష్కరించే విధానం తెస్తున్నాం: నారా లోకేష్



**విశ్వంభర, అమరావతి:** దేశంలో తొలి-సారిగా 'మన మిత్ర' పేరుతో ఏపీ ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టింది. ఈ సేవలను ఉండవల్లిలోని నివాసంలో మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. దీనికోసం అధి-కారిక వాట్సప్ నంబర్ 95523 00009ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఆ ఎకౌంట్‌కు వెరిఫైడ్ ట్యాగ్ (టిక్ మార్క్) ఉంది. పౌరసేవలు అందివ్వడంతో పాటు ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు, మిగతా2లో...



మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన తెలంగాణ గవర్నర్, సీఎం

విశ్వంభర, హైదరాబాద్: గాంధీ వర్ధంతి సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద వారు అంజలి ఘటించారు. దేశం, స్వాతంత్ర్యం కోసం గాంధీ చేసిన సేవలను వారు గుర్తుచేశారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

## నేడు ఉస్మానియా దవాఖాన నూతన భవన నిర్మాణానికి

# భూమిపూజ

### గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్న కొత్త దవాఖాన

2,000 పడకల సామర్థ్యంతో మొత్తం 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆసుపత్రి నిర్మాణం

పూర్తి వసతులతో వచ్చే వందేండ్ల అవసరాలకు తగినట్లు నూతన ఆసుపత్రి నిర్మించాలి

ఇటీవల నిర్వహించిన సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణ వైద్య ఆరోగ్య చరిత్రలో మరో కొత్త శకం ప్రారంభం కానున్నది. వందేళ్లుగా తెలంగాణతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు సేవలందించిన ఉస్మానియా దవాఖానకు నూతన భవనం నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉస్మానియా దవాఖాన అఫ్జల్ గంజ్‌లో ఉంది. నూతన దవాఖానను గోషామహల్ స్టేడియంలో నిర్మిస్తారు. నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేయనున్నారు. 2,000 పడకల సామర్థ్యంతో మొత్తం 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించనున్నారు. 26 ఎకరాల విస్తీర్ణంలో కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా మిగతా2లో...

## నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- బడ్జెట్ సమావేశాల్లోనే 'వక్ఫ్ బిల్లు'..
- మొత్తం 16 బిల్లులను సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడి
- అఖిలపక్షానికి జాబితా ఇచ్చిన కేంద్రం



2

## విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయం

- ప్లాంట్‌ను పునర్‌నిర్మిస్తాం
- కార్మికుల సమస్యలను 3 నెలల్లో కొలిక్కి తెస్తాం
- 2030లోపు 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి సాధించాలన్నదే లక్ష్యం
- కేంద్ర మంత్రి కుమారస్వామి



2

## అయోధ్యకు పోటెత్తిన భక్తులు

### 96 గంటల్లో 65లక్షల మంది.. కిక్కిరిసిపోయిన వీధులు



**అయోధ్య:** మౌని అమావాస్య సందర్భంగా కుంభ-మేళాకు కోట్లాది మంది భక్తులు పోటెత్తిన విషయం తెలిసిందే. అక్కడ పుణ్య స్నానమాచరించిన అనంతరం అయోధ్యకు బారులు తీరారు. దీంతో రాత్రికి రాత్రి అయోధ్య వీధులు కిక్కిరిసిపోయాయి. అప్రమత్తమైన ప్రభుత్వం భక్తుల రద్దీని నియంత్రిం-చేందుకు కేంద్ర బలగాలను ప్రభుత్వం రంగంలోకి దించింది. బాల రాముడిని దర్శించుకొనేందుకు 96 గంటల్లోనే 65 లక్షల మంది అయోధ్య మిగతా2లో...


## రాష్ట్రంలో భయంకర

# రోజులు వచ్చాయి

- కాంగ్రెస్ పాలనతో తెలంగాణ వందేళ్లు వెనక్కి వెళ్లే దుస్థితి ఏర్పడింది
- అబద్ధం అద్దం ముందు నిలబడితే రేవంత్ రెడ్డి బొమ్మ కనబడుతుంది
- కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తలకు మాత్రమే పథకాలు ఇచ్చే ఆలోచనలో ఉంది
- తాము చెప్పినవాళ్ళకే పథకాలు వస్తాయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తున్నారు
- యూరియా కోసం రైతులు మళ్లీ లైన్లు కట్టే పరిస్థితి వచ్చింది
- కరెంటు ఎప్పుడొస్తుందా ఎప్పుడు పోతుందా అనే తెలియని దుస్థితి
- కాళేశ్వరం ప్యాకేజీ 21 పనులు పూర్తి చేయలేని చేతగాని ప్రభుత్వం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కవిత



**విశ్వంభర, నిజామాబాద్:** కాంగ్రెస్ పాలనతో తెలంగాణ వందేళ్లు వెనక్కి వెళ్లే దుస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. రేవంత్ పాలనతో రాష్ట్రంలో భయంకర రోజులు వచ్చాయన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. ఆర్థిక పరిస్థితి తెలిసీ తెలియక హామీలిచ్చామని స్వయంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మిగతా2లో...




## తెలంగాణలో వర్సిటీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపు

- 60 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం
- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**విశ్వంభర, హైదరాబాద్:** యూనివర్సిటీ ప్రొఫెసర్లకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని మిగతా2లో...

### రాష్ట్ర విద్యుత్ సామర్థ్యం పెంపులో

# మరో ముందడుగు

- హిమాచల్ సీఎం సుఖ్వీందర్‌సింగ్ సఖుతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశం
- పరిశీలించిన తర్వాత ఎంవోయూపై సంతకం చేస్తాం: భట్టి



2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 103 | రిటైల్ ₹ 125 |
| స్కిన్ ₹ 181 | స్కిన్ లెస్ ₹ 206 |

## అంతేగా!




## జీహెచ్ఎంసీ సమావేశంలో రసాభాస

- బడ్జెట్ ఆమోదం తర్వాత ప్రజా సమస్యలపై చర్చించాలని బీఆర్ఎస్ పట్టు
- బీఆర్ఎస్ కార్పొరేటర్లను సస్పెండ్ చేసిన మేయర్
- నిధులు ఇవ్వట్లేదని అడిగితే బయటకు గెంటేస్తారా?: కేటీఆర్
- చర్చ లేకుండానే బడ్జెట్‌ను ఆమోదించడం అప్రజాస్వామికం: హరీశ్‌రావు



2



## తెలంగాణలో ఇంటర్ హాల్‌టికెట్ల జారీలో ఇబ్బందులు

- సీజీజీ పోర్టల్‌లో సాంకేతిక సమస్యతో అంతరాయం
- హాల్‌టికెట్ లేకున్నా విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలని ఇంటర్ బోర్డు ప్రకటన
- హాల్‌టికెట్ రాని వారి జాబితా సిద్ధం చేయాలని సిబ్బందికి బోర్డు ఆదేశం

2

## నాగోబా జాతరకు పోటెత్తిన భక్తులు

- మిశ్రమం వంశానికి చెందిన గిరిజనులు పెద్దదేవునికీ, మహిళలు బాన్ దేవత పూజలు
- నేడు గిరిజన దర్బార్‌కు హాజరుకానున్న మంత్రులు సీతక్క, సురేఖ



2

## నేడు ఉస్మానియా దవాఖాన నూతన భవన నిర్మాణానికి భూమిపూజ

**మొదటిపేజీ తరువాయి**

నూతన ఉస్మానియా ఆసుపత్రి భవనం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పూర్తి వసతులతో వచ్చే వందేండ్ల అవసరాలకు తగినట్లు నూతన ఆసుపత్రి నిర్మించాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒకే చోట అన్నిరకాల డయాగ్నసిస్ సేవలు, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మార్చురీ, స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్ కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్లకు రూపకల్పన చేశారు.అలాగే అండర్ గ్రౌండ్ రెండు ఫ్లోర్లలో పార్కింగ్, ఆసుపత్రి సమీపంలో ఫైర్ స్టేషన్, ఆసుపత్రి చుట్టూ విశాలమైన రహదారులు, ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడికైనా ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు తిరిగే మార్గాలు, దివ్యాంగులు ఆసుపత్రిలోకి రాకపోకలు సాగించేందుకు వీలుగా ర్యాంప్‌లు, ఆసుపత్రిలోని రోగులకు సహాయకులుగా వచ్చే వారు సేద తీరేందుకు డార్మెటరీలు, క్యాంటీన్, మరుగుదొడ్లు నిర్మించనున్నారు.

## తెలంగాణలో వర్సిటీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపు

**మొదటిపేజీ తరువాయి**

విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పదవీ విరమణ వయసును 60 నుంచి 65 సంవత్సరాలకు పెంచాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించింది. ఉన్నత విద్యాశాఖ పరిధిలో 12 వర్సిటీలున్నాయి. వాటిలో 2,817 ఆచార్యుల మంజూరు పోస్టులకు 757 మందే పనిచేస్తున్నారు. ఏకంగా 2,060 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే 73% ఆచార్యుల పోస్టులు ఖాళీలే. ప్రతినెలా ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్, కాకతీయ విశ్వవిద్యాలయాల్లో ఇద్దరు ముగ్గురు చొప్పున పదవీ విరమణ పొందుతున్నారు. ఉదాహరణకు ఉస్మానియా ఎడ్యుకేషన్ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు మాత్రమే మిగిలారు. వారే అన్ని వర్సిటీలకు డీన్లుగా, బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లుగా వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రవేశ పరీక్షలు నిర్వహించేందుకు కన్వీనర్లను నియమించాలన్నా ఎక్కడా సరిపడా ఆచార్యులు లేరు. మహాత్మాగాంధీ వర్సిటీ నిర్వహించే పీఈసెట్(ఫిజికల్ ఎడ్యుకేషన్), శాతవాహన వర్సిటీ జరిపే ఎడ్‌సెట్‌లకు కన్వీనర్లుగా ఉస్మానియా వర్సిటీకి చెందిన ఆచార్యులే వ్యవహరిస్తుండటం గమనార్హం.

## తెలంగాణలో ఇంటర్ హాల్‌టికెట్ల జారీలో ఇబ్బందులు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఇంటర్ హాల్‌టికెట్ల జారీలో ఇబ్బందులు నెలకొన్నాయి. సీజీజీ పోర్టల్‌లో సాంకేతిక సమస్యతో ఈ అంతరాయం ఏర్పడింది. దీంతో హాల్‌టికెట్ లేకున్నా విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలని ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లించిన, చెల్లించని వారి జాబితాలు సిద్ధం చేయాలని చెప్పింది. హాల్‌టికెట్ రాని వారి జాబితా సిద్ధం చేయాలని సిబ్బందిని బోర్డు ఆదేశించింది.

## అయోధ్యకు పోటెత్తిన భక్తులు

**మొదటిపేజీ తరువాయి**

నగరంలోకి ప్రవేశించినట్లు యూపీ సర్కార్ వెల్లడించింది.మరోవైపు, కుంభమేళాకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. కేవలం మౌని అమావాస్య రోజే దాదాపు 8-10 కోట్ల మంది వచ్చినట్లు అంచనా. అక్కడ నుంచి భక్తులు అయోధ్య దర్శనానికి వెళ్లడంతో నగర వీధులన్నీ రాత్రికి రాత్రే నిండిపోయాయి. గోండా, అంబేడ్కర్ నగర్, సుల్తాన్‌పుర్, లఖ్‌నవూ రోడ్ల వద్ద రద్దీని నియంత్రిస్తున్నామని స్థానిక పోలీసులు వెల్లడించారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఏపీ, తెలంగాణ, గోవా, మహారాష్ట్రతో పాటు గుజరాత్ నుంచి అయోధ్య దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నట్లు అయోధ్య డివిజనల్ కమిషనర్ గౌరవ్ దయాళ్ వెల్లడించారు. నిత్యం దాదాపు 3లక్షల మంది దర్శించుకుంటున్నారని.. రద్దీ నేపథ్యంలో దర్శన సమయాన్ని 18గంటలకు పెంచామన్నారు.

### విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయం..

**విశ్వంభర, విశాఖపట్నం:** విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని, ప్లాంట్‌ను పునర్‌నిర్మిస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతినిధులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో వేర్వేరుగా కుమారస్వామి భేటీ అయ్యారు. అనంతరం మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీలు భరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులతో కలిసి కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. ''విశాఖ ఉక్కు పరిశ్రమ సాధనకు సుమారు 30 మంది మరణించారు. పరిశ్రమ ప్రారంభంలో ఉత్పత్తి బాగా ఉండేది. 2013-14 వరకు ఉక్కు పరిశ్రమ పనితీరు బాగానే ఉంది. 2014లో నవరత్న హోదా సాధించింది. ఉక్కు ఉత్పత్తి పెంచాలని నిర్ణయించినప్పటి నుంచి నష్టాల్లోకి వెళ్లింది. విశాఖ ఉక్కు పరిశ్రమ దుస్థితి గురించి ఏపీ ఎంపీలు వివరించారు. కేంద్ర మంత్రి అయ్యాక స్టీల్‌ప్లాంట్‌పై ఎన్నో సమీక్షలు చేశా. 2021లో విశాఖ ఉక్కు పరిశ్రమలో పెట్టుబడుల ఉపసంహరణకు ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ ప్లాంట్‌కు రూ.35వేల కోట్ల అప్పు ఉంది. 2030లోపు 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి సాధించాలని ప్రధాని మోదీ లక్ష్యం నిర్దేశించారు. ప్రపంచ ఉక్కు ఉత్పత్తిలో ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్నాం. కార్మికుల సమస్యలను 3 నెలల్లో కొలిక్కి తెస్తాం'' అని కేంద్ర మంత్రి వివరించారు.

## రాష్ట్ర విద్యుత్ సామర్థ్యం పెంపులో మరో ముందడుగు



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సూచనలతో రాష్ట్ర అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. హిమాచల్ ప్రభుత్వం బూట్ (బిల్డ్ ఆన్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) విధానంలో 22 హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు ఆహ్వానించగా.. తెలంగాణ విద్యుత్‌శాఖ అధికారుల బృందం ఆయా ప్రతిపాదనలపై అధ్యయనం చేసి.. 100 మెగావాట్లకు పైబడిన సామర్థ్యం గల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేసింది.హిమాచల్ సీఎం సుఖ్విందర్‌సింగ్ సఖుతో గురువారం ఢిల్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 400 మెగావాట్ల సెలీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలించారు. వాటికి సంబంధించిన ముసాయిదాను పంపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హిమాచల్ ప్రదేశ్ సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ ఒప్పందంపై తెలంగాణ ప్రభుత్వం తగిన పరిశీలన చేసి త్వరితగతిన ఎంవోయూపై సంతకం చేసే విధంగా చర్యలు చేపడుతుందని భట్టి విక్రమార్క తెలిపారు.

# జీహెచ్ఎంసీ సమావేశంలో రసాభాస

**విశ్వంభర, హైదరాబాద్:** జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో రసాభాస నెలకొంది. బడ్జెట్ ఆమోదం తర్వాత ప్రజా సమస్యలపై చర్చించాలని బీఆర్ఎస్ పట్టుబట్టింది. ఈక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు కార్పొరేటర్లను మార్షల్స్ బయటకు తీసుకెళ్లారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దీన్ని నిరసిస్తూ మిగతా బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదుపులోకి తీసుకున్న కార్పొరేటర్లను మళ్లీ తీసుకువచ్చి సభను నిర్వహించాలన్నారు. ప్రశ్నోత్తరాలు నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించాలని చెప్పారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. మేయర్ ప్రజా సమస్యలపై చర్చిద్దామని సర్దిచెప్పినా బీఆర్ఎస్ కార్పొరేటర్లు పట్టువీడలేదు. ఈక్రమంలో ఆమె అసహనం వ్యక్తంచేస్తూనే మార్షల్స్ తీసుకెళ్లిన కార్పొరేటర్లను తిరిగి సభలోకి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. మరోవైపు ఆ నలుగురు కార్పొరేటర్లు లోనికి రావడానికి నిరాకరించడంతో వాగ్వాదం జరిగింది. దీంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లందరినీ మేయర్ సస్పెండ్ చేశారు. వారిని మార్షల్స్ బయటికి పంపించగా జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

**నిధులు ఇవ్వట్లేదని అడిగితే బయటకు గెంటేస్తారా?: కేటీఆర్**

హైదరాబాద్: జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ కార్పొరేటర్ల అరెస్టును మాజీమంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. హైదరాబాద్‌ను పట్టించుకోలేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? అని నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. నిధులు ఇవ్వట్లేదని అడిగితే బయటకు గెంటేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన కార్పొరేటర్లు, పార్టీ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. ''గత సంవత్సరం కేటాయించిన బడ్జెట్ నిధులను కనీసం ఖర్చు చేయకుండా, మరోసారి అవే కాగితాలపై అంకెలు మార్చి కాంగ్రెస్ గొప్పలు చెబుతోంది. దీన్ని అడ్డుకున్నందుకు మా ప్రజాప్రతినిధుల గొంతు నొక్కుతారా? పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి కనీస సౌకర్యాలను కూడా సరిగ్గా నిర్వహించలేని జీహెచ్ఎంసీ అసమర్థ తీరును ప్రశ్నిస్తే ఈ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోంది. హైదరాబాద్ నగర ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రారంభించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే పూర్తిచేయాలి. అప్పటివరకు ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని, పురపాలక శాఖకు బాధ్యత వహిస్తున్న ముఖ్యమంత్రిని నిలదీస్తూనే ఉంటాం'' అని కేటీఆర్ తెలిపారు.



**చర్చ లేకుండానే బడ్జెట్‌ను ఆమోదించడం అప్రజాస్వామికం: హరీశ్‌రావు..**

భారాస కార్పొరేటర్ల అరెస్టులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని అడిగితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేస్తున్న వైఖరిని నిలదీస్తే మార్షల్స్‌తో కార్పొరేటర్లను బడ్జెట్ కౌన్సిల్ నుంచి బయటికి పంపిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ మీద ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదిస్తున్నట్లు ప్రకటించడం అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్ నిరంకుశ వైఖరికి ఇది మరో నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రజాప్రతినిధుల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో భయంకర రోజులు వచ్చాయి

**మొదటిపేజీ తరువాయి**



130 ఏళ్ల చరిత్ర ఉన్నదని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ప్రజలను నిలువునా మోసం చేస్తుంది. చేతిలో ఎర్రబుక్కు పట్టికొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణ పరిస్థితులపై ఎందుకు మాట్లాడడం లేదు..? అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది అని కవిత మండిపడ్డారు. అబద్ధాలతో సీఎం రేవంత్ రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారు. అబద్ధం అద్దం ముందు నిలబడితే రేవంత్ రెడ్డి బొమ్మ కనబడుతుంది. గ్రామ సభల్లో ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. రైతు భరోసా, రేషన్ కార్డులు ఎవరికి ఇస్తున్నారో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. సచివాలయంలో ఏసీ గదుల్లో కూర్చొని తయారు చేసిన లబ్ధిదారుల జాబితాను గ్రామాల్లోకి తీసుకొచ్చి చదువుతున్నారు. ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధికారులను నిలదీస్తే అది తుది జాబితా కాదని మాటమారుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు ఇచ్చే ఆలోచనతో ఉంది. తాము చెప్పినవాళ్ళకే పథకాలు వస్తాయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టి ఎక్కువకాలం పరిపాలించలేరు. అలవిగాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది. యూరియా కోసం రైతులు మళ్లీ లైన్లు కట్టే పరిస్థితి వచ్చింది. కరెంటు ఎప్పుడొస్తుందా ఎప్పుడు పోతుందా అనే తెలియని దుస్థితి ఏర్పడింది. చెరువులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాళేశ్వరం ప్యాకేజీ 21 పనులు పూర్తి చేయలేని చేతగాని ప్రభుత్వం అని కవిత ధ్వజమెత్తారు. పెన్షన్ మొత్తాన్ని పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. కేసీఆర్ హయాంలో ఇచ్చిన పెన్షన్లే ఇంకా ఇస్తున్నారు. పెన్షన్ మొత్తాన్ని పెంచడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు ఏమైయ్యాయి..? తెలంగాణను ఆంధ్రలో కలిసి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కూడా అదే ఒరవడిని కొనసాగిస్తోంది. కాంగ్రెస్ చరిత్ర మొత్తం మోసాల చరిత్ర, దగా చరిత్ర. కేసీఆర్ అర్హులైన అందరికీ పారదర్శకంగా పథకాలను అందించారు. కేసీఆర్ హయాంలో నేరుగా లబ్దిదారులకే కోట్లాది రూపాయలు వెళ్లాయి. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన పనులను తామే చేశామని చెప్పడమే తప్పా ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదు. ఎల్లారెడ్డి పాఠశాలలో విషాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరం. కేసీఆర్ పెట్టిన గురుకులాలను కూడా నడపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు. పసుపు పంటకు కనీస మద్దతు ధర ప్రకటించడానికి బీజేపీ తక్షణమే చర్యలు తీసుకోవాలి అని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

## నాగోబా జాతరకు పోటెత్తిన భక్తులు

**విశ్వంభర, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో జరుగుతున్న నాగోబా జాతరకు గురువారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి గిరిజనులు నాగోబాను దర్శించుకున్నారు. మెస్రమం వంశానికి చెందిన గిరిజనులు పెద్దదేవునికీ, మహిళలు బాన్ దేవత పూజలు నిర్వహించారు. జాతర ప్రారంభమైన రెండో రోజు భారీగా భక్తులు తరలిరావడంతో అధికారులు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం జరిగే గిరిజన దర్బార్ కు రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

## పీజీ మెడికల్ సీట్లలో లోకల్ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి: హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్:** పీజీ మెడికల్ సీట్లలో 50శాతం లోకల్ రిజర్వేషన్ వర్తించదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించేలా ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తీర్పు వల్ల స్థానిక విద్యార్థులు వైద్య విద్య చదివే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.2025 నాటికి తెలంగాణలో ఉన్న 2,924 పీజీ సీట్లలో 50 శాతం లోకల్ రిజర్వేషన్ ప్రకారం 1,462 సీట్లు తెలంగాణ ప్రాంత విద్యార్థులకు వచ్చేవని, తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ఈ 1,462 సీట్లు కూడా ఆల్ ఇండియా కోటాలోకి వెళ్లిపోతాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఉంటూ మెడికల్ పీజీ చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఇది శరాఘాతంగా మారిందని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఏపీ విద్యార్థులు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కోబోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కూడా దెబ్బతినే అవకాశం ఉందని, పీజీలో ఇన్ సర్వీస్ కోటా అనేది ప్రశ్నార్థకం అవుతుందన్నారు.తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కాన్‌స్టిట్యూషనల్ బెంచ్‌కు వెళ్లాలని, తీర్పుపై స్టే తీసుకురావాలని భారాస పక్షాన డిమాండ్ చేశారు. పీజీ మెడికల్ సీట్లలో స్థానిక రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రంపై ఒత్తిడి తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, భాజపా ఎంపీలు చొరవ తీసుకోవాలన్నారు. అవసరమైతే దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి రాజ్యాంగ సవరణకు పట్టుబట్టాలని విజ్ఞప్తి చేశారు.



# నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**ఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలోనే గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో కేంద్రమంత్రులు, పలు పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఈసందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కేంద్రం అఖిలపక్షానికి అందించింది. ఇందులో వక్ఫ్ సవరణ బిల్లు కూడా ఉంది.బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌కు తీసుకురానున్నట్లు కేంద్రం తెలిపింది. దీంతోపాటు మొత్తం 16 బిల్లులను సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. ఆ జాబితాను అఖిలపక్షం ముందు ఉంచింది. వక్ఫ్ చట్ట సవరణపై గతంలో కేంద్రం జేపీసీని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే.



**'వక్ఫ్ బిల్లు'పై స్పీకర్‌కు నివేదిక..**

వక్ఫ్ చట్టంలో మార్పుల పరిశీలన కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ ఇటీవల సవరణ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించింది. దానికి సంబంధించిన తుది నివేదికను సిద్ధం చేసి.. తాజాగా లోక్‌సభ స్పీకర్‌కు అందించింది.వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకురావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. అయితే, ఈ సవరణలపై విపక్షాలు అసమ్మతి తెలిపాయి. ముస్లింలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెచ్చారని, వక్ఫ్‌బోర్డుల పనితీరులో జోక్యం చేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశమని విపక్ష సభ్యులు ఆరోపించాయి.

# ఏపీలో ఈ గవర్నెన్స్ వాట్సాప్ పాలన

**మొదటిపేజీ తరువాయి**

వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. కార్యక్రమం ప్రారంభం సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడారు. ''వాట్సాప్ గవర్నెన్స్.. చంద్రబాబు 2.0 పనితీరుకు మరో మైలురాయి. సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాదు. ఇప్పటివరకూ ఎవరూ చేయని విధానానికి శ్రీకారం చుట్టాం. 80 శాతం సేవలను సెకన్లలోనే అందిస్తాం. రెండో విడతలో టీటీడీ దర్శనం టికెట్లను అందుబాటులోకి తీసుకొస్తాం. ఈ నూతన విధానాన్ని మేం కూడా నేర్చుకునే దశలోనే ఉన్నాం. ప్రభుత్వమే వినియోగదారుడికి ఫోన్ చేసి పరిష్కరించే విధానం తెస్తున్నాం.

**520కి పైగా సేవలు అందించేందుకు కృషి..**

భవిష్యత్తులో మరింత మెరుగ్గా 'మన మిత్ర' అమలు చేస్తాం. వచ్చే 6 నెలల్లో గణనీయ మార్పులను ప్రజలే చూస్తారు. మన మిత్ర వాట్సప్ సేవలు.. ప్రజలే బటన్ నొక్కే విధానం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహాలో ప్రజా సేవలూ వేగంగా అందిస్తాం. 520కి పైగా సేవలు వాట్సప్ ద్వారా అందించేందుకు కృషి చేస్తున్నాం. ఈ సేవలన్నీ పూర్తిగా ఉచితం.. బుక్ చేసుకున్నప్పుడే చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. రియల్‌టైమ్‌లోనే అన్ని సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షల హాల్ టికెట్లు కూడా విద్యార్థులు వాట్సప్ ద్వారా పొందవచ్చు. ఇకపై జారీ చేసే సర్టిఫికెట్లకు క్యూఆర్ కోడ్ ఇస్తాం. సర్టిఫికెట్‌లో తప్పులు ఉన్నా.. తేలిగ్గా పరిష్కరించుకోవచ్చు.

**ఇతర నంబర్లను నమ్మవద్దు..**

95523 00009 నంబర్ ద్వారానే సేవలు అధికారికంగా అందుతాయి. ఇతర నంబర్ల ద్వారా అందిస్తామని ఎవరైనా వస్తే వాటిని నమ్మవద్దు. మరికొన్ని సేవలు అందుబాటులోకి తేవాలంటే చట్ట సవరణలు అవసరం. మలిదశ సేవలకు అనుగుణంగా ప్రభుత్వం చట్టసవరణలు కూడా చేస్తుంది. ఒప్పందం చేసుకున్న 3నెలల్లోనే తొలిదశ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రస్తుతం తెలుగు, ఆంగ్ల భాషల్లో సేవలు అందిస్తున్నాం. రానున్న రోజుల్లో అన్ని భాషల్లోనూ ఉంటాయి. ఈ తరహా సేవలు ప్రపంచంలోనే తొలిసారి అని చెప్పగలం. ఎక్కువ మంది ఒకేసారి వాడకం వల్ల సర్వర్ సమస్యలు తలెత్తవచ్చు. లోడ్‌కి తగ్గట్టుగా సర్వర్ల పెంపు వంటి వాటిని 2 రోజుల్లో పరిష్కరిస్తాం''అని లోకేశ్ తెలిపారు. ఏపీతో పనిచేయడం గర్వంగా ఉందని మెటా ఉపాధ్యక్షురాలు సంధ్య అన్నారు. పీపుల్ ఫ్రెండ్లీగా వాట్సప్ గవర్నెన్స్ రూపొందించామని చెప్పారు. ఈ సేవల కోసం చాలా కృషి చేశామన్నారు.

**వాట్సప్‌తో అందించే సేవలివీ..**

తొలి దశలో మొత్తం 161 రకాల పౌర సేవలను ప్రభుత్వం అందించనుంది. రెండో విడతలో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. తొలి విడతలో దేవాదాయ, ఇంధన, ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల్లో ఈ సేవలు మొదలయ్యాయి. వాట్సప్ సేవలతో ధ్రువపత్రాల కోసం పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి స్వస్తి పలకనున్నారు. ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని పౌరులకు చేరవేయాలంటే ఈ వాట్సప్ ఖాతా ద్వారా సందేశాలు పంపిస్తుంది. ఒకేసారి కోట్ల మందికి ఈ సమాచారం చేరుతుంది. వరదలు, వర్షాలు, విద్యుత్తు సబ్‌స్టేషన్ల మరమ్మతులు, వైద్యారోగ్య, వ్యవసాయ, అత్యవసర, పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధి సమాచారం వంటివి అందిస్తారు. ప్రజలు వినతులు, ఫిర్యాదులు ఇవ్వాలనుకుంటే.. ఈ వాట్సప్ నంబర్‌కు మెసేజ్ చేస్తే వెంటనే ఒక లింక్ వస్తుంది. అందులో పేరు, ఫోన్ నంబర్, చిరునామా తదితరాలు పొందుపరిచి, వారి వినతిని టైప్ చేయాలి. వెంటనే వారికి ఒక రిఫరెన్స్ నంబరు వస్తుంది. దాని ఆధారంగా తమ వినతి పరిష్కారం ఎంత వరకూ వచ్చింది? ఎవరి వద్ద ఉంది అనేది పౌరులు తెలుసుకోవచ్చు. ఎలాంటి సమస్యనైనా ఇక్కడ విన్నవించొచ్చు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్హతలు, ఆయా పథకాల ద్వారా కలిగే లబ్ధి తదితర అంశాలన్నింటి గురించి ఈ వాట్సప్ నంబరుకు మెసేజ్ చేసి, తెలుసుకోవచ్చు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని వాట్సప్‌లో పంపిస్తారు. మీకు కావాల్సిన ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని.. టికెట్లు, వసతి సహా అన్నీ బుక్ చేసుకోవచ్చు.

**ఈ ధ్రువపత్రాలూ పొందవచ్చు..**

ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఆదాయ, నో ఎర్నింగ్.. ఇలా వివిధ శాఖలకు సంబంధించిన అనేక సర్టిఫికెట్లు వాట్సప్ ద్వారా పొందవచ్చు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)కి చేసిన దరఖాస్తుల స్టేటస్ తెలుసుకోవచ్చు. విద్యుత్తు బిల్లులు, ఆస్తి పన్నుల వంటివి ఈ అధికారిక వాట్సప్ ద్వారా చెల్లించవచ్చు. ట్రేడ్ లైసెన్సులు, రెవెన్యూ శాఖకు సంబంధించి ల్యాండ్ రికార్డులు, వివిధ సర్టిఫికెట్లు పొందవచ్చు. ఏపీఎస్ఆర్టీసీ టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, జర్నీ రిమైండర్, ట్రాకింగ్ సర్వీసు, సర్వీసు, రిఫండ్, ఫీడ్‌బ్యాక్ తదితర సేవలు దీని ద్వారా పొందవచ్చు.

# విద్యార్థుల ఉసురు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రభుత్వ ఖజానా ఉన్నది కాంట్రాక్టర్ల కోసమా... కాలేజీ విద్యార్థుల కోసమా తేల్చాలి
- వారం పది రోజుల్లో ఫీజుల బకాయిలు ఇవ్వకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తాం
- విద్యార్థుల త్యాగాలతోనే వచ్చిన తెలంగాణను కాంగ్రెస్ విద్యార్థుల చదువులను విచ్చినంజేస్తుంది
- బీసీ విద్యార్థులకు నష్టం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలుపుతాం
- బీసీ విద్యార్థుల సమర శంఖారావం సభలో అఖిలపక్ష పార్టీల నేతల హెచ్చరిక



**విశ్వంభర, హైదరాబాద్:** విద్యార్థుల బలిదానాలతో సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా ఉన్నటువంటి ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ఉసురు తీసుకుంటుందని, ఇకనైనా బడుగు వర్గాల విద్యార్థుల ఫీజుల బకాయిలను తక్షణమే విడుదల చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలుపడం ఖాయమని అఖిలపక్ష రాజకీయ పార్టీల నేతలు, బిసి సంఘాలు సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. గురువారం హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బీసీ విద్యార్థుల సమర శంఖారావం మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ సమన్వయం చేయగా, బిజెపి పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి ఈటల రాజేందర్, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదన చారి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఫీజుల రియంబర్స్మెంట్ నిధులు ప్రభుత్వ దయాదాక్షిణల మీద కాకుండా విద్యార్థుల హక్కుగా చూడాలన్నారు విద్యార్థుల ఫీజుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మానవత్వం లేకుండా కనికరం లేకుండా వ్యవహరిస్తూ, ఫీజుల బకాయిలు 4600 కోట్లు విడుదల చేయకుండా బడుగు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆయన హెచ్చరించారు. ఫీజుల రియంబర్స్మెంట్ నిధుల విడుదల నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అంతేగాని ముఖ్యమంత్రి జేబు నుండి ఇచ్చినట్టుగా చూడొద్దన్నారు.

కాంగ్రెస్ పార్టీ అనేక హామీలిచ్చి, కలబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చి నేడు హామీలను నెరవేర్చకుండా గత ప్రభుత్వాల మాదిరిగానే ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన మండిపడ్డారు రేవంత్ రెడ్డి బీసీ విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టి ప్రసక్తే లేదని విద్యార్థులకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు తాను ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఫీజుల బకాయిలు ఏర్పడిన సందర్భంలో దశలవారీగా చెల్లించుకుంటూ విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూశామని కానీ ఈ ప్రభుత్వం గత ప్రభుత్వం పై నెపం నెట్టి విద్యార్థులను అటు కళాశాల యజమాన్యాలను అందులో పని చేసే లక్షలాదిమంది ఉద్యోగులను మానసిక వేదనకు గురి చేస్తుందని ఆయన మండిపడ్డారు రేవంత్ రెడ్డి మీనా మేషాలు లెక్కపెట్టకుండా తక్షణమే ఫీజులు విడుదల చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుతావని ఈటల తీవ్రంగా హెచ్చరించారు.

మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదన్ చారి మాట్లాడుతూ విద్యార్థుల పై చేసే ఖర్చును పెట్టుబడిగా చూడొద్దని మానవ వనరుల అభివృద్ధి కోణంలో చూడాలన్నారు కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీ విద్యార్థులంటే లోకువైందని బీసీలపై వివక్షత చూయిస్తూ రాష్ట్ర ఖజానాను కాంట్రాక్టర్ల జేబులు నింపుతూ బీసీ విద్యార్థులను హరిగోశ పెడుతున్నరని ఆయన అన్నారు. అధికారంలోకి రాకముందు ఒక మాట వచ్చిన తర్వాత ఇంకొక మాట మాట్లాడుతూ అబద్ధాలు మాట్లాడే ఘనత వారికి దక్కిందని ఇది సాక్షాత్తు స్పీకర్ ప్రసాద్ గారు నిన్న మాట్లాడిన మాటలే సాక్ష్యం అన్నారు నిధులు లేవు కాబట్టి సంక్షేమ పథకాలు అమలు చేయలేమని స్పీకర్ చెప్పారని ఆయన గుర్తు చేశారు బిఆర్ఎస్ పార్టీగా కాకుండా ఒక బీసీ బిడ్డగా ఈ ప్రభుత్వాన్ని బీసీ విద్యార్థుల నిధులు విడుదల చేయాలని అడుగుతున్నామని విడుదల చేయకపోతే బీసీలంతా ఒక్కటై ఈ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడానికి వెనకాడ బోమని ఆయన హెచ్చరించారు బీసీ విద్యార్థి ఉద్యమానికి టిఆర్ఎస్ పార్టీన తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు.

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అవుతున్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థుల సమస్యల పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయాలని ఒకవైపు విద్యార్థి లోకం అడుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కాలేజీ విద్యార్థులకు ఇవ్వకుండా కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయలు రాత్రికి రాత్రి విడుదల చేస్తూ వారికి దోచిపెడుతుందని ఆయన ఆరోపించారు రాష్ట్ర ఖజానా ఎవరు సొత్తు కాదని బీసీ ఎస్సీ ఎస్టీలు పన్ను కడితేనే రాష్ట్ర ఖజానా నిండిందని ఆ ఖజానాను కాంట్రాక్టర్ల సూట్ కేసులు నింపడానికి కాదని ఆయన అన్నారు వారం పది రోజుల్లో మొత్తం ఫీజుల బకాయిలను విడుదల చేయకుండా ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థుల వలె మొత్తం ఫీజులు బీసీ విద్యార్థులకు ప్రభుత్వం భరించకుండా నిర్ణయం తీసుకోకపోతే వేలాదిమంది విద్యార్థులతో సచివాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు ఈరోజు జరిగే బీసీల సమర శంఖారావం సభ ప్రభుత్వానికి ఒక ట్రయల్ మాత్రమేనని ముందు ముందు బీసీ విద్యార్థుల సత్తా ఏందో ప్రభుత్వానికి రుచి చూపిస్తామని ఆయన హెచ్చరించారు ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించకపోతే కాంగ్రెస్ పార్టీని బీసీలె రాజకీయ సమాధి చేస్తారని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ విద్యార్థుల బలిదానాలు పోరాటాలతోటే తెలంగాణ రాష్ట్రం సాకారం అయిందని తెలంగాణ రాష్ట్రం సకారంతోనే కేసీఆర్, రేవంత్ రెడ్డి లు ముఖ్యమంత్రి కాగాలిగారని ముఖ్యమంత్రి పీఠం మీద కూర్చున్నాక తెలంగాణ కోసం పోరాడిన విద్యార్థులను అక్కున చేర్చుకునేది పోయి ఉన్నత విద్యను ఆటకెక్కిస్తూ పేద విద్యార్థుల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని ఆయన ఆరోపించారు విద్యార్థుల పోరాటానికి ఎర్రజెండా పార్టీ అండగా ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై సమరానికి సిద్ధంగా ఉండాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు, బీసీ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి తమ పార్టీ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని ఆయన ప్రకటించారు.

బీసీ విద్యార్థి సమర శంఖారావం సభలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ తీర్మానాలను ప్రవేశపెట్టారు.

* తెలంగాణ రాష్ట్రంలో పీజుల బకాయిలుగా ఉన్న 4600 కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేయాలి
*ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థుల వలె బిసి విద్యార్థులకు కూడా పూర్తి ఫీజుల రియంబర్స్మెంట్ను అమలు చేయాలి
*ప్రవేట్ యూనివర్సిటీలో కూడా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సామాజిక రిజర్వేషన్ లు అమలు చేయాలి
*యూనివర్సిటీలలో చదివే విద్యార్థుల పూర్తి మేస్ బిల్లులను ప్రభుత్వమే భరించాలి

ఈ నాలుగు తీర్మాలను ప్రవేశపెట్టగా శంఖారావం సభ ఏకగ్రీవంగా తీర్మానించింది

ఈ సభలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం, కురుమ బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మనిమంజరి, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యా సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యూనివర్సిటీ ఇంచార్జ్ నాగరాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మాదేశ్ రాజేందర్, బీసీ విద్యార్థి నాయకులు పాలకూరి కిరణ్ గౌడ్, కొప్పుల చందు, సంతోష్, మధు యాదవ్, రాకేష్ చారి, అనంతుల సాయి బండి గారు భరత్ గౌడ్ మహేష్ మేరు, తారకేశ్వరి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులు సమర శంఖారావానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. బీసీ కళామండలి రాష్ట్ర అధ్యక్షులు సిరిసినవాడ రామలింగం తన బృందంతో బహుజన ధూంధాం తో అలరించిన పాటలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి.

## బాల బ్రహ్మేశ్వరి స్వామి బ్రహ్మోత్సవాలకు మంత్రి సురేఖకు ఆహ్వానం



విశ్వంభర, హైదరాబాద్ : జోగులాంబ బాల బ్రహ్మేశ్వరి స్వామి దేవస్థానంలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు, ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1 వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆలయ ఈవో పురేంద్ర కుమార్, అర్చకులు మంత్రి గారిని సెక్రటేరియట్ లోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఆలయ అర్చకులు మంత్రి కి వేదాశీర్వచనం చేసి, అమ్మవారి తీర్థప్రసాదాలను, ఆహ్వానపత్రికను అందించారు.

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధ్వజారోహణం, మహా పూర్ణాహుతి, సహస్ర కలశాభిషేకం, జోగులాంబ బాలబ్రహ్మేశ్వర్ స్వామి కళ్యాణోత్సవం, మహాశివరాత్రిని పురస్కరించుకుని కళ్యాణోత్సవం, రథోత్సవం, అశ్వవాహన సేవ, అవభృదోత్సవాలను నిర్వహించనున్నట్లు ఈవో పురేంద్ర కుమార్ మంత్రికి వివరించారు. వరుస ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయాలని మంత్రి సురేఖ ఈవోను ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి లోటు రాకూడదని మంత్రి ఆదేశించారు. దేదీప్యమానంగా బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని మంత్రి సురేఖ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి కార్యదర్శి, ఆలంపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ సంపత్ కుమార్ పాల్గొన్నారు. అంతకు ముందు జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని లంగర్ హౌజ్ లోని బాపూఘాట్ లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ప్రార్థన, అభ్యర్థన, నిరసన అనే మహాయుధాలతో బ్రిటీష్ వారిని తరిమి కొట్టి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టిన మహా నాయకుడు గాంధీజీ అని మంత్రి సురేఖ అన్నారు. గాంధీజీ సూచించిన శాంతి, అహింసల ఆచరణే మనం గాంధీజీకి ఇచ్చే అసలైన నివాళి అని మంత్రి సురేఖ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప సంకల్పంతో పనిచేస్తున్నదని మంత్రి సురేఖ తెలిపారు.

## వాసవి సేవా కేంద్రంలో డా. కాచం సత్యనారాయణకు ఘన సన్మానం



**విశ్వంభర, లకిడికపూల్ :** వి3 న్యూస్ ఛానల్ , విశ్వంభర దిన పత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ ను శ్రీ స్వయంభు నాగలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రథమ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వపు చైర్మన్ కోలేటి దామోదర్ వాసవి సేవ కేంద్రంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ సమక్షములో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మి నారాయణ, మలిపెద్ది శంకర్ ,వైశ్య కిరణం పక్ష పత్రిక ఎడిటర్ బల్లు చంద్ర ప్రకాష్ గుప్త , సీనియర్ పాత్రికేయులు రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## సీఎం రేవంత్‌ను కలిసిన ఎంపీ రఘువీర్

### పెద్దగట్టు జాతరకు నిధులు కేటాయించాలని వినతి..



**విశ్వంభర, హైదరాబాద్:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్వహించే పెద్ద గట్టు(గొల్లగట్టు) జాతరకు భారీగా నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఈ మేరకు విన్నవించారు. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 16 నుంచి పెద్దగట్టు జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లకు కావాల్సిన నిధుల ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జాతరకు దేశవ్యాప్తంగా భారీగా భక్తజనం తరలిరానున్న నేపథ్యంలో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయనున్నారు. గత ప్రభుత్వాల హయాంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ ఈసారి శాశ్వత ప్రాతిపదికన పనులు చేయాలని సూచించారు. అవసరమైన చోట సీసీ రోడ్లు వేయాలని తెలిపారు. ఎంపీ రఘువీర్ రెడ్డి కి యాదవ సంఘం నాయకులు, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌని రాజారామ్ రమేష్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పెద్దగట్టు జాతరకు సౌకర్యాలు కల్పించేలా నిధులు విడుదల చేయాలని ఎంపీ గారిని కోరుతూ వినతి పత్రం సమర్పించడంతో వెంటనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పెద్దగట్టు జాతర కు నిధులు విడుదల చేయాలని కోరారు. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అధికారులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు.

## గాంధీజీకి జగ్గారెడ్డి ఘన నివాళి



**విశ్వంభర, సంగారెడ్డి:** జాతిపిత మహాత్మాగాంధీ 77వర్ధంతి పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని గంజిమైదాన్ లోని మహాత్ముని విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు..ఈకార్యక్రమంలో TPCCరాష్ట్ర కార్యదర్శులు తోపాజి అనంతకిషన్,, ఆంజనేయులు, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కూన సంతోష్, పట్టణ అధ్యక్షులు జార్జ్ కంది మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్ మరియు కాంగ్రెస్ నాయకులు నాగరాజు, ఉదయభాస్కర్, శ్రీనివాస్, కసిని రాజు, మహేష్, శ్రీకాంత్ గౌడ్, కుతుబ్, బబ్బు, అన్వర్ బాబా, బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వయంభు నాగలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రథమ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



**విశ్వంభర, లకిడికపూల్;** తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వపు చైర్మన్ కోలేటి దామోదర్ సంకల్పముతో తన స్వగ్రామం రాగినేడులో నిర్మించబడిన శ్రీ స్వయంభు నాగలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రథమ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను రూపొందించిన వైశ్య కిరణం పక్ష పత్రిక ఎడిటర్ బల్లు చంద్ర ప్రకాష్ గుప్త సంచిక ఆవిష్కరణ మహోత్సవం లకిడికపూల్ లోని వాసవి కేంద్రంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దైవ సంకల్పంతో దేవాలయ నిర్మాణం చేపట్టిన కోలేటి దామోదర్ ను అభినందిస్తూ మంచి కార్యసాధకు పూనుకొని సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా వారిని అభినందిస్తూ , ఇలాంటి దైవ కార్యక్రమాలలో ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరుకుంటూ వారికి భగవంతుడి ఆశీస్సులతో మరింత ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాని తెలిపారు. కోలేటి దామోదర్ గుప్త మాట్లాడుతూ దైవ కార్యానికి , ఆలయ నిర్మాణం చేసి ప్రదమ వార్షికోత్సవం జరుపుకోబోతున్నాం. మా తల్లితండ్రుల పుణ్యఫలమో , ఆ దేవుడి ఆశీస్సులతో ఆలయ నిర్మాణ బృహత్కర కార్యక్రమం నా చేతుల మీదుగా జరగడం పూర్వజన్మ సుకృతంగా మా నాన్న ఆశీస్సులే దేవుడు కల్పించిన కృప అని అన్నారు. ఈ సంచిక ఆవిష్కరణకు పూనుకొని పుస్తక రూపంలో అందించిన వైశ్య కిరణం పక్ష పత్రిక ఎడిటర్ బల్లు చంద్ర ప్రకాష్ గుప్త ను అభినందనలు తెలియజేస్తున్నాని అన్నారు. ఎడిటర్ బల్లు చంద్ర ప్రకాష్ గుప్త మాట్లాడుతూ శ్రీ స్వయంభు నాగలింగేశ్వర స్వామి గా కొలువుదీరిన ఆ ప్రాంతంలో గుడి నిర్మాణం చేపట్టి , ఆధ్యాత్మిక చింతన , దైవ భక్తి కలిగిన ఆయన మంచి కార్యానికి ప్పానుకోవడం ఆ దేవాలయ ప్రధమ వార్షికోత్సవ సంచిక ను అందిస్తూ నేను భాగం అవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి3 న్యూస్ ఛానల్ , విశ్వంభర దిన పత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ , ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మి నారాయణ , ఐవిఎఫ్ అధ్యక్షులు , టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మ ఉప్పల శ్రీనివాస్ గుప్త , వాసవి సేవ కేంద్రం కోలుమూరి రమేష్, ఆవోపా అధ్యక్షులు మలిపెద్ది శంకర్ , విబిజి రాజు , ఇమ్మడి శివ, కాచం ప్రభాకర్ , కొండే మల్లిఖార్జున్ , బుస్సా శ్రీనివాస్ , ఉప్పల రాజేశ్వర్ , ఎంఎల్ ఆర్ గుప్త, విజయ్ కుమార్, రమేష్ , రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామంలో బెస్ట్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన అనంతరం పారిశుద్ధ కార్మికులకు చిరు సత్కారం నిర్వహించడం జరిగింది.
- విశ్వంభర, రామన్నపేట

## అధిష్ఠానానికి ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా: మహేశ్‌కుమార్ గౌడ్



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కులగణన నివేదికపై ఫిబ్రవరి 5న కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. రిజర్వేషన్ల పెంపు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదనే అంశంపై స్పందించిన ఆయన.. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారుల వైఫల్యం కారణంగానే కొంతమేరకు పథకాలు లబ్ధిదారులకు అందడం లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల జాబితాను పార్టీ అధిష్ఠానం వద్దకు పంపించామని తెలిపారు.

# ఆయన పాట... ప్రజాచైతన్యపు ఊట

## నేడు గద్దర్ జయంతి

**కత్తుల వంతెన మీద కవాతు చేసిన గద్దర్ (గుమ్మడి విఠల్‌రావు) పీడిత వర్గాల గొంతుకగా నిలిచారు. పాటనే అస్త్రంగా చేసుకొని ప్రజా ఉద్యమాల్లో సాంస్కృతిక విప్లవాన్ని సృష్టించారు. విప్లవోద్యమం, దళితోద్యమం, మలిదశ తెలంగాణోద్యమంలో అగ్గిగళంతో యుద్ధం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే త్యాగానికి, పోరాటానికి నిలువెత్తు ప్రతిరూపం గద్దర్. నేడు ఆయన జయంతి సందర్భంగా విశ్వంభర ప్రత్యేక కథనం..**







ఆయన కాలి గజ్జెల సప్పుడు బడుగు జీవుల హృదయ స్పందన. మోకాలి పై వరకు మడిచి కట్టిన ధోతి, భుజాన గొంగడి, గిరజాల జుట్టు, చేతిలో కర్ర, కాళ్లకు గజ్జలు ఆ రూపాన్ని ఊహించుకుంటే గద్దర్ సాక్షాత్తు మన కళ్ళ ముందు ప్రత్యక్షమవుతారు. జీవితమంతా ప్రజల కోసమే పాటయి బతికినవాడు, ప్రజా హృదయాలలో చెరగని స్థానాన్ని సాధించుకున్న ప్రజా గాయకుడు గద్దర్. తన పాటతో ప్రజా చైతన్యానికి ఊపిరిలూది దోపిడీదారులకు సింహ స్వప్నమై నిలిచిన గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్ రావు. 1949 జనవరి 31న మెదక్ జిల్లా తూప్రాన్ లో గుమ్మడి లచ్చుమ్మ శేషయ్య దంపతులకు జన్మించిన గద్దర్ చిన్ననాటి నుంచి ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచి తన కలం ద్వారా గళం ద్వారా జన చైతన్యానికి పూనుకున్నాడు. తొలినాళ్లలో బుర్రకథలు ప్రదర్శించిన గద్దర్ అనంతర కాలంలో పాటను తన ఉద్యమానికి ఆయుధంగా చేసుకున్నాడు. 1913లో భారత స్వాతంత్ర్య ఉద్యమ పోరాటం కోసం పంజాబ్ లో సోహన్ సింగ్, కర్తార్ సింగ్ ల నేతృత్వంలో ఏర్పడిన గదర్ పార్టీ భారతదేశంలో తొలి విప్లవ పార్టీగా ఆవిర్భవించింది. గద్దర్ అనే పదానికి తిరుగుబాటు అని అర్థం ఉంది. ఇదే పదం తెలుగులో గద్దర్ గా స్థిరపడింది. గద్దర్ తన తొలి పాటల ఆల్బమ్ కు గద్దర్ అని పేరు పెట్టుకున్నారు. అదే తన కలం పేరుగా తెలుగు ప్రజల గుండెల్లో స్థిరపడిపోయింది.

మాభూమి సినిమా దర్శకుడు బి నర్సింగరావు ప్రోత్సాహంతో గద్దర్ ప్రజా కళాకారుడిగా అరంగ్రేటం చేశారు. 1971లో ఆపుర రిక్షోడో... అనే పాట వీరికి గొప్ప పేరు తెచ్చిపెట్టింది. 1972లో ఏర్పడిన జననాట్యమండలిలో క్రియాశీలక పాత్ర పోషించాడు. మాభూమి సినిమాలో బండి యాదగిరి రాసిన బండి ఎనక బండి గట్టి పాటలో బండి యాదగిరి పాత్రలో నటించి, ఆ పాటను పాడారు. తొలినాళ్లలో బ్యాంకు క్లర్క్ గా కొంతకాలం పనిచేసిన గద్దర్ అనంతరం ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. కారంచేడు దళితుల హత్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. ఆయన రాసిన దళిత పులులమ్మ అనే పాట తెలుగు సాహిత్యం ఉన్నంతకాలం తెలుగు ప్రజల నోళ్లలో నానుతూనే ఉంటుంది.

ప్రజల కష్టాలే గద్దర్ పాటలకు వస్తువులు. ఆయన ఆశువుగా అందుకునే పాట ప్రజలను ఉగ్రూతలూగిస్తుంది. వేలాది మంది యువకులు గద్దర్ పాటల స్ఫూర్తితో ఉద్యమం వైపు కదలి వెళ్లారంటే ఆయన పాట ఎంతటి ప్రభావ వంతమైందో అర్థం చేసుకోవచ్చు. విప్లవోద్యమం పై నిషేధం ఎత్తివేసిన కాలంలో హైదరాబాదులో నిజాం కాలేజీ గ్రౌండ్స్ లో గద్దర్ నిర్వహించిన సభ లక్షలాది మందితో కిటకిటలాడింది. అనేక చారిత్రాత్మక సందర్భాల్లో గద్దర్ క్రియాశీలకంగా వ్యవహరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరిపిన సందర్భంలో మధ్యవర్తిగా వ్యవహరించారు. తనపై హత్యాయత్నం జరిగినా, తాను మరణించే వరకు వెన్నులో బుల్లెట్టు అలాగే ఉన్నా తన అంకిత భావాన్ని విస్మరించని నికార్సైన ఉద్యమకారుడాయన. రాజ్యము నిర్బంధాలని ఆయన ఏనాడూ లెక్క చేయలేదు. బూటకపు ఎన్కౌంటర్లకు నిరసనగా, అవినీతి దోపిడీదారులకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడారు గద్దర్

తెలంగాణ ఉద్యమంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించిన వారిలో గద్దర్ అగ్ర గణ్యులు. తెలంగాణ సైదాంతిక భావవ్యాప్తికి తనదైన శైలిలో విశేష కృషి సల్పారు. భువనగిరి తెలంగాణ సభ ద్వారా మలితెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఉద్యమంలో వేలాది సభల్లో తన పాట ఆట మాటతో ప్రజలను తెలంగాణ ఆవశ్యకత పట్ల ఆలోచింప చేయగలిగారు. గొల్ల సుద్దులు, బుర్రకథ, ఒగ్గు కథ మొదలైన ప్రజా కళారూపాలను తెలంగాణ ఉద్యమంలో విరివిగా ప్రదర్శించారు. తెలంగాణ కోసం ఉద్యమించిన నాయకులందరికీ తన మద్దతును ప్రకటించడం ద్వారా తెలంగాణ పట్ల ఆయనకున్న మమకారాన్ని చాటుకున్నారు.

రాజకీయ నాయకులతో విభేదించాల్సి వచ్చినప్పుడు తానే స్వయంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ స్థాపించారు. తాను అధ్యక్షుడిగా ఏర్పాటు చేసిన ఈ ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడం కోసం అనేక ప్రజా ఉద్యమాలను ఆందోళనలను చేపట్టింది.

### పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా...

అమ్మ తెలంగాణమా ఆకలికేకల గానమా... మొదలైన గద్దర్ పాటలు ఎంతగానో ప్రసిద్ధి పొందాయి. సినిమా రంగంలోనూ గద్దర్ రాసిన పాటలు ఎంతో ప్రసిద్ధి పొందాయి. ఒరేయ్ రిక్షా సినిమా కోసం రాసిన మల్లెతీగకు పందిరి వోలే మసక చీకటిలో వెన్నెల వోలే నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా అనే పాట నంది అవార్డును గెలుచుకుంది. మాభూమి సినిమాలో బండెనుక బండి కట్టి, రంగుల కల సినిమాలో భద్రం కొడుకో..., జంజంబల్ బరి..., మదనా సుందరి... మొదలైన పాటలు, ఒరేయ్ రిక్షా సినిమాలో ఆపుర రిక్షోడో... మల్లెతీగకు పందిరి వోలే... జాతరెల్లి పోదామే... రక్తంతో నడుపుతాను రిక్షాను..., రాజ్యాంగం చట్టమంటూ, మొదలైన పాటలు రాశారు. జై బోలో తెలంగాణ సినిమాలో ఆయన రాసిన పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా అనే పాట తెరపై వస్తున్నప్పుడు ప్రజలంతా లేచి ఉద్యమావేశంతో సినిమా హాల్లో ఊగిపోయిన సందర్భాలు తెలంగాణ ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.


### 'అమ్మా తెలంగాణమా.. ఆకలి కేకల గానమా'...

'అమ్మా తెలంగాణమా.. ఆకలి కేకల గానమా' పాటలో ఒకవైపు ఆవేదన చెందుతూనే, మరోవైపు 'ఎట్టోళ్ల మట్టి చిప్పవు.. గాయిదోళ్ల గంద్ర గొడ్డలివి' అంటూ తిరుగుబాటును నేర్పడం గద్దర్‌కే చెల్లింది. ప్రభుత్వమిచ్చే 'నంది అవార్డు'ను తిరస్కరించి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. జీవితమంతా ప్రజా పోరాటాల్లో గడిపిన గద్దర్‌ను రాజ్యం 75 ఏండ్ల వయస్సు వరకు 32 పోలీసు కేసులతో వెంటాడింది. తుపాకీ గుండ్లను ఎదుర్కొన్న గద్దర్ 'నన్నా గన్న తల్లూలారా, తెలుగూ తల్లి పల్లెల్లారా.. మీ పాటనై వస్తున్నానమ్మో మా అమ్మాల్లారా' అంటూ ప్రజల వెంట నడిచారు. నక్సల్, మావోయిస్టు ఉద్యమ పంథాలో నడిచిన గద్దర్ 70 ఏండ్లు నిండాక తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. 'భారత రాజ్యాంగమే మనకు రక్ష.. ఓట్ల విప్లవానికి సిద్ధం కావాల'ంటూ తన జీవిత చరమాంకంలో పిలుపునివ్వడం అంటే బహుజనులను రాజ్యాధికారం వైపు పయనించమన్నట్టే. అదే ఆయన చివరి సందేశంగా భావించాలి.

తెలుగు సాహిత్య చరిత్రలో గద్దర్ సాహిత్యం ఒక ప్రత్యేక అధ్యాయం. పాట ప్రక్రియను గురించి ప్రస్తావించవలసి వస్తే గద్దర్ ను విస్మరించి మాట్లాడలేము. ఆరు దశాబ్దాల ప్రజా జీవన గమనానికి గద్దర్ పాట ముడిపడి ఉంది. తాడిత పీడిత ప్రజలకు గొంతుకై విముక్తి గీతాలు ఆలపించిన గద్దర్ తెలుగు సాహిత్యంలో ఒక సువర్ణ అధ్యాయం. ప్రపంచ చరిత్రలోనే ఇటువంటి అరుదైన కళాకారుడిని చూడలేం. సాంస్కృతిక విప్లవోద్యమంలో ఆయన చెదిరిపోని శిలాక్షరం. ప్రజల బాణిని ప్రజల వాణిని ఒడిసి పట్టిన గద్దర్ ప్రజల్లో ఒక తిరుగుబాటు ధోరణిని, ధిక్కార స్వరాన్ని, ప్రశ్నించే తత్వాన్ని నూరిపోశారు. తెలంగాణలో వలసవాదుల దోపిడీని ఎండగట్టిన గద్దర్ ఈ దేశంలో దోపిడీ ఉన్నంతకాలం సామాజిక అపసవ్యాలు రాజ్యమేలుతున్నంత కాలం తెలుగు ప్రజల హృదయాల్లో కొలువై ఉంటాడు. బడుగు జనుల గొంతులో పాటయి ప్రవహిస్తూనే ఉంటాడు.

### అసమానతలపై అసామాన్య పోరాటం..

అసమానతల సమాజంలో గద్దర్ తన జననం నుంచి మరణం వరకు అసామాన్య పోరాటం సాగించారు. గద్దర్ పాలకులు, భూస్వాముల అణచివేత, దోపిడీని ధిక్కరించారు. నూనూగు మీసాల వయసు నుంచే బీఆర్ అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రలను అర్థమయ్యేరీతిలో ఒగ్గు కథలు, బుర్ర కథల రూపంలో వినిపించి మట్టి మనుషుల్లో చైతన్యం రగిలించారు. గోసి, గొంగళి, కాళ్లకు గజ్జెలు, చేతి కర్ర, ఎర్రజెండా కలగలిపిన ఆహార్యంతో గద్దర్ ఒక ట్రెండ్‌ను సృష్టించారు.తన జీవిత కాలమంతా పోరుబాటలో నడిచిన గద్దర్ 2023, ఆగస్టు 6న అనారోగ్యంతో తుదిశ్వాసను విడిచారు.







- సాగర్ల సత్తయ్య
7989117415

# మెదళ్ళను కదిలించే కవితల సమాహారం వాక్యాంతం

"ఒకే ఒక్క సిరా చుక్క లక్షమెదళ్ళ కదలిక" అన్నట్లు శక్తివంతమైన ఒకే ఒక్క వాక్యం ఆలోచింపజేసి ప్రపంచాన్ని మారుస్తుంది. అలాంటి వాక్యాలే సాహిత్యంలో నిలిచిపోతాయి. వాక్యాంతం నిండా మెదళ్ళను కదిలించే కవితలే ఉన్నాయి. అలాగే గురజాడ అప్పారావు పలికిన "దేశమంటే మట్టికాదోయ్ - దేశమంటే మనుషులోయ్" ఈ వాక్యం ఏ కాలానికైనా, ఏ దేశానికైనా వర్తిస్తుంది. ఇందులో విస్తృతమైన సబ్జెక్ట్ ఉంది. దేశాన్ని భౌగోళికంగా చూడటం కాదు. ఆ భౌగోళిక ప్రదేశంలో మనుషులుంటారు. ఆ మనుషుల గురించి ఆలోచించమంటున్నాడు గురజాడ. ఇదే దేశభక్తికి గీటురాయి. ఈ వాక్యాన్ని విశ్లేషించుకుంటూ పోతే ఒక మహా గ్రంధమే రాయొచ్చు.మువ్వా గారు రాసిన కవిత్వమంతా సమాజంలోని దగాపడ్డ మనుషుల గురించే. భారతీయ అలంకారికుడు విశ్వనాథుడు "వాక్యం రసాత్మకం కావ్యం" అన్నాడు. రసాత్మకమైన ప్రతి వాక్యం కావ్యమే అన్నాడు. ఒక చిన్న వాక్యంలో ఎంత విషయాన్నైనా ఇముడ్చవచ్చును. బలమైన వాక్యం సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. అలాంటి ఎన్నో శక్తివంతమైన వాక్యాలు కలిగి ఉన్న "వాక్యాంతం" అనే కవిత్వ పుస్తకమొకటి ఈ మధ్యకాలంలో చదివాను. సూర్యాపేటకు ఒక పుస్తకావిష్కరణ సభకు వెళ్ళినప్పుడు ఖమ్మం నుంచి వచ్చిన పగిడిపల్లి వెంకటేశ్వర్లు అనే సాహిత్య మిత్రుడు కలిసి "వాక్యాంతం" కవితా సంపుటి తో పాటు మూడో ప్రపంచ యుద్ధ కవిత 'వైరాయణం ' అనే దీర్ఘ కవితా పుస్తకాన్ని బహుకరించాడు.

ఈ రెండు పుస్తకాల కృతికర్త మువ్వా శ్రీనివాసరావు గారు. వీరిని నేను భౌతికంగా చూడలేదు. కానీ ఈ రెండు పుస్తకాల వల్ల వారికి స్పందించే మనసు, కవి హృదయం ఉందని స్పష్టంగా అర్థమయింది. కవిత్వం విశ్వజనీన సత్యములను అత్యంత సుందరముగా ప్రకటించు కళారూపము. వస్తువును కవిత్వం సౌందర్యవంతం చేస్తుంది. సౌందర్యవంతమైన ప్రతిదీ ప్రపంచాన్ని ఆకర్షిస్తుంది. కవులు సౌందర్యోపాసకులు. భాషను సర్వాంగ సుందరంగా అలంకరించి రంజింపజేస్తారు. అలా సౌందర్యవంతమైన కవిత్వాన్ని మువ్వా గారు అందించారు. ఈ కావ్యాన్ని తన సహచరికి అంకితంలో నేను అక్షరం/ ఆమెతో కలిశాకే పదాన్ని ఒకే అక్షరాన్ని పదమని ఎవరు కూడా అనరు. ఆ ఒంటరి అక్షరానికి మరో అక్షరం చేరితే పదమవుతుంది.

తనను అనంతమైన పరిపూర్ణ వాక్యంగా మలిచినందుకు ఈ వాక్యాంతం ప్రేమలో...అంటూ అద్భుతంగా అంకితమిచ్చారు. తన జీవిత సహచరి సాహచర్యంతోనే పరిపూర్ణమైన మనిషిగా ఎదిగినానని, లేదంటే అసంపూర్ణ వాక్యం లాగా ఉండేవాడిననే అర్థం స్ఫురిస్తుంది. పరిపూర్ణమైన ప్రతిదీ అర్థవంతమైనదే, సమాజం కూడా సమంజసమైన దానినే స్వీకరించి ఆరాధనా భావంతో ఉంటుంది. అంకితంలోని మాటలు కూడా పాఠకున్ని ఆకర్షించి కవితా పఠనంలోకి తీసుకెళ్తాయి. ఈ వాక్యాల్లో అంత శక్తి దాగుంది. "వాక్యాంతంలో " 174 కవితల్లో అన్ని కవితలు వస్తు వైవిధ్యంలో పాటు శిల్పవైవిధ్యంలో శక్తివంతంగా ఉన్నాయి. ప్రతి కవితలో బలమైన వ్యక్తీకరణ ఉంది. ప్రారంభ కవిత 'కొత్త దుఃఖం. ' ఇందులో ఇలా అంటాడు. ఇంకా వెలవని వానలో / ఒకటీ అరా చినుకుల శబ్దంలా/ పూర్తిగా ఇంకిపోని దుఖం మాట్లాడుతూనే ఉంది.. ఒక దు:ఖం పోగానే మరో దుఖం పుట్టుకొస్తుంది. మానవ జీవితమే దుఖమయం. జీవితం చుట్టూ బాధలే ఉంటాయి. దుఖం మాట్లాడుతుంది. అని కవి కొత్తగా చెప్పాడు.

"వాక్యం ఉంది జాగ్రత్త " అనే మరో కవితలో వాక్యాలను రాసి వదిలెయ్/ తోక పట్టుకు వేళ్ళాడకు/ వాక్యం వానపాము కాదు/ వాక్యం పడగెత్తిన పౌరుషం/ అది నీ మీదే బుసకొడుతుంది. వానపాముకు వెన్నెముక ఉండదు. అది ఎప్పటికి నిటారుగా నిలబడలేదు. నిలబడేదే ఎదిరిస్తుంది. ముందుకు వేగంగా పరుగెత్తగలదు. మువ్వా శ్రీనివాసరావు గారి ప్రతి కవిత్వ వాక్యంలో నిలబడే శక్తి ఉంది. సమాజంలో అన్యాయం జరిగినప్పుడు తన వాక్యాల నిండా పౌరుషాన్ని నింపాడు. ఆ వాక్యం ఎదిరించి పోరాడుతుంది. కవితా శీర్షికలోనే వాక్యం ఉంది జాగ్రత్త అంటున్నాడు. ఆ వాక్యం ఎక్కడ ఉన్నట్లు ? అంటే పీడితులవైపు, బాధితుల వైపు ఉండవచ్చునేమో.




అక్కడ నీవు రక్షకుడిగా గాక బాధించేటందుకు వెళ్తే వాక్యం పడగెత్తిన పౌరుషమవుతుందని హెచ్చరిస్తున్నారు కవి. వాక్యాలను జాగ్రత్తగా రాయమంటున్నారు.కవిత - కవి- రాజ్యం అనే కవితలో ఆ రాజ్యానికి నేను రాజును అంటాడు. ఆ రాజ్యాధికారం నాకు రావాల్సింది. అన్ని త్యాగాలు చేసింది నేనే. కాకుంటే మాయామాటలతో ప్రజలను లోబరుచుకుని రాజ్యాధినేతవు అయ్యావు. సింహాసనం ఎక్కేందుకు వాడిన ఎత్తుపీటను నేనే అంటున్నాడు. శవమై నీకు మెట్టులా ఉ పయోగపడ్డానని, త్యాగాలన్నీ మావి, అధికారం మీదయ్యింది.అంటూ గుప్పెడు తెరబొమ్మలు దేనికి తొత్తులయ్యారో అలా ఉంచు పన్నెండొందల పసిపిల్లల బతుకులేమయినాయో చూడమంటున్నాడు. సింహాసనం మీద కూర్చున్న ప్రతివాడు పాలకుడు కాదు అనే ముగింపు ఈ కవితలో ఉంది. ప్రజా సంక్షేమంతో పాలించని వాడు పాలకుడు ఎలా అవుతాడని ఆగ్రహం, ఆవేదన ఇందులో ఉంది. ఇందులో వర్తమాన వాస్తవికత దాగి ఉంది. కాకుంటే కొత్త చూపుతో చూడాలి. మరోచోట వాక్యామూ ముఖం కడుక్కోవాల్సిందే / మెరిసేందుకుకాదు/మలినాలను పోగొట్టుకునేందుకు. మువ్వా గారు వాక్యానికి ముఖం ఉన్నదంటున్నాడు. అక్కడ మలినాలు కడుక్కోవాలంటున్నాడు. మలినాలు చేరితే ఆ వాక్యాన్ని ఎవరు మాత్రం ఇష్టపడతారు. కళాహీనంగా ఉంటుంది.

"ఓ పువ్వా జాగ్రత్త " అంటున్నాడు. పువ్వుకు త్యాగం చేయడం తప్ప మరేమీ తెలియదు. రంగులు ఇస్తుంది అది మన కంటికి ఇంపుగా ఉంటుంది. సువాసనలు వెదజల్లుతాయి. నవ్వులు నమిలి తినేవాడకి / నీ పరిమళాలు ఓ లెక్కా. / త్యాగాలను కబ్జా చేసేవాడికి నీ రంగును మింగేయడం ఓ లెక్కా..? వికసించే సమయాన్ని కూడా చెప్పొద్దంటున్నాడు. చెప్పితే వాడి ఖాతాలో రాసుకుంటాడట. త్యాగం చేసేవాళ్ళు ఒకరయితే భాగ్యం అనుభవించే వాళ్ళు మరొకరు. నేటి వర్తమాన కాలంలో దేన్నైనా కబ్జా చేస్తున్నారు. త్యాగం చేసే వాళ్ళు పక్కకు పోతున్నరు. ఇక్కడ త్యాగాన్ని కబ్జా అనే పదప్రయోగం అద్భుతంగా ఉంది. చీమ పుట్టలు పెడితే పాములు ఆక్రమించినట్లు, నిష్క్రియంపరు ముందుకొచ్చి అన్నీ ఆక్రమిస్తున్నారు. ప్రజలే చైతన్యం కావాలి. మరోచోట ప్లాస్టిక్ వాక్యం అంటున్నాడు. ఆ వాక్యంలో ఎలాంటి సహజత్వం ఉండదని, సువాసనలు అసలే ఉండవు. అలా అనడంలో "వాక్యం" గురించి గొప్పగా చెప్పారు. రాజ్య వికృతి అనే మరో కవితలో ప్రశ్నల గర్భసంచి తొలగిస్తే ఇక పుట్టుకే ఉండదు కదా. ప్రశ్నలు జనించవు. ప్రశ్నే లేకపోతే పాలకులకు భయమే ఉండదు. ప్రశ్నల గర్భసంచి తొలగిస్తే వికృతిగాక మరేమిటి! రాజ్యం వికృత చేష్టను నిర్భయంగా చెప్పగలిగారు.ఇలా ఈ సంపుటి నిండా ఎన్నో కవితల్లో రసాత్మకమైన కవితలు ఉన్నాయి. వాటన్నింటిని గురించి ప్రస్తావించలేను. ప్రతి కవితలో కవిత్వమే తొణికిసలాడుతుంది. కవికి ప్రాపంచిక దృక్పథం, ఒక తాత్విక చింతన, సామాజిక బాధ్యత ఉన్నట్లు కవితల్లోకి వెళ్ళితే అర్థమవుతుంది. అక్షరాలను మార్కెట్టుకు తాల్చి/వెలిగి పోతుంటాడొకడు/ అక్షరాలను మార్పుకోసం వాటి /వేధించబడుతుంటాడొకడు అన్నీ నిజాలే చెప్పేవారు/ నాతో సహా నాకంత వరకు ఎవరూ తగల్లేదు. చివరి కవితా వాక్యంలో ఎంతో నిజాయితీ ఉంటే తప్ప అని తనను తాము వెల్లడించుకున్నాడు. అక్షరాలను సామాజిక మార్పుకోసం వాడిన వాళ్ళు జైళ్ళపాలయి నిర్భందించబడ్డారు. బలమైన వాక్యాలే సమాజాన్ని నిలబెడతాయి. ఎంతటి బీభత్స పెనుగాలులు వచ్చినా ఆ వాక్యం కూలిపోదు.ఎన్ని కాలలకైనా నిలబడుతుంది. సంప్రదాయ కవిత్వంతో యుద్ధం చేస్తుంది. అంతిమంగా గెలిచి తీరుతుంది. అది ప్రజాకవిత్వానికీ ఉండే లక్షణం. ప్రజల వైపు నిలబడి ప్రజా కవిత్వం రాస్తున్నమువ్వా శ్రీనివాసరావు గారికి అభినందనలు తెలియజేస్తూ "మనిషిని మనిషిగా మార్చే శక్తి వంతమైన వారి వాక్యాలకు నా నమస్సులు.



- పెరుమాళ్ళ ఆనంద్
సృజన సాహితీ అధ్యక్షులు నల్లగొండ
9985389506

## పర్యావరణ బాగుకోసం ఒప్పందం



**విశ్వంభర, హైదరాబాద్:** పర్యావరణ బాగు కోసం మేము సైతం అంటూ నారాయణగూడ లోని కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థలు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ తో పర్యావరణ పరిరక్షణ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకై యువత గ్రామీణ స్థాయి నుంచే మార్పు తీసుకువచ్చే విధంగా ప్రయత్నం చేయాలని, మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యంగ్ ఇండియా అని పిలుపునిచ్చారు. ఆ విధంగా యూత్ ఫర్ ఎన్విరాన్మెంట్ అనే స్లోగన్ తో పర్యావరణ పరిరక్షణకై మీ వంతు బాధ్యతగా కృషి చేయాలి ఆ దిశగా అడుగులు వేయాలని, యువత జీతం కోసం కాకుండా జీవితం కోసం ఆలోచించే విధంగా సామాజిక బాధ్యతతో ముందుకు అడుగులు వేయాలని, ప్రకృతిని దైవంగా పూజిస్తున్న మన భారతదేశంలో ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత కూడా మన అందరి పైన ఉన్నదని, వృక్ష సంపదను పెంచడానికి యువత తాము దినచర్యలో భాగంగా వీటిపై శ్రద్ధ చూపాలని, పచ్చదనం ఉన్నచోట ఆహ్లాదం ఉంటుందని ఆ దిశగా యువత సామాజిక బాధ్యతతో ముందుకు నడవాలని యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేశవ్ మెమోరియల్ కళాశాల సెక్రెటరీ అన్నదానం సుబ్రహ్మణ్యం , జాయింట్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి , ట్రేజరర్ ప్రభాకర్ రెడ్డి , డైరెక్టర్ నాగేశ్వర రావు లీల లక్ష్మ రెడ్డి , గోపాల్ రెడ్డి అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీకి నివాళులర్పించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**విశ్వంభర, షాద్ నగర్ :** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, నేతలు చెంది తిరుపతి రెడ్డి, కాశినాద్ రెడ్డి, రఘు నాయక్, అగ్గనూర్ బస్వ%శీ%, సాదిక్, ఖాదర్ ఘోరీ, శ్రీకాంత్ రెడ్డి దామోదర్ రెడ్డి,శ్రీనివాస్ , ఇబ్రహీం, అన్వర్ , ఖదీర్, మహబూబ్, శ్రీహరి, ముబారక్ అలీ ఖాన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి



**విశ్వంభర, షాద్ నగర్ :** జాతిపిత మహాత్మా గాంధీ 77 వ వర్ధంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో న్యూ పవర్ పంపు అకాడమీ కోచ్ అహ్మద్ ఖాన్ మాస్టర్ అధ్యర్యంలో కుంగ్ ఫు విద్యార్థులతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయ సాధనకు, ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ సందర్భంగా కుంగ్ ఫు విద్యార్థులు గాంధీ విగ్రహం ముందు కుంగ్ ఫు ప్రదర్శన చేశారు.

## పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా బ్రోచర్ విడుదల

- గాంధీ సిద్ధాంతాలను దేశవ్యాప్తం చేస్తాం
- టీపీసీసీ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి భోగ జగదీష్



**విశ్వంభర, హైదరాబాద్:** ఏఐసీసీ ఇచ్చిన ఆదేశాల మేరకు గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ సిద్ధాంతాలను, అహింస పద్ధతులను దేశ వ్యాప్తంగా తీసుకువెళ్లేందుకు టీపీసీసీ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి భోగ జగదీష్ ఆధ్వర్యంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా బ్రోచర్ విడుదల చేశారు. గాంధేయ అహింస పద్ధతులను నేటి తరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పీసీసీ చీఫ్ పిలుపు ఇచ్చారు.

## మహాత్ముడుకి ఆర్యవైశ్యులు ఘన నివాళి



**విశ్వంభర, నార్కట్పల్లి:** జాతిపిత, శాంతి దూత మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకొని పట్టణంలోని వాసవి భవన్ లో ఆర్యవైశ్యులు ఘన నివాళులు అర్పించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి గాంధీజీ అమర్ రహే అంటూ తమ శ్రద్ధాంజలి నీ తెలియజేశారు. ఈ కార్యక్రమములో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు పాల్వాయి భాస్కర్ రావు మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## కళాజాతా సాంస్కృతిక అవగాహన ప్రదర్శనలు



**విశ్వంభర, మహబూబాబాద్:** కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గురువారం మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం మండలంలోని బయ్యారం, గంధం పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఉప్పలపాడు, ఎస్ పి తండా, సింగారం గ్రామాలలో జిల్లా డిపిఆర్ఓ ఆధ్వర్యం లోని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందాలు రవీందర్ గౌడ్, కొమిరె వెంకన్నల ద్వారా కళాజాతా నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ కార్యక్రమాలైనా పరిసరాల పరిశుభ్రత, కీటక జనిత వ్యాధులు మలేరియా డెంగ్యూ,చికెన్ గునియా ఫైలేరియా, హెచ్ఐవి ఎయిడ్స్, భ్రూణ హత్యలు, సాధారణ ప్రసవాలు గురించి పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఎస్పి తండా, సింగారం గ్రామాలలో జరిగిన కార్యక్రమానికి జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హాజరై మాట్లాడుతూ జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా వుందని, వైద్య పరికరాలను మంచి అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని, సమాజములోని ప్రతి పౌరుడు బాధ్యత వహిస్తూ కాలువలలో, ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలలో చెత్త చెదారం వేయకుండా గ్రామపంచాయతీ వారి కుండీలలో మాత్రమే వేసి వారి గ్రామాలను పరిశుభ్రముగా వుంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమములో గంధంపల్లి వైద్యాధికారి ఉస్మాన్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు పురుషోత్తం, స్థానిక ఎం ఎల్ హెచ్ పి, పవన్, అశోక్, సూపర్వైజర్ కృష్ణ చైతన్య, అన్నామేరి, స్థానిక గ్రామ కార్యదర్శి రాంబాబు, ఆరోగ్య కార్యకర్త సుధారాణి, కవిత, సుజాత, ఆశా కార్యకర్తలు, కళాజాత బృందం, కొమిరె వెంకన్న, రవీందర్ గౌడ్ సత్యనారాయణ, నరేష్ యుగంధర్, రాజ్యలక్ష్మి, కీర్తి, రోజా రాణి, ప్రజలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీకి ఘన నివాళులు



**విశ్వంభర, జనగామ :** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాలమేరకు మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా దేవరుప్పుల మండలం,సీతారాంపురం గ్రామంలో ఉన్న గాంధీ విగ్రహానికి మండల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గవర్నమెంట్ ఇచ్చిన హామీలు రైతుబంధు 15000/- రెండు లక్షల రుణమాఫీ,కళ్యాణ లక్ష్మి లక్ష రూపాయలు, తులం బంగారం, వృద్ధులకు 2000/- నుండి 4000/-వికలాంగులకు 3000/-నుండి 6000/- విద్యార్థినిలకు ఉచిత స్కూటీలని హామీలు నెరవేర్చి వారికి కనువిప్పు కలగాలని దేవరుప్పుల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశంగౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బస్వ వెంకన్న, మాజీ ఎంపీపీ కొల్లూరి సోమన్న, మాజీ ఏఎంసి డైరెక్టర్లు జిలేందర్ రెడ్డి, కుతాటి నరసింహ, మండల నాయకులు ఎండి కాసిం, పాము మోహన్, తాటిపల్లి మహేష్, గేమా నాయక్, రుద్రోజ్ వీరాచారి, మేకల సంపత్, ఫైండ్ల రవి, బస్వ రమేష్, యాకూబ్ పాషా, మండల యూత్ అధ్యక్షుడు నవీన్ నాయక్, మండల యూత్ ఉపాధ్యక్షుడు యాకుబ్ పాషా, నాయకులు దేవా నాయక్, కాముని సత్తయ్య, గుంటి కొమురయ్య, వరికల శివాజీ, తొడల కొమురయ్య, తునికి అబ్బయ్య, కూరాకుల కుమార్, బస్వ యాకన్న, కూరాకుల అంజి, యూత్ నాయకులు తోలుపునూరి గోవర్ధన్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో రైతు ఆత్మహత్యలు లేవు

**పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**



**విశ్వంభర, సంగెం :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే సుమారు 420 మందికి పైగా రైతు ఆత్మహత్యలు జరిగాయి. రైతు ఆత్మహత్యలు జరగకూడదని, రైతులకు భరోసా కల్పించాలనే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతు ఆత్మహత్యలు లేవని , మండలంలోని పల్లారుగూడ గ్రామంలో అప్పుల భాదతో ఆత్మహత్య చేసుకున్న రైతు బానోతు తిరుపతి కుటుంబాన్ని నేడు కమిటీ సభ్యులు ,మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పరామర్శించే కార్యక్రమం ఉండే..కానీ ఈ పర్యటన జరిగితే మండలంలో కాంగ్రెస్ కనుమరుగు అవుతుందని బయపడి పోలీసు అధికారులపై ఒత్తిడి తెచ్చి పర్యటనకు ఎన్నికలకోడ్ అనే సాకుతో అనుమతి నిరాకరించారని మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసారు. రైతులకు భరోసా కల్పించేందుకు ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని కుట్రలు చేసి రద్దు చేసిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిది దిక్కుమాలిన చర్య అని మండిపడ్డారు. ప్రజలు అంతా గమనిస్తున్నారు. మీరు ఇచ్చిన 420 దొంగ హామీలు, చేస్తున్న మోసాలు, వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో పెరుగుతున్న చర్మ సమస్యలు

**డాక్టర్ ఉష గడ్డం**



**విశ్వంభర, బషీర్ బాగ్ :** గత కొన్ని రోజులుగా హైదరాబాద్ నగరంలో చలి పెరగడంతో వాయునాణ్యత సూచి (ఏక్యూఐ) దారుణంగా ఉండడంతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని మణికొండ అపోలో క్లినిక్లో జనరల్ ఫిజిషియన్, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ ఉష గడ్డం అన్నారు.చర్మ సమస్యలు బాగా ఎక్కువయ్యాయని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.తమ క్లినిక్ కు రోజూ 5-8 మంది రోగులు డెర్మటైటిస్, మొటిమలు, పిగ్మెంటేషన్, ఎలర్జీల్లాంటి చర్మసమస్యలతో వస్తున్నారనీ తెలిపారు. ఇదంతా వాయుకాలుష్యం వల్లనే వస్తోందనీ, వాయునాణ్యత, ఆరోగ్యంపై దాని ప్రభావం తెలియాలంటే ఏక్యూఐ అనేది కీలకం అన్నారు. 50 లేదా అంతకంటే తక్కువ ఏక్యూఐ ఉంటేనే వాయునాణ్యత బాగున్నట్లు అని మన చర్మం వాయుకాలుష్యానికి బాగా గురవుతుంటుందన్నారు. మసి, పొగ, అచ్చు, పుప్పొడి, మీథేన్, కార్బన్ మోనాక్సైడ్ లాంటి కాలుష్య కారకాలు నేరుగా తగలడం, జుట్టు ద్వారా వెళ్లడం, పీల్చుకోవడంతో చర్మంలోకి చొచ్చుకుపోతాయన్నారు. హైదరాబాద్ లోని ఇతర ప్రాంతాల అపోలో క్లినిక్ వైద్యుల వద్దకు కూడా రోజూ ఇలాంటి సమస్యలతో చాలామంది రోగులు వస్తున్నారనీ, వాయు కాలుష్యాలు చర్మం సహజ అవరోధాన్ని బలహీనపరుస్తాయని తెలిపారు.

## ఓ మహాత్మా.. మీరు మళ్లీ పుట్టాలి

**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు మరిచిందని ఆయన విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి. గురువారం మహేశ్వరం నియోజకవర్గం లోని సరూర్నగర్ డివిజన్ సీనియర్ నాయకులు లోకసాని కొండల్ రెడ్డి, ధర్పల్లి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించి ఇచ్చిన 420 హామీల వినతి పత్రాన్ని మహాత్మా గాంధీ విగ్రహానికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓ మహాత్మా మీరు మళ్ళీ పుట్టాలి ఎందుకు అంటే ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు(420) రోజులు గడుస్తున్నా 420 హామీలు ప్రజలకు ఇచ్చి ఏ ఒక్క హామీ కూడా సరిగ్గా నెరవేర్చలేదని ముఖ్యంగా అన్ని రంగాలను నిర్వీర్యం చేశారని పరిపాలన పై ఎలాంటి అవగాహన లేకుండా ఇష్టానుసారంగా పరిపాలిస్తున్నారని అన్నారు. వారిచ్చిన 420 హామీలు ఇచ్చి మర్చిపోయారని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఓ మహాత్మా మీరైనా ప్రభుత్వానికి సద్ది చెప్పి ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని ఇచ్చిన హామీ తప్పకుండా నెరవేర్చాలని ఈ ప్రభుత్వానికి మీ ద్వారా విన్నవించుకుంటున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, సుశీల రెడ్డి , ఇస్మాయిల్, ,గౌని శ్రీనివాస్ గౌడ్ , పెండ్యాల నాగేష్, సాజిద్, రాజేష్ గౌడ్ , గిరి , శ్రీనివాస్, రిషి,సాదిక్ , జహీర్ , విజయ్ ,ప్రత్యుష్ , మహేందర్ , గోవర్ధన్ రెడ్డి ,రాగం సునీల్ , రాజు , మానస్ , సాలమ్మ ,రజాక్ , తదితరులు పాల్గొన్నారు.

## యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ వద్దు

**టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధోజు కవిత**



**విశ్వంభర, నెల్లికుదురు:** యూనిఫైడ్ పెన్షన్ స్కీం,కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ విధానాలు ఎంత మాత్రం పాత పెన్షన్ విధానానికి ప్రత్యామ్నాయం కాదని వెంటనే రద్దు చేయాలని టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధోజు కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఆలేరులో గురువారం టి పి టి ఎఫ్ కార్యదర్శి బిక్షపతి అధ్యక్షతన శాఖ సమావేశం జరిగింది. దీనికి హాజరై ఆమె మాట్లాడుతూ.. విధానాల రద్దు రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంటుందని కేంద్రం బుకాయించడం సరైనది కాదన్నారు.జిల్లా అధ్యక్షులు బలాస్టి రమేష్ మాట్లాడుతూ.. ద్రవయోల్బణానికి అనుగుణంగా మధ్యాహ్న భోజన రేట్లు పెంచి కార్మికులను ఆదుకోవాలని, కుల గణన రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎంఈఓ రాందాస్,జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్, భిక్షపతి, జయప్రకాశ్, స్రవంతి, సైదులు పాషా పాల్గొన్నారు.

## ఘనంగా సోమిడి తాళ్లపద్మావతీ ఒలంపియాడ్ స్కూల్‌లో స్కిన్ టిల్లా వేడుకలు



**విశ్వంభర, హన్మకొండ:** కాజీపేట మండలం లోని సోమిడి లో తాళ్ల పద్మావతి స్కూల్లో జరిగిన స్కిన్ టిల్లా 2025 వేడుకలు చైర్మన్ తాళ్ల మల్లేశం డైరెక్టర్ వంశీ వరుణ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాజీపేట ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామారావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే విద్యను ఆటపాటలను అవలంబించాలని అన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులు చిన్ననాటినుండే పిల్లలకు విద్య యందు ఆట పాటలపై శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ విధంగా చేసినట్లయితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. డైరెక్టర్ వంశీ మాట్లాడుతూ తాళ్ల పద్మావతి స్కూల్ లో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇలాంటి విద్యార్థుల వలన మా తాళ్ల పద్మావతి స్కూలుకు ఎంతో గాను పేరు ప్రతిష్టలు తెచ్చి పెట్టారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కాజిపేట ట్రాఫిక్ ఎస్సై రామారావు, పాడుతా తీయగా ఫేమ్ యాగప్రియ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు తాళ్ళవరుణ్,వైష్ణవి,తాళ్ల వంశీ,చైతన్య,హెడ్మాస్టర్, ఉపాద్యాయుని,ఉపాద్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన బస్టాండ్ పనులను పరిశీలించిన చేవెళ్ల ఎమ్మెల్యే



**విశ్వంభర, చేవెళ్ల :** మండల కేంద్రంలో 6 కోట్ల నిధులతో నిర్మిస్తున్న నూతన బస్టాండ్ పనులను స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ దాదాపు పని మొత్తం పూర్తయింది. త్వరలో దీనిని ప్రజలకు అందుబాటులో తెస్తామని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. హెచ్ఎండిఏ వారు 6 కోట్లు ఇవ్వడం పట్ల వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, ఆగి రెడ్డి, దేవర వెంకటరెడ్డి, టేకులపల్లి శీను, వీరేందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పెంటయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## షాబాద్‌లో వాటర్ సర్వీసింగ్ సెంటర్ ప్రారంభం



**విశ్వంభర, షాబాద్ :** మండలంలోని సంకేపల్లి గూడా గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన మహేందర్ వాటర్ సర్వీసింగ్ సెంటర్ ను చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య తో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ వైస్ చైర్మన్ కావాలి చంద్రశేఖర్, తాళ్లపల్లి మాజీ ఎంపిటిసి మద్దూరి పాండు, మల్లారెడ్డి గూడ మాజీ సర్పంచ్ జంగయ్య పాల్గొన్నారు.

## పాతబస్తీలో ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి



**విశ్వంభర, యాకత్ పుర :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా యాకత్ పుర , చంద్రాయణ గుట్ట నియోజక వర్గంలో మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్యాగ్రహమే ఆయుధంగా అహింస మార్గంలో పోరాడి యావత్ భారత్ జాతికి స్వేచ్ఛ అందించిన ఘనత మహాత్మా గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యాకుత్ పుర నియోజకవర్గ ఇంచార్జి కె. రవిరాజ్, చంద్రాయణ గుట్ట నియోజకవర్గఇంచార్జి బోయ నాగేష్, మీడియా సెక్రెటరీ మామిడి గోపి, అల్లం భాస్కర్, రాజు యాదవ్, కృష్ణ కుమార్, అల్లం రాకేష్, శశి యాదవ్, నరసింహ, ఎన్ దాస్, కుమార్. నళిని గౌడ్, అబ్దుల్ ఖాదర్ ఫిరోజ్. అబ్దుల్ గని. తదితరులు పాల్గొన్నారు.

## జాతిపితకు నివాళులర్పించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే



**విశ్వంభర, హనుమకొండ :** కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు , ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్ ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్సీ, అధ్యక్షురాలు, తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, డివిజన్ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



**విశ్వంభర, షాబాద్ :** మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి సంబంధించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారాక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్యతో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పిసరి సురేందర్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ , పెంటయ్య , ఇంచార్జ్ ఎమ్మార్వో కృష్ణయ్య ,ఎంపిడిఓ అపర్ణ , పీసరి జగన్మోహన్ రెడ్డి, కుమ్మరి వేణుగోపాల్, రాజేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, టేకులపల్లి రాఘవేందర్, పోతుగల్ మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్, కుమ్మరి చెన్నయ్య, బండ మహేందర్ గౌడ్ ,మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పాకాల వాగు నీటిని విడుదల చేయాలి

**మాజీ ఎంపీ మాలోత్ కవిత**



**విశ్వంభర, మహబూబాబాద్ :** గూడూరు మండలంలో ఒక కార్యక్రమానికి వెళ్లి వస్తున్న సందర్భంగా తన వద్దకు వచ్చిన నాయకులు కార్యకర్తల, రైతుల విజ్ఞప్తి మేరకు ఇరిగేషన్ ఈఈ ఫోన్ చేసి మహబూబాబాద్ జిల్లా పరిధిలోని పాకాల వాగును ఆధారంగా చేసుకుని వ్యవసాయం చేస్తున్న పొలాలకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేసారు. గూడూరు మండలం లో పొనుగోడు గూడూరు అయోధ్యపురం గోవిందపురం దామరావంచ తాళ్లపాటి లక్ష్మీపురం రెడ్యాల పెనుగొండ గ్రామాల ప్రజలు వాగును ఆధారంగా చేసుకుని యాసంగి సాగు చేసారని, నీటి కొరత వల్ల పొలాలు ఎండిపోతున్నాయాని రైతులు ఆవేదన చెందుతున్నారని ఇట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పాకాల వాగు నీటిన వెంటనే వారి సాగు కొరకు విడుదల చేయాలి అని కవిత అధికారులను కోరారు.

## మున్నూరు కాపు గ్రామ అధ్యక్షుడిగా చందు



**విశ్వంభర, ఇనుగుర్తి:** మానుకోట జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం మున్నూరు కాపు గ్రామ శాఖ అధ్యక్షులుగా ఆది చందు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నీలం శ్రీనివాస్,చందా గోపి సమక్షంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి కామినేని హరికృష్ణ,కోశాధికారి దాసరి ఉప్పలయ్య,ఉపాఅధ్యక్షులు పాశం యాకాంబ్రం,రాయిలి శ్రీనివాస్,సహాయ కార్యదర్శులు రాయిలి ఉపేందర్,కొక్కు ప్రభాకర్, గౌ.సలహాదారులు కామినేని బాలరాజు, రాయిలి సామయ్య,సోషల్ మీడియా కన్వీనర్ పాశం సతీష్,యూత్ అధ్యక్షుడిగా బొల్లం మధు లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చందు మాట్లాడుతూ..మున్నూరు కాపుల సమస్యలపై అందరి సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి తన పదవికి సహకరించిన సంఘం నాయకులకు,కులస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల,గ్రామ నాయకులు కులస్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఇంజనీర్లతో భేటీ



**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లాలో రానున్న వేసవి లో మెరుగైన నాణ్యమైన విద్యుత్ అందించాలని జిల్లా విద్యుత్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ సర్కిల్ ఆఫీస్ జె నరేష్ ఆధ్వర్యంలో జిల్లా విదుత్ నోడల్ ఆఫీసర్ శ్రీధర్ ,సెక్షన్ ఇంజనీర్స్ సబ్ డివిజన్, ఇంజనీర్స్ తో భేటీ నిర్వహించారు. ఇందులో భాగంగా అంతరాయాలు లేకుండా రానున్న లోడ్ కు గుర్తించి మీదుగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఇది దవాఖానా..? దరిద్రమా...?



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం గ్రామంలోని ప్రభుత్వ పల్లె దవాఖానాను 30/1/2025 రోజున యాదాద్రి జిల్లా ధర్మసమాజ్ పార్టీ నాయకులు సందర్శించడం జరిగింది. ఈ క్రమంలో దావాఖానాలో మందులు, టానిక్కులు తేదీ దాటిపోయినవి ఉండటాన్ని గమనించారు. ఈ విషయంపై సిబ్బందిని అడగగా పైనుండి ఇలాంటి మందులే పంపుతున్నారని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని, గర్భిణీ స్త్రీలకు, వృద్ధులకు సంబంధించిన కనీస అవసరాలు, మూత్రశాలలు, ఫ్యాన్లు లేవని, దవాఖానకు సంబంధించి దవాఖానకు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వాలు చాలా సం.రాల నుండి ఇవ్వడం లేదని, ప్రహరీ గోడ లేదని, కిటికీలు ఊడిపోయి ఉండటం వలన కోతుల బెడదతో రోగులు, ప్రజలు హడలి పోతున్నారని, సిబ్బంది, రోగులు కోతులు కరవడంతో పేషెంట్స్ కి వ్యాక్సిన్ అందుబాటులో లేదని, వ్యాక్సిన్ లేకపోవడంతో పేషెంట్స్ దూర ప్రాంతాలకు వెళ్ళి చూపించుకునే పరిస్థితి లేదని, కాబట్టి వెంటనే వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకు రావాలని తెలియజేశారు. పూర్తిగా పెచ్చులూడిపోయి సిబ్బంది, రోగులపై పడుతున్నాయి. సిబ్బంది పేషంట్ గా మారుతున్నారని, వచ్చిన పేషెంట్లు ఎక్కువగా బాధపడుతున్నారని, మొత్తంగా ఈ దవాఖాన దౌర్భాగ్య స్థితిలో ఉందని, 6000 మంది జనాభా కలిగి ఉన్న గ్రామంలో ఒక ఎంబిబిఎస్ డాక్టర్ ఉండాల్సిన అవసరం ఉందని, ఈ పరిస్థితులు అన్ని డి.ఎం.హెచ్.ఓ, జిల్లా కలెక్టర్ ల దృష్టికి తీసుకు పోతామని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల నరేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నకిరేకల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి యతకుల వెంకన్న, ధర్మ సమాజ్ పార్టీ రామన్నపేట మండల ఉపాధ్యక్షులు మేడి మల్లేష్, ప్రధాన కార్యదర్శి జినుక గోవర్ధన్, నకిరేకంటే నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే ఆరోపణలు

**కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ జన్నరాజు**



**విశ్వంభర, బోడుప్పల్:** మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని 13వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జన్నరాజు మండిపడ్డారు. బడుగు వర్గాల యువకులు రాజకీయాల్లో ఉండకూడదా?. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపైన చర్యలు తప్పనిసరి. గురువారం నాడు దేవేందర్ నగర్ లోని తన నివాసం నందు విలేఖరుల సమావేశంలో కాలనీ వాసులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జన్నరాజు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి రెక్కలు ముక్కలు చేసుకొని కుటుంబ సభ్యుల మద్దతుతో రాజకీయాల్లోకి వచ్చి అటు రాజకీయాల్లో ఇటు వ్యాపారంలో ఎదుగుతున్న తనపై కొందరు వ్యక్తులు ఆరోపణలు చేస్తూ తనతో పాటు తన కుటుంబ సభ్యులను కూడా మానసిక శోభకు గురి చేస్తూ తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. దేవేందర్ నగర్ రిక్షపుల్లర్ కాలనీలో తన తండ్రి రిక్ష కార్మికుడిగా, తల్లి పలు ఇండ్లలో పని చేసి మమ్మల్ని ఈ స్థాయికి తీసుకువచ్చిందని,తను చదువు పూర్తి కాగానే ప్రయివేటు ఉద్యోగం చేసుకుంటూ కుటుంబ సభ్యుల సహకారంతో చిన్నపాటి వ్యాపారం మొదలు పెట్టి ప్రజా సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. అయితే 2020 సంవత్సరంలో వచ్చిన కార్పొరేషన్ ఎన్నికలలో తనను పోటీ చేయకుండా అడ్డుకున్నారని అయిన పార్టీ సూచించిన అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసి గెలిపించానని తెలిపారు.అప్పటి నుండే తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవడానికి తనపై తప్పుడు కేసులు పెట్టించి తనను ఇబ్బందులకు గురిచేసారని వాపోయారు. కొంతమంది పత్రిక మిత్రులు నాపై తప్పుడు రాతలు రాస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో నాకు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ గొడవ జరిగిన కొంతమంది నా పేరుతో మీడియా ముందల నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు అని తనపై ఇకముందు ఎలాంటి అనుచిత వాక్యాలు చేసిన, మాట్లాడిన ఊరుకునేది లేదని చట్టపైన చర్యలు తప్పకుండా తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు దేవేందర్ నగర్ కాలనీ అధ్యక్షులు దుప్పల్లి భగవంతు, మాల్ల కృష్ణ, జోగు సుధాకర్, మొగిలిపాక శంకర్, కాటం స్వామి, బైరు మధు, కర్ర బీరప్ప, సానిక శశి కుమార్, మురళి గౌడ్, ఏనుగు శ్రీశైలం, జన్న ధర్మయ్య, నకిర్త సోమేశ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా.. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించు..!

- కాంగ్రెస్ 420 హామీలపై గాంధీ విగ్రహానికి వినతిపత్రం..
- 420 హామీలను వెంటనే నెరవేర్చాలని పీర్జాదిగూడ బీఆర్ఎస్ శ్రేణుల నిరసన



**విశ్వంభర, పీర్జాదిగూడ:** ఓ మహాత్మ కాంగ్రెస్ పార్టీకి,ప్రభుత్వానికి మంచి ఆలోచన ప్రసాదించి వారిచ్చిన 420 హామీలను వెంటనే నెరవేర్చే విధంగా బుద్ధి ప్రసాదించాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నగర పరిధిలో గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి నేటికి 420 రోజులు అయిన సందర్భంగా ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారెంటీలు, 420 హామీలు పూర్తి చేయనందుకు నిరసనగా గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, ఏనుగు మనోరంజన్ రెడ్డి,జావీద్ ఖాన్,నిర్మల,ప్రభు,ఆంజనేయులు,బాలరాజు,యాసారం శ్రీనివాస్,కర్రే కుమార్,వెంకన్న,శంకర్, కిరణ్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేసేంతవరకు పోరాటం ఆగదు

**మహేశ్వరం బిఆర్ఎస్ నాయకులు**



**విశ్వంభర, మహేశ్వరం :** మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు పి.ఏ.సి.ఎస్ చైర్మన్ మంచే.పాండు యాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం మండల కేంద్రంతో పాటు పలుగ్రామలలో గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి అలాగే వినతిపత్రాలు సమర్పణ చేశారు. మంచే పాండు యాదవ్ మాట్లాడుతూ రైతులను. మహిళలను, వృద్ధులు, వికలాంగులను, ఇలా ప్రతి వర్గాన్ని నయవంచనకు గురిచేసిన కాంగ్రెస్ సర్కార్ కు కళ్ళు తెరిపించాలని కోరుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలవిగాని హామీలను ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని, డిక్లరేషన్లు, హామీలు,గ్యారంటీల పేర్లతో దశాబ్దాలపాటు దగా పడ్డ తెలంగాణ బిడ్డలు మళ్లీ అవే కష్టాలు అవే కన్నీళ్ళలో చిక్కుకుని విలవిలలాడుతున్న వేళ ఈ దద్దమ్మ సర్కారుకు 420 బూటకపు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం 420 హామీలను అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం ఆగదని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మంత్రి రాజేష్, బండారి లింగం, లింగ నాయక్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ అంబయ్య యాదవ్, డైరెక్టర్ కడమోని ప్రభాకర్. పోల్కం బాలయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు ఆదిల్ హాలీ , నాయకులు శ్రీశైలం , మిద్దింటి యాదగిరి, హాజీ బాబా, శివ, మోహన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విపత్తుపై అవగాహన




**విశ్వంభర, షాద్ నగర్ :** పద్మావతి కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు జాతీయ విపత్తులు సంభవించినప్పుడు మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి, ఎదుటివారిని ఇలా రక్షించాలి అనే విషయాలపై గురువారం కన్నులకు కట్టినట్టుగా చూయించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొనసాగించిన ఎన్డిఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ గౌతం తన సిబ్బందితో పలు రకాల రక్షణ సామాగ్రి ద్వారా, భూకంపాలు జరిగినప్పుడు ఎలా రక్షించుకోవాలి, తుఫాను వచ్చినప్పుడు ఎలా రక్షించుకోవాలి, నీటిలో మునిగినప్పుడు ఎలా ఎవరిని రక్షించుకోవాలి, ఆపదలో ఉన్నప్పుడు ఎలా రక్షించుకోవాలి, ఒక మనిషికి అకస్మాత్తుగా గుండె ఆగిపోతే సిపిఆర్ చేసి ఆ మనిషిని ఎలా రక్షించాలి అనే విషయంపై విద్యార్థులతో ప్రయోగం చేయించి స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు మంచి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు మాట్లాడుతూ ఇంత అద్భుతమైన కార్యక్రమాన్ని మా స్కూల్లో నిర్వహించినందుకు ఎన్డిఆర్ఎఫ్ బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు.


# మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నీటి మోటార్ పంపు విరాళం

**హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు, కళాశాల అధ్యాపకులు**



**విశ్వంభర, మొగిలిగిద్ద :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థిని , విద్యార్థులు నీటి కొరకై పడుతున్న ఇబ్బందిని గ్రామస్తులు నవీన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి సంపులో నుండి నీటిని ట్యాంకులోనికి పంపించడానికి, ఇతరత్రా అవసరాల కొరకై సంపు మోటర్ ను కళాశాలకు విరాళంగా ఇచ్చారు. తెలంగాణ భవన్ లో శాసనమండలి సభ్యుల పాత్రికేయ సమావేశం ఉన్నందువలన మొగిలిగిద్ద కళాశాలకు రాలేకపోవడంతో తన అభిమాని గుట్ట రాజు ద్వారా సంపు మోటార్ ను కళాశాలకు పంపించారు. సంపు మోటర్ ను కళాశాలకు విరాళం ఇచ్చినందుకు గ్రామస్తులు, కళాశాల అధ్యాపక బృందం ఎమ్మెల్సీ నవీన్ కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, సమస్యను తెలపడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనుమారి వెంకటయ్య, శ్యాంసుందర్, గుట్ట రాజ్, అను మారి రాజు, కావాలి రవి, కావలి టిల్లు, ఆంజనేయులు, సాయి, కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించినారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, కాంగ్రెస్ నాయకులు వనం చంద్రశేఖర్, మొహమ్మద్ నాసర్, పున్న అమరేందర్, గురుకు శివ, మోటే నరసింహ, మేడి అంజి, మొహమ్మద్ అజార్ చింతల కృష్ణ, సందీప్, నరసింహ, కృష్ణ, సాయిలు, మమ్మద్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు

## ప్రతీ ఒక్కరూ గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి



**విశ్వంభర, చింతపల్లి :** అహింసా మార్గంలో భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన మహనీయులు గాంధీజీ అని, ప్రతి ఒక్కరూ గాంధీ మహాత్మున్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు ఆర్యవైశ్య సంఘం నాయకులు. చింతపల్లి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ దేశానికందించిన సేవలను, చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. సహనంతో శాంతియుత పంథా ద్వారా మాత్రమే గమ్యాన్ని చేరుకోగలం. ప్రపంచానికే గాంధీజీ కార్యాచరణ అనుసరణీయమన్నారు. పరాయి పాలన నుంచి భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించడం కోసం గాంధీజీ అనుసరించిన శాంతియుత పోరాట పంథా, ప్రపంచ ప్రజాస్వామిక ఉద్యమాలకు, స్వయంపాలనకు మార్గదర్శకంగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల యాదగిరి, వందనపు ఆంజనేయులు, తేరేటిపల్లి రాములు, కొకొండ్ల నారాయణ, వికే శ్రీను, ఆగీరు రవి, అశోక్, చెట్లపల్లి హరిప్రసాద్, ఖాలేద్, వంగాల రమేష్, తేరటిపల్లి కిషోర్, శ్రీను, బచ్చు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీకి వినతి పత్రం



**విశ్వంభర, నార్కెట్ పల్లి :** 420 హామీలు - 420 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత పాలనకు నిరసనగా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులోని గాంధీ గుడివద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టే మల్లిఖార్జున్ రెడ్డి వినతిపత్రం సమర్పించారు. నార్కట్ పల్లి మాజీ ఎంపిపి సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, చెరువుగట్టు మాజీ సర్పంచ్ మాల్గ బాలకృష్ణ, నార్కట్ పల్లి మాజీ ఎంపిటిసి పుల్లెంల ముత్తయ్య, నాయకులు పంజాల రామలింగం, ఎండి జానీ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే డీఆర్ఎంను కలిసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని



**విశ్వంభర, కాజీపేట :** కాజీపేట ఆవరణలో నూతన బస్టాండ్ ఏర్పాటుకు అధికారులతో కలిసి ఇటీవల స్థల పరిశీలన చేసినట్లు ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలోని ఖాళీగా ఉన్న 1ఎకరం రైల్వే భూమిని టీఎస్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి కేటాయించాలని ఎంపీ కోరారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. విస్తృతమైన రైల్వే కనెక్షన్‌లలో కీలకమైన జంక్షన్ కాజీపేట అన్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులకు సేవలు అందిస్తుందని తెలిపారు. ప్రయాణికులు రైలు ప్రయాణాల తర్వాత వారి గ్రామాలకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సులపై ఆధారపడతారని, ఇక్కడ నూతన బస్టాండ్ ఏర్పాటు చేస్తే వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులు మరియు చిన్న తరహా పరిశ్రమల వారి రోజువారీ ప్రయాణానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా రైల్వే సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ రైల్వే బోర్డుకి ప్రతిపాదనలను పంపుతున్నామని తెలిపారు.

## ఫణిగిరి కాలనీకి సీసీ కెమెరాలు అందజేత



**విశ్వంభర, ఎల్బీనగర్ :** చైతన్యపురి డివిజన్ లోని ఫణిగిరి కాలనీ తెలంగాణ చౌరస్తాలో దొంగతనాలు , అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నయని ఫణిగిరి కాలనీ వాసులు బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు శివ ప్రకాష్ దృష్టికి తీసుకొని వచ్చారు. వెంటనే సానుకులంగా స్పందించి 2 సీసీ కెమెరాలు ఇప్పించారు. శివప్రకాష్ మాట్లాడుతూ కాలనీలోని సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫణిగిరి కాలనీ వాసులు దామోదర్ రెడ్డి, సుధాకర్, వెంకటేష్, రవితేజ, ఆసిఫ్, మహేష్, కుల్దీప్, నరేష్, శ్రీను, ప్రభాకర్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

## అలింకో ఆధ్వర్యంలో వికలాంగులకు, వయో వృద్ధులకు స్పెషల్ క్యాంప్

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని రామన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వేంకటరమణ మాట్లాడుతూ తేది: 31.01.2025 శుక్రవారం రోజున ఉదయం 10గంటల నుండి ఎంపీడీఓ ఆఫీస్ నందు అలింకో కంపెనీ వారు వికలాంగులకు, సీనియర్ సిటీజన్స్ కోసం స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నారని, వారికి సంబంధిత మెటీరియల్ అందించబడునని, కావున ఈ సమాచారం రామన్నపేట, వలిగొండ, చౌటుప్పల్, నారాయణపురం మండలాలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. ఈ క్యాంపుకు వచ్చే వైకల్యం కలవారు తమ వెంట తీసుకు రావాల్సిన పత్రాలు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్/ఇన్‌కమ్ సర్టిఫికేట్/ పెన్షన్ సర్టిఫికేట్ (ఏదైనా ఒకటి), యూ.డి.ఐ.డి కార్డు/ యూ.డి.ఐ.డి దరఖాస్తు నమోదు సంఖ్య స్లిప్, వైకల్యం సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో (తప్పనిసరి కాదు). ఈ క్యాంపుకు వచ్చే 60 సంవత్సరాల పైన ఉండే వృద్ధులు తమ వెంట తీసుకు రావాల్సిన పత్రాలు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్/పెన్షన్ సర్టిఫికేట్/ఇన్‌కమ్ సర్టిఫికేట్ (ఏదైనా ఒకటి) అని తెలిపారు.



సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ రోడ్ నెంబర్ 1 లోని గాంధీ విగ్రహం వద్ద గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు జిగిని రామ మూర్తి, ఉపాధ్యక్షులు జనార్దనరెడ్డి, ఆంజనేయులు, రాజమౌళి, అన్నారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. **- విశ్వంభర, సరూర్ నగర్:**

## గైడెన్స్, కౌన్సిలింగ్ లో ఉపాధ్యాయులకు శిక్షణ




**విశ్వంభర, మహబూబాబాద్ :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయబోయే విద్యార్థులలో ఆత్మ స్థైర్యాన్ని నింపుటకు, భవిష్యత్ లో ఉన్నంతంగా రూపుదిద్దుకొనుటకు అవసరమైన కౌన్సెలింగ్ ఎలా ఇవ్వాలనే అంశాలపై జెడ్పి , ప్రభుత్వ , టీజీ ఎంఎస్ కేజీబీవీలలోని ఒక్కొక్క ఉపాధ్యాయుడికి 2 రోజుల శిక్షణ కార్యక్రమం స్థానిక ఏకశిలా స్కూల్ లో ప్రారంభం అయ్యింది. ఇట్టి శిక్షణ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా డాక్టర్ రవీందర్ రెడ్డి జిల్లా విద్యఅధికారి, శిక్షణ కార్యక్రమం ఆవశ్యకతను వివరిస్తూ, ఉపాధ్యాయులు అందరు శిక్షణ అనంతరం స్కూల్స్ లలో విద్యార్థులకు ఈ అంశాలను వివరిస్తూ వారిని మోటివేట్ చేయాలని పరీక్షలలో ధైర్యంగా రాసేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులలో కౌమార దశలో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల గురించి, వారికి ఎదురయ్యే స్ట్రెస్ మొదలగు అంశాల గురించి వివరించారు. ఇంకా ఈ కార్యక్రమం లో పూర్ణచందర్,ఆర్పీ మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీకి ఘన నివాళులు



**విశ్వంభర, మహబూబాబాద్ :** స్వాతంత్ర్య సంగ్రామంలో భారత దేశం కోసం ప్రాణాలర్పించిన మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ గురువారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయం సమావేశం మందిరంలో అమరవీరుల స్మృత్యర్థం కార్యక్రమాన్ని నిర్వహించారు. అమరులైన ఎందరో మహానుభావుల అమరవీరుల స్మృత్యర్థం ప్రతి సంవత్సరం జనవరి, 30 న అమర వీరుల స్మృత్యర్థం దినోత్సం సందర్భంగా కలెక్టర్ అధికారులతో కలిసి 2 నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరిస్తూ ప్రతి సంవత్సరం జనవరి 30 వ తేదీన గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బారత స్వతంత్ర పోరాటం లో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి అమరులై త్యాగధనులుగా నిలిచారన్నారు. వారి త్యాగాలను స్మరిస్తూ భావి తరాలకు తెలియజేయడం మన బాధ్యత అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా అమరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల, రెవెన్యు అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సవ్ టోప్పో, కె.వీరబ్రహ్మచారి, జిల్లా అధికారులు కలెక్టరేట్ ఇంచార్జ్ సూపరింటెండెంట్ మధుమోహన్, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ గ్రౌండ్ కోసం ఎమ్మెల్యే వీర్లపల్లికు వినతి



**విశ్వంభర, రంగారెడ్డి జిల్లా :** ఫరూక్ నగర్ మండలం లోని కమ్మదనం గ్రామ యువకులు క్రికెట్ గ్రౌండ్ కోసం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ విషయంపై ఎమ్మెల్యే శంకర్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని చర్చించి తన వంతు ప్రయత్నం గా పరిశీలించి కమ్మదనం గ్రామానికి క్రికెట్ గ్రౌండ్ వచ్చే విధంగా చేస్తానని, తన వంతు సహాయం సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలపడం జరిగింది. ఇంత మనోధైర్యాన్ని ఇచ్చిన ఎమ్మెల్యే శంకర్ కు కమ్మదనం గ్రామం తరపున ప్రత్యేకమైన కృతజ్ఞతలు. గత కొన్ని సంవత్సరాలుగా కమ్మదనంలో క్రికెట్ గ్రౌండ్ లేక యువకులు ఎంతో అవస్థ పడ్డ సందర్భాలు ఎన్నో ఉన్నాయి, ఈ విషయం పట్ల కమ్మదనం గ్రామంలో చర్చించినప్పుడు కమ్మదనంలో ఉన్న అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు యువకులు క్రీడాకారులందరూ ముక్త కంఠంతో కమ్మదనం గ్రామానికి క్రికెట్ గ్రౌండ్ కోసం సానుకూలంగా స్పందిస్తూ, సహకరించిన గ్రామ ప్రజలందరికీ శివగాళ్ల ఆంజనేయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు.

## మహాత్మాగాంధీకి ఘన నివాళులు

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**



**విశ్వంభర, సంగారెడ్డి:** జాతిపిత మహాత్మాగాంధీ 77వర్ధంతి పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని గంజిమైదాన్ లోని మహాత్ముని విగ్రహానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనపై శిక్షణ



**విశ్వంభర, మహబూబాబాద్:** కుష్టు వ్యాది అవగాహన కార్యక్రమము గురువారం నుండి ప్రారంభమై ఫిబ్రవరి 13వ తారీకు వరకు క్షేత్ర స్థాయి సిబ్బంది అన్ని గ్రామాల్లో ప్రజలకు కుష్టు వ్యాది పై అవగాహన కల్పించాలని, జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ అన్నారు. గురువారం మహబూబాబాద్ పట్టణంలోని పత్తిపాక రోడ్డు లో గల ఐఎంఏ హాలు నందు ఏర్పాటు చేసినటువంటి ఇంటెగ్రేటెడ్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్ రెండో బ్యాచ్ శిక్షణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శ లేని మొద్దు బారిన మచ్చలు, రాగి వర్ణపు మచ్చలు గుర్తించినట్లైతే వారిని స్థానిక పిహెచ్ సి వైద్యుని వద్దకు పంపించి ఒక వేళ వ్యాధి నిర్ధారణ జరిగితే పూర్తి చికిత్స అందించాలని తెలిపి, మహాత్మ గాంధీ కలలు ఉన్న విదముగా సమీప భవిష్యత్తులో కుష్టు వ్యాధి రహిత భారత దేశ నిర్మాణములో అందరితో కలిసి కృషి చేస్తానని మహాత్మ గాంధీ వర్ధంతి రోజు కార్యక్రమములో నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను అని అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విజయకుమార్, ట్రైనింగ్ డాక్టర్ సౌజన్య, బిజినెస్ మేనేజర్ ప్రశాంత్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ లవరం, వాల్య, నరసింహ స్వామి, సబ్ యూనిట్ ఆఫీసర్ ఓబిలి శెట్టి రామకృష్ణ, డి ఈ ఓ ఉమాకర్, అరుణ్, ఎల్ డి కంప్యూటర్ అరుణ్, శ్రీనివాస్, ఐలయ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగివుండాలి

**– డాక్టర్ శ్రీదేవి**



విశ్వంభర, చింతపల్లి : గ్రామీణ ప్రాంతాల ప్రజలు కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కలిగి ఉండాలని మండల ప్రాథమిక వైద్యాధికారిని డాక్టర్ శ్రీదేవి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుష్టు వ్యాధి నిర్మూలన పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కాళ్లు చేతులలో కండరాలలో బలహీనత, నరాల తిమ్మిర్లు ఎక్కడ ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి ఫిబ్రవరి 13 వరకు అన్ని గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం

**టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్**




**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు కాలేదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ మాట్లాడటం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాల్ని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు పోతున్నారన్నారు. ప్రతి వ్యక్తి అకౌంట్లో 15 లక్షల బ్లాక్ మనీ తెప్పించి వేస్తా అన్న మీ మోడీ హామీ ఏమైంది ? ఏటా కోటి మందికి ఉద్యోగాలిస్తామన్నారు, పదేళ్ల కాలం సరిపోలేదా? అని ఆయన ప్రశ్నించారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన భారతదేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ది పొందడం తప్ప, బీజేపీ దేశానికి చేసిందేమీ లేదన్నారు. పేదలకు అందుబాటులో ఉండాలని స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ ఆనాడు బ్యాంకులను జాతీయం చేశారని బండి సుధాకర్ గుర్తు చేశారు. కానీ ఈరోజు మోడీ అనాలోచితంగా బ్యాంకులను విలీనం చేసి, ఆ రంగాన్ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. కేంద్ర పెద్దల మిత్రులకు దాదాపు 18 లక్షల కోట్లు మాఫీ చేసింది వాస్తవం కాదా? బీజేపీ నాయకులే సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉచిత బస్సు ప్రయాణం కింద 136 కోట్ల మంది మహిళలు లబ్ది పొందగా, ఇందుకోసం ప్రభుత్వం 4500 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ 50 లక్షల మంది గృహిణులు ఉపయోగించుకుంటున్నారన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ 43 లక్షల కుటుంబాలకు అందుతున్నదన్నారు. ఏడాది కాలంలో రైతుబంధు, రుణమాఫీ, రైతు భరోసా కింద 58,280 కోట్ల రూపాయలు రైతు సంక్షేమం కోసం ఖర్చు చేసిన ముఖ్యమంత్రి రైతుబిడ్డ రేవంత్ రెడ్డి అన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించడం మంచి పద్ధతి కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని బండి సుధాకర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## మాల మాదిగ ఉద్యమాన్ని నాగా-కుకి కొట్లాటగా మార్చే కుట్ర

**కార్పొరేషన్ చైర్మన్ మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి**



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించే విధంగా గడ్డం వివేక్, మందకృష్ణ మాదిగ ప్రయత్నిస్తున్నారని ఈ ఉద్యమాన్ని మరో నాగ కుకీ కొట్లాటగా మారనుందని మరి మసీ కార్పొరేషన్ చైర్మన్ మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో మాదిగ విద్యార్థి యువగర్జన గోడ పత్రిక విడుదల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ వర్గీకరణ చేయడం మందకృష్ణ మాదిగకు ఇష్టం లేదని అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. గడ్డం వివేక్, మందకృష్ణ మాదిగ స్వార్థ ఉద్యమాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో నాగ కుకి గొడవ వలె మరో వర్గ భేదాలు వచ్చి రాష్ట్రం అగ్నిగుండంగా మారే అవకాశం ఉందని అన్నారు. గడ్డం వివేక్ మందకృష్ణ మాదిగ రెచ్చగొట్టే ప్రసంగాల వల్ల తెలంగాణ రాష్ట్రంలోని మాల మాదిగలు శాంతియుతంగా ఉంటారని ఎలాంటి విభేదాలకు వెళ్లకుండా ఉన్నారని అన్నారు. వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా మాదిగలను అణచివేసిన బిజెపి ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ అవార్డును కృష్ణ మాదిగ వెంటనే తిరస్కరించాలని అన్నారు. లక్ష డప్పులు కార్యక్రమం పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించాలని పబ్లిక్కు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఈ కార్యక్రమం పెట్టడం వల్ల జరగరానిది జరిగితే దానికి నైతిక బాధ్యత కృష్ణ మాదిగ వహించాలని అన్నారు. వర్గీకరణ తెలంగాణ రాష్ట్రంలో జరుగుద్దని గడ్డం వివేక్, ఇప్పుడు జరుగుద్దని కృష్ణ మాదిగ ఉన్నారని అన్నారు. ఎన్ని ఆటంకాలు కలిగించిన తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ జరిగి తీరుతుందని ఉన్నారు. ఫిబ్రవరి రెండున ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో మాదిగ విద్యార్థి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి యువగర్జన బహిరంగ సభకు వేలాదిగా మాదిగలు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ మల్లేశం, ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు తిరుపతి, తెలంగాణ దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొమ్మెర స్టాలిన్, డాక్టర్ నంద్రు నరసింహ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మారపాక సాయిలు, తెలంగాణ స్టూడెంట్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రింగు రాంబాబు, మాదిగ జేఏసీ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుల జోగు గణేష్,శివ, దేవరకొండ నరేష్, కొమ్ము ప్రవీణ్, మీసాల మహేష్, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కాదాసీ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇనుగుర్తి మండల పరిషత్ ప్రారంభం

**తొలి ఎంపీడీవో గా విధుల్లో చేరిన హరిప్రసాద్**



**విశ్వంభర, ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల పరిషత్ కార్యాలయం పాత హాస్టల్ భవనంలో గురువారం ప్రారంభమైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు తొలి ఎంపీడీవో గా హరిప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. దీంతో ఎంపీడీవో కార్యాలయం కోసం ఎన్నో నెలలుగా ఎదురు చూస్తున్న మండల ప్రజల కల సాకారమై నట్లయింది.నూతన ఎంపీడీవోను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, సీపీఎం ప్రజాసంఘాల నాయకులు, పౌరులు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..కొత్తగా ఏర్పడిన మండలంలో సమస్యలు పరిష్కరించుకుందామని,ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.అన్ని పార్టీలతోపాటు ప్రజలు ఉద్యోగులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ లు దీకొండ వెంకన్న గౌడ్,గుండ వెంకన్న, ఏఎంసి డైరెక్టర్ కొట్టం రాము,పంచాయితీ కార్యదర్శులు లక్ష్మీకాంత్,బొమ్మెర వాణి,వేద రాజేశ్వర్,అనిల్ కుమార్,అశోక్, రాజేష్, వినోద్ కుమార్, వివిధ పార్టీల నాయకులు బైరు అశోక్ గౌడ్, పింగిలి శ్రీనివాస్,చిన్నాల కట్టయ్య, సతీష్,బాబురావు, కదిర జగన్ గౌడ్,రావుల మల్లేశం,డా.వెంకన్న,కావటి నరసయ్య,కొట్టం చరణ్,వల్లంల మురళి తదితరులు పాల్గొన్నారు.

## బాపూజీకి ఘన నివాళులర్పించిన గవర్నర్, సీఎం, మంత్రులు



**విశ్వంభర, హైదరాబాద్ :** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపూ ఘాట్ వద్ద ఆ మహనీయుడికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం సర్వమత ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు , కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , సలహాదారులు వేం నరేందర్ రెడ్డి , షబ్బీర్ అలీ , హర్కర వేణుగోపాల రావు , ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ , బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి , డీజీపీ జితేందర్ తో పాటు పలువురు ప్రముఖులు మహాత్ముడికి నివాళులర్పించారు.

## ఎస్సీ సెల్ కన్వీనర్‌ను శాలువాతో సన్మానించిన జై సింగ్ థామస్ విజయ్ గ్లాడిస్



**విశ్వంభర, మహేశ్వరం :** తెలంగాణ స్టేట్ ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నరసింహను శంషాబాద్ మండలం కవగుడ శ్రీ చైతన్య మహిళా మండల్ అనాధ ఆశ్రమంలో జై సింగ్ తామస్ విజయ గ్లాడిస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయ బృందంతో నందిగామ నరసింహను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ అనంతరెడ్డి , ఆవుల మాణిక్యం, స్కూల్ యజమాన్యం. విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మీర్‌పేట్ :** మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు , క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల కార్యక్రమాలను అధికారులతో కలిసి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు.సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చెయ్యాలని పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవర్చనందుకు గాంధీ చిత్రపటానికి వినతి



**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు త్రిపురారం ప్రధాన కూడలిలో మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకొని గాంధీ చిత్రపటానికి నివాళు లర్పించడం జరిగింది. తదుపరి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు, బిఆర్ఎస్ పార్టీనాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేపటితో 420 రోజులు పూర్తి చేసుకుంటున్ననేపథ్యంలో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు పూర్తి చేయనందుకు నిరసనగా డూప్లికేట్ గాంధీలకు హామీలను అమలు చేసే బుద్ధి ఇవ్వాలని త్రిపురారం మండల కేంద్రంలో ప్రధాన కూడలిలో మహాత్మా గాంధీ చిత్రపటానికి వినతి పత్రం అంఅందజేశారు.ఈ కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుమల శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పామోజు వెంకటాచారి,కామెర్ల జానయ్య, అనుముల శ్రీనివాస్ రెడ్డి,అనుముల శ్యాంసుందర్ రెడ్డి, అనుముల సుధాకర్ రెడ్డి, జంగిలి శ్రీనివాస్, నగిరి వెంకన్న, నగిరి శ్రీనివాస్, బైరం కృష్ణ, లక్ష్మణ్, సురేష్ నాయకులు పాల్గొన్నారు.

## జాఫర్‌పల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**విశ్వంభర, పరిగి:** మండల పరిధిలోని జాఫర్ పల్లి గ్రామంలో ఆరు లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మాజీ ఉప సర్పంచ్ మహేష్ కుమార్ సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. దశలవారీగా ప్రతి వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు యాదయ్య, శ్రీనివాస్, నాగప్ప, ఆంజనేయులు, శివకుమార్, కార్తీక్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధి లో రాణించాలి

**మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య**



**విశ్వంభర, నార్కెట్ పల్లి:** నార్కెట్ పల్లి పట్టణంలో అమ్మనబోలు గ్రామానికి చెందిన జిల్లా మహేష్ మోటార్ కారు షెడ్డును నార్కెట్పల్లి మండల మాజీ జెడ్పిటిసి దూదిమెట్ల సత్తయ్య యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దూది మెట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెరిపోతుల భరత్ పాల్గొన్నారు.

## నేడు గద్దర్ జయంతి.. ముఖ్య అతిథిగా కేఎల్ఆర్

**విశ్వంభర, తుక్కుగూడ :** గద్దర్ జయంతిని పురస్కరించుకొని నేడు తుక్కుగూడ చౌరస్తాలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే గద్దర్ పాటలతో సాంస్కృతిక కళా ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తుక్కుగూడ బస్టాండ్ చౌరస్తాలో గద్దర్ పాటలతో కళాబృందాలు అలరించనున్నారు. కావున ఈకార్యక్రమంలో గద్దర్ అభిమానులు, కళాకారులు, తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాలు పాల్గొనాలని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాలు ఉదయం 9.00 గం.ల నుండి సాయంత్రం 5.00 గం.ల వరకు నిర్వహించడం జరుగుతుంది.

## మార్పును అందిపుచ్చుకోండి

**పరిశోధకులకు ప్రొఫెసర్ కరుణాకర్ సూచన**




**విశ్వంభర, సంగారెడ్డి :** పరిశ్రమ 5.0 దిశగా పయనిస్తున్న ఈ తరుణంలో వ్యాపార ప్రక్రియల డిజిటలైజేషన్ అపారమైన మార్పులకు గురైందని, ఆ మార్పును అందిపుచ్చుకుని విజయ తీరాలను చేరుకోవాలని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (జీఎస్బీ) సెంటర్ ఫర్ కేస్ స్టడీ డైరెక్టర్ ప్రొఫెసర్ కరుణాకర్.బి సూచించారు. జీఎస్బీలోని మార్కెటింగ్ విభాగం ఆధ్వర్యంలో 'వ్యాపార వృద్ధి కోసం సామాజిక–వాణిజ్యంలో కత్రిమ మేధస్సును ప్రభావంతంగా వినియోగించడం' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల యాజమాన్య వికాస కార్యక్రమం (ఎండీపీ)ని గురువారం ఆయన జ్యోతి ప్రజ్వలనతో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్ సహా ఆటోమేషన్, రోబోటిక్స్ సాంప్రదాయ వ్యాపార నమూనాలను సమూలంగా మారుస్తున్నాయన్నారు. ఆయా అంశాలపై మంచి అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన ఈ రెండు రోజుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రారంభోత్సవంలో ఎండీపీ నిర్వాహకుడు ప్రొఫెసర్ యు.దేవీప్రసాద్, మార్కెటింగ్ చైర్ డాక్టర్ దేవిక రాణి శర్మ, పలువురు అధ్యాపకులు, దాదాపు 40 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ డైరీ ఆవిష్కరణ



**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రజాస్వామ్యంలో పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిదిగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా జర్నలిస్టు మిత్రులు పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జర్నలిస్టు మిత్రులను కోరారు. దేశంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడే అతిపెద్ద యూనియన్ ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అని అలాంటి జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా కాపాడుతుందని అన్నారు. గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్ ,కార్యదర్శి సామంతుల శ్యాం, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజయ్, రాష్ట్ర హెల్త్ కమిటీ మెంబర్ సామల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అనుబంధ సంస్థ అయిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ డైరీని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో పాటు జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే లు యూనియన్ డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కుమార్ యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజయ్,రాష్ట్ర హెల్త్ కమిటీ మెంబర్ సామల శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, చిట్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాము, టెమ్జు అధ్యక్షులు సాంబయ్య,పూర్ణచందర్,రవి, సీనియర్ రిపోర్టర్ డాక్టర్ సమ్మయ్య గౌడ్,సర్వేశ్వరావు, చిరంజీవి, ఐలయ్య, రజినీకాంత్,మల్లేషమ్ తదితరులు పాల్గొన్నారు.

## కుంభాభిషేకానికి ఆహ్వానం



**విశ్వంభర, కాళేశ్వరం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం లో తేదీ 7.2.2025 నుండి 9.2.2025 వరకు కుంభాభిషేకం నిర్వహించుటకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆగమపండితులతో చర్చించి ముహూర్తం నిర్ణయించింది. ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మరియు శృంగేరి పీఠాధిపతుల సూచన మేరకు శ్రీ తుని తపోవన పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి ని ఆహ్వానించుటకు దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమీషనర్ రామకృష్ణ మరియు యాదగిరి వేద పాఠశాల చైర్మన్ , కుంభాభిషేకం మెంబర్ గోవింద హరి ఆధ్వర్యంలో కాళేశ్వర దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఏస్.మహేష్ , ఉప ప్రధానార్చకులు పనకంటి ఫణీంద్ర శర్మ ఆంధ్రప్రదేశ్ తుని లోని మఠం నకు వెళ్లారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం పీఠాధిపతులను దర్శించుకొని వారికి కుంభాభిషేకమునకు ఆహ్వానం అందజేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

## మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్



**విశ్వంభర, మిర్యాలగూడ :** కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ మన భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన మహనీయుడు, శాంతి అహింసా మార్గంలో స్వాతంత్ర్య ఉద్యమం నడిపించి ఈప్రపంచానికి ఒక కొత్త ఉద్యమాన్ని పరిచయం చేసిన గొప్ప ఉద్యమకారులు మహాత్మా గాంధీ అని కొనియాడారు. అహింసా పోరాటం ద్వారా స్వాతంత్ర్య సాధించడంలో అతను కీలకపాత్రపోషించాడు. అందుకే గాంధీజీ జన్మదినం అక్టోబరు 2 న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు బిఎల్ అర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## పట్టణ పరిశుభ్రతలో కార్మికుల పాత్ర కీలకం

**మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్**



**విశ్వంభర, షాద్ నగర్ :** పట్టణ పరిశుభ్రతలో మున్సిపల్ , మున్సిపల్ కార్మికుల పాత్ర కీలకమని మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మున్సిపల్ పాలకవర్గం పూర్తయిన సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, 20వ వార్డు మాజీ కౌన్సిలర్ కొందూటి మహేశ్వరి మున్సిపల్ కార్మికులకు కానుకలను అందజేయడంతో పాటు భోజనాన్ని ఏర్పాటు చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మున్సిపల్ అధికారులు, కార్మికులు అందించిన సేవలు మరువలేనివన్నారు. ఎప్పటికప్పుడు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికులు ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న, మాజీ కౌన్సిలర్లు అంతయ్య, ఈశ్వర్ రాజు, సర్వర్ పాషా, వెంకటరామిరెడ్డి, నాయకులు కడెంపల్లి శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, జూపల్లి శంకర్, నందకిషోర్, సుధీర్, శ్రీశైలం, యాదగిరి, ఏజాజ్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

**మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండ్లు తెరిపించేందుకు వినూత్న నిరసన కార్యక్రమం బిఆర్ఎస్ పార్టీ చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, రేవంత్ రెడ్డి,డిక్లరేషన్లు పేరుతో ప్రకటించిన ఆర్ గ్యారెంటీలను 420 హామీలను సంవత్సరం తిరిగేలోపు అమలు చేస్తామని అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ 420 రోజులు గడుస్తున్న విద్యార్థులకు నిరుద్యోగులకు సబ్బండ వర్గాలకు ఇచ్చిన గ్యారెంటీలను ప్రకటించిన హామీలను అమలు చేయకుండా విస్మరించిన కాంగ్రెస్ పార్టీ తీరును నిరసిస్తూ వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నర్రి నరసింహ, బిఆర్ఎస్ జిల్లా నాయకులు కూసుకుంట్ల సత్తిరెడ్డి, గడ్డం మురళీధర్ రెడ్డి, ధన్వంత్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు చిలువేరు బిక్షం, తెలంగాణ బిక్షం, శివరాత్రి విద్యాసాగర్, బిఆర్ఎస్వి మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు నలపరాజు రమేష్, మాజీ సర్పంచులు కట్టెల బిక్షపతి, పానుగోతు పాండురంగ నాయక్, అన్ని గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూమి లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలి



**విశ్వంభర, రామన్నపేట:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న నాలుగు పథకాలలో భూమిలేని నిరుపేదలకు ఇచ్చే 12 వేలు రూపాయల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఎలాంటి షరతులు లేకుండా నిరుపేదలందరికీ ఇవ్వాలని బి.ఎస్.పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలానికి చెందిన ప్రియదర్శిని మేడి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఒక పత్రికా ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలలో భూమి లేని పేదలని ఉపాధి హామీ పథకంలో గత ఆర్థిక సంవత్సరంలో వరుసగా ఇరువై రోజుల పనిదినాలు చేసిన వారినే లబ్ధిదారులుగా గుర్తించడం దారుణమని అన్నారు. ఉపాధి హామీ పథకంలో రోజువారీ కూలీ కేవలం 100 రూపాయలు రావడంతో రోజువారీ కనీస అవసరాలు కూడా సరిపోయే పరిస్థితి లేకపోవడంతో ఇతర కూలీ పనులకు వెళ్లడంతో అనర్హులుగా గుర్తించడం సరైంది కాదన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలలో లక్షలాది పేదలు ఉన్న ఉపాధి హామీ పథకం అమలు లేకపోవడం వలన లక్షలాది మంది పేదలు ఈ పథకం పొందలేకపోతున్నారని, ఇలాంటి షరతులు పెట్టడం వలన నిజమైన పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని, ఎలాంటి షరతులు లేకుండా పేదలందరికి పథకం అమలు చేయాలని ఆమె అన్నారు.

## జ్ఞాన సరస్వతి దేవాలయంలో కుంభాభిషేక మహోత్సవం



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఆర్కే పురం డివిజన్ టెలిఫోన్ కాలనీ రోడ్డు నం. 1 లో గల జ్ఞాన సరస్వతి దేవాలయ స్థాపించి పుష్కరకాలం అయినా సందర్భంగా దేవాలయంలో కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయ చైర్మన్ వర ప్రసాద్, సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, ట్రెజరర్ రాములు తెలిపారు. మహోత్సవ కార్యక్రమ బ్రోచర్ ను గురువారము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరి 31 నుండి 04 ఫిబ్రవరి ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్ని రకాల చర్యలు చేపట్టేమని తెలిపారు. దాదాపు 20 లక్షల వ్యయ అంచనాలతో అత్యంత వైభవంగా కార్యక్రమాలు చేపడుతున్నాము అని తెలిపారు. ఈ కుంభాభిషేక మహోత్సవ వేడుకలను భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని దైవజ్ఞ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ లు ఆనంద రావు, లక్ష్మయ్య, దయానంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవేంద్ర సాయి, సలహాదారులు రమణయ్య ,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు బాగుంటారు



**విశ్వంభర, హైదరాబాద్ :** అంబర్పేట నియోజకవర్గం నల్లకుంట డివిజన్ బర్కత్పుర రత్నానగర్లో 44 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు అంబర్పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత శంకుస్థాపన చేసారు. అనంతరం బస్తీ వాసులతో కలిసి స్థానిక సమస్యలపై పాదయాత్ర చేసి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారుల తో మాట్లాడి సమస్యలను త్వరగా పూర్తి చేయాలని సూచించాడు. స్థానికులు సివరేజ్ లైన్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వీధులు పలుచోట్ల పరిశుభ్రత లోపం కానొస్తుందని ఈ విధంగా పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే అనారోగ్యాల గురవుతారని పారిశుధ్య సిబ్బంది పనితీరు ఏమాత్రం బాగాలేదని ఈ విధంగా పరిసరాలు ఉంటే మున్సిపల్ సిబ్బంది ఉన్నట్టా లేనట్టా అని కాలేరు అన్నారు. ఈ కార్యక్రమంలో బస్తివాసులు, బారాస, భాజపా శ్రేణులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మహాత్మా గాంధీకి నివాళులు



**విశ్వంభర, జనగామ:** పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సి రెడ్డి ఆదేశాల మేరకు దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆద్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా దేవరుప్పుల మండలం,సీతారాంపురం గ్రామంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు సీతారాంపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు వరికల రతన్ జీ, యూత్ అధ్యక్షుడు పైండ్ల అనిల్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జహంగీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలో గల గాంధీ విగ్రహానికి డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించి బూటకపు 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు అయిపోయినప్పటికి హామీలు అమలు చేయకుండా ప్రజలను వంచిస్తున్న తీరుకు నిరసనగా ఈ ప్రభుత్వానికి మంచి బుద్దిని ప్రసాదించాలని ఆ మహాత్మునికి వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, నాయకులు సాజీద్, రామనర్సింహ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్, గొడుగు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి,కంచెర్ల శేఖర్,కొంద్ర శ్రీనివాస్,అనురాధ, జగన్ మోహన్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి,మల్లేష్,జాగృతి నవీన్,సంతోష్ పాల్గొన్నారు.

## లెప్రసి పై పిహెచ్సి ప్రతిజ్ఞ



**విశ్వంభర, ఇనుగుర్తి:** లెప్రసీ వ్యాధిపై అవగాహన కల్పిస్తామని,కుష్టి వ్యాధి గ్రస్తులను ఆప్యాయతతో వ్యవహరిస్తూ చికిత్స అందిస్తామని స్థానిక పీహెచ్సీ మెడికలాఫీసర్ డా.సురేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గురువారం ప్రతిజ్ఞ చేశారు. ఓపి పేషెంట్లకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా.సురేష్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ వర్ధంతి రోజు అవగాహన,కుష్టు పై ప్రతిజ్ఞకార్యక్రమం ఉంటుందన్నారు,ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి దేశం నుంచి లెప్రసీ నిర్మూలనకు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో హెచ్ బి కృష్ణకుమారి, స్టాఫ్ నర్స్ సంధ్య,ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు,108 సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన మాజీ ఎమ్మెల్సీ



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన వీరమల్ల యశోద ఇటీవల మరణించగా వారి దశదినకర్మ కార్యక్రమం సందర్భంగా నిరుపేద కుటుంబానికి సాయం అందించాలని మానవత దృక్పథంతో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ బాధిత కుటుంబానికి పదివేల రూపాయలు విలువగల నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ బిక్షం, లారీ బిక్షం, ఎడ్ల సత్తయ్య, శికిలమెట్ల ప్రభాకర్, ఉప్పల ఆంజనేయులు, పేరా రమేష్, చింతకింది సుధాకర్, జక్కల వెంకటేష్, ఎడ్ల రమేష్ పాల్గొన్నారు.

## బెస్ట్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 77వ వర్ధంతి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కక్కిరేణి గ్రామంలో బెస్ట్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాతిపిత శాంతి, అహింస, మానవసేవను ఆయుధాలుగా తీసుకుని స్వాతంత్ర్య సమరంలో విజయం సాధించిన త్యాగమూర్తి అని, మన దేశానికి స్వాతంత్ర్యం కోసం పాటుపడిన నాయకుడు మహాత్మ గాంధీ అని, మోహన్ దాస్ కరంచంద్ గాంధీ, జాతిపితగా భారతీయులందరిచే ఆదరింపబడే స్వాతంత్రసమరయోధుడు. కొల్లాయి గట్టి, చేత కర్రబట్టి, నూలు వడకి, మురికివాడలు శుభ్రం చేసి, అన్ని మతాలూ, కులాలూ ఒకటే అని చాటిన మహాత్మాగాంధీ అని వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బంది నరసింహ, కిషన్, రమేష్, కవిత, బిక్షం, యశోదలకి బేస్ట్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్వచ్ఛభారత్ లో భాగంగా చిరు సత్కారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం గ్రామ అధ్యక్షులు దాచేపల్లి ఈశ్వరయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమిడి ఉపేందర్, గణేష్, గోపాల్ రెడ్డి, కృష్ణ, స్వర్ణలత, గ్రామ పెద్దలు కన్నెబోయిన జగన్, బలరాం, సోమేశ్వర్ రావు, చిల్ల శ్రీను, దాచేపల్లి మల్లయ్య, దేవేందర్, బెస్ట్ సేవా సొసైటీ ఆర్గనైజర్ వేముల సైదులు, అంగన్వాడీ టీచర్స్ ఉమా, యశోద, సుధా, భాషకార్ల నరేందర్ రెడ్డి, అంకిరెడ్డి యాదయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, 420 రోజులు



**విశ్వంభర, మీర్‌పేట్:** రైతులను, మహిళలను, వృద్ధులు, వికలాంగులను, 2 లక్షల ఉద్యోగాలిస్తామని యువతను, ఇలా ప్రతి వర్గాన్ని నయవంచనకు గురిచేసిన కాంగ్రెస్ సర్కారుకు కళ్లు తెరిపించాలని కోరుతూ మీర్పేట టిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. గురువారం జిల్లెలగూడ చందన చెరువు కట్ట పైన ఉన్న మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలపాటు దగాపడ్డ తెలంగాణ బిడ్డలు మళ్లీ అవే కష్టాలు, అవే కన్నీళ్లలో చిక్కుకుని విలవిలలాడుతున్న వేళ ఈ దద్దమ్మ సర్కారుకు 420 హామీల్లో కొన్నైనా అమలుచేసే తెలివినివ్వాలని ప్రార్థిస్తున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో తీగల విక్రమ్ రెడ్డి, బొక్క రాజేందర్ రెడ్డి, బి.ఆర్.యస్ పార్టీ ముఖ్య నాయకులు దీప్ లాల్ చౌహాన్,యం. ఏ రజాక్, ప్రభాకర్ రెడ్డి, భూపేష్, ప్రవీణ్ రెడ్డి, సిద్దాల పెద్ద బీరప్ప, సిద్దాల భారత్, లక్ష్మణ్ , బలరామకృష్ణ, గోపి యాదవ్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, జమాల్పూర్ సునీత బాల్ రాజ్, లత కార్యకర్తలు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య సినిమా వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, మహబూబాబాద్ :** పట్టణ కేంద్రంలో ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపం దగ్గర దొడ్డి కొమరయ్య సినిమా వాల్ పోస్టర్ ఆవిష్కరణ మహబూబాబాద్ జిల్లా దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ అధ్యక్షులు డాక్టర్ డోలి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం అంటూ ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4,500 మంది తెలంగాణ పౌరులు చనిపోవడం జరిగిందని తెలిపారు. వారి త్యాగాలను నేటి తరానికి తెలియజేస్తూ దొడ్డి కొమరయ్య సినిమా తీయడం తెలంగాణ ప్రజలకి ఎంతో మేలు జరుగుతుంది అని అన్నారు. చిత్ర దర్శకులు సేనాపతి మాట్లాడుతూ ఏ ప్రజల కోసమైతే ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరులు చనిపోయారో... అదే నేటి ప్రజలు సహనిర్మాతలై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ గౌరవ సలహాదారులు వేముల వెంకన్న, జిల్లా చైర్మన్ జీ సక్రు , కో చైర్మన్ రావుల శ్రీను, కన్వీనర్ మక్కల నాగలక్ష్మి, కో కన్వీనర్ తక్కెలపల్లి విజయ్ కుమార్ , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, గోప డివిజన్ అధ్యక్షులు, బిసి సంఘం నాయకులు సిలివేరు సమ్మయ్య గౌడ్ , నాయి బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎలమందల కృష్ణ ప్రసాద్ ,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బండారు వెంకటరమణ, గుండ గాని వేణు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌కు ట్రంప్ మిత్రుడా..?శత్రువా..?

**జైశంకర్ సమాధానమిదే..**



ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతీయవాది అని విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్ అభివర్ణించారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ట్రంప్ విధానాలు గణనీయమైన మార్పు తీసుకురావొచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన హన్సరాజ్ కాలేజ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''ఇటీవల జరిగిన ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి నేను హాజరయ్యాను. మనకు ఎంతో గౌరవం లభించింది. ఆయనొక జాతీయవాది అని నేను విశ్వసిస్తున్నాను'' అని జై శంకర్ అన్నారు. ట్రంప్ భారత్‌కు మిత్రుడా..? శత్రువా..? అని అడిగిన ప్రశ్నకు పైవిధంగా బదులిచ్చారు. ట్రంప్ విధానాలతో ప్రపంచ వ్యవహారాల్లో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశాలున్నప్పటికీ.. భారత్ మాత్రం దేశ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. ''అమెరికాతో మనం బంధం బలంగా ఉంది. ప్రధాని మోదీకి ట్రంప్‌తో మంచి స్నేహముంది'' అని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా భారత్ ప్రభావం పెరుగుతోందన్నారు. ''కొందరు భారతీయేతరులు తమను తాము భారతీయులుగా చెప్తున్నారు. విమానంలోనో, ఇంకోచోటో తమకు సీటు దక్కేందుకు అది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు'' అని అన్నారు. అలాగే మంత్రి తన కెరీర్ గురించి మాట్లాడారు. ''నేను ఒక బ్యూరోక్రాట్‌ను అవుతానని అనుకోలేదు. నా రాజకీయ ప్రవేశం అనూహ్యంగా జరిగింది. అది అదృష్టమే అనుకోండి. అదంతా మోదీజీ వల్లే. నో అని చెప్పలేనివిధంగా నేను రాజకీయాల్లోకి వచ్చేలా ఆయన ప్రోత్సహించారు'' అని గుర్తుచేసుకున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారానికి భారత్ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కో రూబియోతో ఆయన భేటీ అయ్యారు. అగ్రరాజ్య విదేశాంగ మంత్రిగా రూబియో బాధ్యతలు స్వీకరించిన గంట లోపే ఈ సమావేశం జరగడం గమనార్హం. దాదాపు గంటకు పైగా వీరిద్దరూ భేటీ అయ్యారు. భారత్ అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతమయ్యేదిశగా పలు అంశాలపై వీరు చర్చలు జరిపారు. ట్రంప్.. తన రెండో హయాంలో భారత్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కన్పిస్తోంది. ఈ క్రమంలోనే విదేశాంగమంత్రుల భేటీ జరిగింది.

## ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం..

**ఫిబ్రవరి 4 వరకు కుంభమేళాకు బస్సులు రద్దు**



**భువనేశ్వర్:** ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. మహా కుంభమేళా కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులను ఫిబ్రవరి 4 వరకు రద్దు చేసింది. అనివార్య పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ఉత్తర్వులో పేర్కొంది. మహా కుంభమేళా, అయోధ్యకు వెళ్లే ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులను ఫిబ్రవరి 4 వరకు తక్షణమే రద్దు చేస్తున్నట్లు ఒడిశా ఆర్టీసీ తెలిపింది. తాజా అప్‌డేట్‌ను అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియాలో సమాచారం ఇస్తామని పేర్కొంది. ఈ మేరకు గురువారం ఒక నోటీస్‌ను జారీ చేసింది. అయితే ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళాకు ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహించాలని గతంలో నిర్ణయించింది. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. అయితే మౌని అమావాస్య సందర్భంగా త్రివేణి సంగమం వద్ద తోపులాట జరిగింది. ఈ సంఘటనలో 30 మంది భక్తులు మరణించారు. 60 మందికిపైగా గాయపడ్డారు. పలువురి జాడ కనిపించడంలేదు. అలాగే అగ్నిప్రమాదాలు వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆ రాష్ట్రం నుంచి భక్తుల రద్దీని తగ్గించేందుకు మహా కుంభమేళాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసింది.

## మహా కుంభమేళాలో మరోసారి అగ్ని ప్రమాదం



**ప్రయాగ్‌రాజ్:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో మరోసారి అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రయాగ్‌రాజ్ సెక్టార్ 22లోని ఛత్‌నాగ్ ఘాట్ వద్ద ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ ఘటలో దాదాపు 15 గుడారాలు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. ఎవరికీ ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించారు. 11రోజుల క్రితం రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో భారీగా మంటలు వ్యాపించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలో 18 టెంట్లు దగ్ధమయ్యాయి.

లైంగిక దాడి కేసులో

## కాంగ్రెస్ ఎంపీ అరెస్టు..


**ప్రెస్‌మీట్ మధ్యలో అదుపులోకి తీసుకున్న పోలీసులు!**



**లక్నో:** కాంగ్రెస్ ఎంపీ రాకేశ్ రాథోడ్‌ను యూపీ పోలీసులు అరెస్టు చేశారు. సీతాపూర్ ఎంపీగా ఉన్న ఆయనపై అత్యాచార ఆరోపణలు రావడంతో కేసు నమోదు చేసిన యూపీ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. సీతాపూర్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతుండగానే ఆయన్ను అరెస్టు చేసినట్లు సమాచారం. భారీ పోలీసు భద్రత నడుమ కోర్టులో హాజరుపరిచారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్లుగా తనపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ ఓ మహిళ జనవరి 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో మాట్లాడిన కాల్ రికార్డింగ్స్‌ను సైతం పోలీసులకు సమర్పించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయమే ఎంపీ రాథోడ్ అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్‌లో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా.. న్యాయస్థానం తిరస్కరించింది. రెండు వారాల్లోగా సెషన్స్ కోర్టులో లొంగిపోవాలని సూచించినట్లు సమాచారం. అంతకముందు ఇదే కేసులో ఎంపీ, ఎమ్మెల్యే కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసినా తిరస్కరణకు గురైంది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన నివాసం వద్దకు భారీ బందోబస్తుతో వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## నాలుగేళ్ల బాలుడికి హెచ్‌ఎంపీవీ..

**గుజరాత్‌లో 8కి చేరిన కేసుల సంఖ్య**




**అహ్మదాబాద్:** నాలుగేళ్ల బాలుడికి హ్యూమన్ మెటాప్‌న్యూమోవైరస్ సోకింది. ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. గుజరాత్‌లో ఈ కేసుల సంఖ్య 8కి చేరినట్లు వెల్లడించారు. జనవరి 28న అహ్మదాబాద్‌లోని గోటా ప్రాంతానికి చెందిన నాలుగేళ్ల బాలుడు జ్వరం, దగ్గుతో బాధపడ్డాడు. ఎస్‌జీవీపీ ఆసుపత్రిలో అడ్మిట్ కావడంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. దీంతో ఆ బాలుడికి హెచ్‌ఎంపీవీ సోకిందని అదే రోజున నిర్ధారించినట్లు అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారి తెలిపారు. ఆ బాలుడు ఇటీవల విదేశాల్లో ప్రయాణించినట్లు చెప్పారు. కాగా, గుజరాత్‌లో ఇప్పటి వరకు 8 హెచ్‌ఎంపీవీ కేసులు నమోదయ్యాయి. అహ్మదాబాద్‌లో ఏడు, సబర్కాంత జిల్లాలో ఒక కేసు వెలుగుచూశాయి. అహ్మదాబాద్‌లోని ఆసుపత్రుల్లో చేరిన ఆరుగురు రోగులను పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## బిజెపిని గెలిపించడమే కాంగ్రెస్ లక్ష్యం

**కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు**



**ఢిల్లీ:** ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుకున్నా.. ఆ పార్టీ నేతలు మాత్రం బీజేపీకి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని అన్నారు. భాజపాను గెలిపించడమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు పని చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కాంగ్రెస్ మద్దతుదారులను ఉద్దేశిస్తూ ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. '' నేను కాంగ్రెస్ మద్దతుదారులతో మాట్లాడాలనుకుంటున్నా. ఈ మధ్య కొందరు నన్ను కలిసేందుకు వచ్చారు. వాళ్లతో మాట్లాడుతూ.. ఎవరికి ఓటు వేస్తారని అడిగాను. కాంగ్రెస్‌కు వేస్తామని చెప్పారు. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అసలు అవకాశమే లేదు కదా. ఎందుకు ఓటు వేయాలనుకుంటున్నారు? అని అడిగా. చాలా కాలంగా అదే పార్టీలో ఉంటున్నామని, హస్తం గుర్తుకు ఓటేయడం అలవాటుగా మారిపోయిందని వాళ్లు చెప్పిన సమాధానం చూసి.. ఒకింత ఆశ్చర్యపోయా. కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాదని వాళ్లకు కూడా తెలుసు. పార్టీ నేతలపై వాళ్లు తీవ్ర అసహనంతో ఉన్నారు. కాంగ్రెస్ నేతల్లో అంతర్గత పోరు జరుగుతోంది. కచ్చితంగా గెలుస్తుందనుకున్న హరియాణాలో ఆ పార్టీ ఓటమి పాలైంది. ఇప్పుడు దిల్లీలోనూ హస్తం పార్టీ అదే పంథా కొనసాగిస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించేందుకు భాజపాతో కలిసి పని చేస్తోంది. అందుకే ఆ పార్టీ నేతలెవరూ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. ఎలా పని చేయాలో తప్ప.. నాకు రాజకీయం తెలీదు. ఆప్ కోసం పని చేసినట్లే.. వాళ్లందరి కోసం పని చేస్తానని చెప్పా. మీరంతా కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. భాజపా అధికారంలోకి వస్తుంది. అదే జరిగితే.. పాఠశాలలు నాశనమవుతాయి. ఉచిత కరెంట్, నీళ్లు, మొహల్లా క్లినిక్‌లు, మహిళలకు ఉచిత బస్సు ఇలా అన్నీ ఆగిపోతాయి. సగటున ఓ కుటుంబం నెలకు రూ.25వేలు నష్టపోవాల్సి వస్తుందని చెప్పాను. వాళ్లంతా ఏకీభవించారు. చీపురు గుర్తుకే ఓటు వేస్తామని చెప్పారు'' అని కేజ్రీవాల్ తన వీడియోలో చెప్పుకొచ్చారు.

నేను బతికున్నంత వరకు

## విషపూరిత నీళ్లు తాగనివ్వను

**కేజ్రీవాల్**



**ఢిల్లీ:** యమునా నది కాలుష్యంపై హర్యానా, ఢిల్లీప్రభుత్వాల మధ్య వివాదం ముదురుతున్న సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని రెండు దేశాల మధ్య యుద్ధంలా చూడొద్దని ఆప్ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. ఈ క్రమంలోనే ఆయన స్పందించారు. తాను ప్రాణాలతో ఉన్నంతవరకు కలుషితమైన యమునా నదిలోని నీటిని ప్రజలను తాగనివ్వనని అన్నారు.

**రాజకీయాలు తగవు..**

యమునా నదిలో నీటిపై తన వ్యాఖ్యల గురించి ప్రస్తావిస్తూ.. ఈసీ కేజ్రీవాల్‌కు నోటీసులు పంపింది. ''యమునా నది అంశంపై ఎన్నికల సంఘం నాకు పంపిన నోటీసుల్లో ఉపయోగించిన భాష సరిగా లేదు. ఈ అంశంపై నోటీసులు పంపి ఈసీ రాజకీయం చేయడం తగదు. నేను జీవించి ఉన్నంతకాలం దిల్లీ ప్రజలను కలుషితమైన నీటిని తాగనివ్వను'' అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. హర్యానా ప్రభుత్వం దేశ రాజధాని దిల్లీకి అమ్మోనియా మోతాదు అధికంగా ఉన్న జలాలను సరఫరా చేసిందని ఆప్ ఆరోపించింది. ఈ అంశం ఇరు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదానికి దారితీసింది. ఈ అంశంపై ఎన్నికల సంఘానికి కూడా ఆప్ నేతలు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి నివేదిక ఇవ్వాలని హరియాణా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈనేపథ్యంలోనే ఈ సమస్యను నరమేధం, రెండు దేశాల మధ్య యుద్ధంలా చూడొద్దని కేజ్రీవాల్‌కు ఈసీ సూచించింది. ఆయా వర్గాల మధ్య శత్రుత్వం పెంచడం, అశాంతిని కలిగించేలా వ్యాఖ్యానించారంటూ ఆయనపై మండిపడింది. ఈ వ్యాఖ్యలు చేసినందుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలంటూ ప్రశ్నించింది. ఈ సమస్యను విష ప్రయోగం అనే అంశంతో కలపకుండా.. నదిలోని నీటి స్వభావం, పరిణామం, విషపూరితమైన విధానాన్ని గుర్తించే పద్ధతులపై సరైన సాక్ష్యాలను అందించేందుకు మరో అవకాశం కల్పించింది. శుక్రవారం ఉదయం 11 గంటలలోపు సాక్ష్యాలను దిల్లీ జల్ బోర్డుకు సమర్పించాలని ఆదేశించింది. లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. ఈక్రమంలోనే స్పందించిన కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## అమ్మాయిల్ని ఆకట్టుకునేందుకు ఆ డ్రగ్ వినియోగించా: బిల్ గేట్స్



**వాషింగ్టన్:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఆరోగ్యంపై చాలా శ్రద్ధ వహిస్తారు. ఆరోగ్యకరమైన ఆహార చిట్కాలు పాటిస్తుంటారు. నిత్యం ఆలోచనలకు పదును పెడుతూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తుంటారు. అయితే, తాను యువకుడిగా ఉన్నప్పుడు చాలా ప్రయోగాలు చేశానని, అమ్మాయిల్ని ఆకట్టుకునేందుకు నిషేధిత ఎల్ఎస్‌డీ డ్రగ్ కూడా రుచి చూశానని గేట్స్ చెప్పుకొచ్చారు. ఈ మేరకు తన పుస్తకం 'సోర్స్ కోడ్'లో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. అంతేకాకుండా తాను చిన్నతనంలో ఎదుర్కొన్న ఆటిజం సమస్యతోపాటు, ఎదురైన పలు సవాళ్ల గురించి కూడా ఆ పుస్తకంలో ప్రస్తావించినట్లు పీపుల్స్ మేగజైన్ వెల్లడించింది. ఫిబ్రవరి 4న ఈ పుస్తకం మార్కెట్‌లోకి విడుదల కానుంది. 'సోర్స్ కోడ్ మై బిగినింగ్స్' పేరిట బిల్ గేట్స్ ఈ పుస్తకాన్ని తీసుకొస్తున్నారు. అందులో తన చిన్ననాటి జీవితంలోని కీలక అంశాలను ప్రస్తావించారు. బిల్ గేట్స్ చిన్నతనంలో ఆటిజంతో బాధపడేవారు. దానికి ఎలాంటి వైద్యం అందించాలో ఆయన తల్లిదండ్రులకు తెలియదు. వివిధ ఆస్పత్రుల చుట్టూ తిరగడం, తనని మామూలు బాలుడిగా చేసేందుకు తన అమ్మానాన్నలు పడిన ఆరాటాన్ని ఈ పుస్తకంలో గేట్స్ చెప్పుకొచ్చారు. చిన్ననాటి స్నేహితుడు ఓ రోడ్డు ప్రమాదంలో చనిపోవడం తనను ఎంతగానో కలచివేసిందంటూ అప్పటి సంగతులను గేట్స్ వివరించారు. 'సోర్స్ కోడ్'ను మూడు పుస్తకాలుగా తీసుకొస్తున్నారు. వాల్యూమ్ 1లో తన తన చిన్ననాటి సంగతులు, డ్రగ్స్‌తో ప్రయోగం లాంటి వివరాలను మాత్రమే గేట్స్ ఇందులో ప్రస్తావించారు. తన ఉద్యోగ జీవితం, మైక్రోసాఫ్ట్‌లో ప్రయాణం, మెలిందా గేట్స్‌తో వివాహం, దాతృత్వ కార్యక్రమాలకు దీనిలో చోటు కల్పించలేదు. భవిష్యత్‌లో విడుదల చేసే పుస్తకాల్లో వాటి గురించి వివరించే అవకాశముంది.

## మరోసారి ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమైన అమెజాన్




**ముంబయి:** టెక్ ప్రపంచంలో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కృత్రిమ మేధ (ఏఐ) రాక, ఆర్థిక మందగమనం, వ్యయ నియంత్రణ చర్యల పేరిట టెక్ దిగ్గజాలు మెటా, ఫేస్‌బుక్, అమెజాన్, గూగుల్ సహా పలు కంపెనీలు లేఆఫ్స్‌కు తెగబడుతున్నాయి. ఆయా సంస్థలు గత ఐదేళ్లలో వేల సంఖ్యలో ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించాయి. కొలువుల కోత ఎప్పుడు తమకు ఎసరు పెడుతుందనే గుబులుతో టెకీలు బిక్కుబిక్కుమంటున్నారు. ఇక కొత్త ఏడాదిలోనూ కొలువుల కోత సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాయి. తాజాగా ఇకామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్ మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమైంది. తాజారౌండ్‌లో కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ఉద్యోగులను ఇంటికి పంపించేందుకు రెడీ అయ్యింది. కార్యాచరణను సమర్థవంతంగా మార్చడంతో పాటు ఖర్చులను తగ్గించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ పేర్కొంది. అమెజాన్ కార్యకలాపాల సమర్థతను పెంచేందుకు ఉద్యోగుల తొలగింపు సహాయపడుతుందని కంపెనీ అభిప్రాయపడింది. లేఆఫ్స్‌కు గురైన ఉద్యోగులకు అవసరమైన సాయం చేస్తామని తెలిపింది. కాగా, అమెజాన్ సీఈఓగా ఆండీ జస్సీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కంపెనీ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా వరుసగా ఉద్యోగుల తొలగింపులను ప్రకటిస్తూనే ఉంది. సంస్థ వ్యయ తగ్గింపు చర్యల్లో భాగంగా 2022లో ఏకంగా 27,000 మంది ఉద్యోగులను తొలగించింది. అయితే, తాజా రౌండ్‌లో ఎంతమందిపై ప్రభావం ఉంటుందన్నది మాత్రం తెలియరాలేదు.

ఓడిపోతారని పసిగట్టి..

## కేజ్రీవాల్ చిల్లర రాజకీయాలు: అమిత్ షా



**ఢిల్లీ:** వచ్చే నెల 5న జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకే ఆప్ అధినేత కేజ్రీవాల్ యమునా నదిలో బీజేపీ విషం కలిపిందని ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. ఈ మేరకు ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఆప్ పాలనలో యమునా నది కలుషితమైపోయిందని.. ఢిల్లీ ప్రజలతో మురికి నీటిని తాగిస్తోందని విమర్శించారు. ఢిల్లీ ఎన్నికల్లో ఓడిపోతామని కేజ్రీవాల్ గ్రహించారని.. అందుకే చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. దిల్లీలో ఆప్ పాలనను తరిమికొట్టేందుకు ఫిబ్రవరి 5 అనేది ఒక అవకాశమని పేర్కొన్న ఆయన.. ఆ రోజు భాజపాకు ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. భాజపా అధికారంలోకి వస్తే దిల్లీని నంబర్ వన్ రాజధానిగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

**ఢిల్లీలో గెలుపు మాదే..**

మరోవైపు, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీ కంటోన్మెంట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, మేనిఫెస్టోలో చెప్పిన విషయాలను అమలు చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనన్నారు. దిల్లీలో ఈసారి భాజపా ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఢిల్లీలోని పంజాబ్ సీఎం నివాసంలో

## పోలీసుల సోదాలు..!



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ సింగ్ నివాసం వద్ద పోలీసు బలగాలు మోహరించారని ఆమ్ ఆద్మీ పార్టీ పేర్కొంది. ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించేందుకు వచ్చారంటూ ఆరోపించింది. ఈ మేరకు దిల్లీ సీఎం ఆతిశీ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా వెల్లడించారు. ''ముఖ్యమంత్రి నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించేందుకు వచ్చారు. కానీ, బీజేపీ చేసిన తప్పులను, ఆ నేతలను మాత్రం పట్టించుకోవడం లేదు. పట్టపగలే ఆ భాజపా నేతలు డబ్బు, పాదరక్షలు ఇలా వస్తువులను ప్రజలకు పంచేందుకు వెళుతున్నారు. అయినప్పటికీ ప్రజలు ఎన్నుకున్న నాయకుడి ఇంటి పైకి రైడ్ చేసేందుకు వచ్చారు'' అని ఆతిశీ ఆరోపించారు.

**మేం సోదాలు చేయలేదు..**

పోలీసుల మోహరింపులపై స్పందించిన ఆప్ నేతలు.. బీజేపీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మరోవైపు.. ఈ ఆరోపణలపై దిల్లీ పోలీసులు స్పందించారు. తాము సీఎం నివాసంలో ఎలాంటి సోదాలు నిర్వహించలేదన్నారు. సివిజిల్ పోర్టల్‌లో వచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు కోసం రిటర్నింగ్ ఆఫీసర్ నేతృత్వంలోని పోలీసు బృందం పంజాబ్ సీఎం నివాసానికి రావాల్సి వచ్చిందని పోలీసు ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. అయితే.. అక్కడున్న భద్రతా సిబ్బంది పోలీసుల బృందాన్ని దర్యాప్తు చేసేందుకు అనుమతించలేదని తెలిపారు.

## భగవంత్ మాన్ ఢిల్లీ నివాసంపై రైడ్?..

**ఆప్ ఆరోపణలను ఖండించిన పోలీసులు**

**న్యూఢిల్లీ:** పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌కు చెందిన ఢిల్లీలోని అధికార నివాసంపై పోలీసుల రైడ్ జరిగిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆరోపించింది. కపుర్తలా హౌస్‌లోకి వెళ్లేందుకు పోలీసులు అక్కడకు చేరుకున్నారని పేర్కొంది. ఢిల్లీ సీఎం అతిషి ఈ మేరకు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌ను బీజేపీ లక్ష్యంగా చేసుకున్నదని ఆరోపించారు. 'ఢిల్లీలోని భగవంత్ మాన్ ఇంటిపై దాడి చేయడానికి ఢిల్లీ పోలీసులు చేరుకున్నారు. బీజేపీ వ్యక్తులు పట్టపగలే డబ్బులు, బూట్లు, బెడ్ షీట్లను బహిరంగంగా పంపిణీ చేస్తున్నారు. అయినప్పటికీ పోలీసులు వాటిని గమనించరు. ఎన్నికైన ముఖ్యమంత్రి నివాసంపై దాడిని వారు ఎంచుకుంటారు' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరోవైపు ఆప్ ఆరోపణలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. ఢిల్లీ ఎన్నికల కోసం ప్రచారం చేస్తున్న ఆప్ నేత, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ అధికారిక నివాసం కపుర్తలా హౌస్‌పై రైడ్ చేయలేదని స్పష్టం చేశారు. సీ విజిల్ పోర్టల్ ద్వారా అందిన ఫిర్యాదును దర్యాప్తు చేయడానికి రిటర్నింగ్ ఆఫీసర్ నేతృత్వంలోని బృందం అక్కడకు చేరుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది లోనికి అనుమతించలేదని చెప్పారు.



# మహా శివరాత్రి ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలి..

### అధికారులకు ఈవో ఆదేశం

**విశ్వంభర, శ్రీశైలం :** మహా శివరాత్రి జాతరకు ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ఆదేశించారు. క్షేత్ర పరిధిలోని వివిధ ప్రాంతాలను అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. అనంతరం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ట్రాఫిక్, పార్కింగ్, మంచినీటి సరఫరా, క్యూలైన్ల నిర్వహణ, విద్యుద్దీకరణ, తాత్కాలిక శౌచాలయాలు, పాతాళగంగలో స్నానఘట్టాల ఏర్పాట్ల పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణకు వచ్చే జిల్లా యంత్రాంగానికి అవసరమైన వసతి ఏర్పాట్లతోపాటు విధుల్లో ఉండే సిబ్బందికి అల్పాహార వసతులను ప్రత్యేకంగా తెలుసుకున్నారు. అదే విధంగా యాత్రికుల అత్యవసర సేవల కోసం ప్రత్యేక దృష్టి ఉంచి తగిన ఏర్పాట్లను సమకూర్చడంలో అలసత్వం వహించవద్దని అన్నారు. సమాచార సూచిక బోర్డులను విరివిగా ఏర్పాటు చేయాలని సూచించారు. అటవీ ప్రాంతం నుంచి కాలినడకన వచ్చే భక్తులకు మంచినీరు,



అల్పాహారాలు వంటి ఏర్పాట్లతోపాటు అటవీశాఖ అధికారుల సూచనలు నిబంధనలను అమలు పరిచేలా భక్తులకు తగు సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరిగే బ్రహ్మోత్సవాల నిర్వహణకు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైదిక కమిటీ సభ్యులు, యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

**సంస్కృతీ సాంప్రదాయాల నిలయం..**

శ్రీశైల మహాక్షేత్ర వైభవాన్ని యాత్రికులకు తెలియపరిచేందుకు విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనాలు ఎంతో విలువైనవని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంస్కృతీ, సాంప్రదాయాలకు నిలయమని ఈవో శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయ పీఠాధిపతి డాక్టర్ ఎం శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డీ విశ్వనాథ్‌శాస్త్రి, డాక్టర్ పీ మురళీధర్‌రెడ్డి, మ్యూజియం కన్సర్‌వేటర్ రమేశ్‌బాబు తదితర అధికార బృందం ఈవోను కలిసి వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో వారితో మాట్లాడుతూ వేల సంవత్సరాల చరిత్ర కలిగిన క్షేత్ర వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ భావితరాల వారికి తెలియజేసేలా ప్రత్యేక మ్యూజియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదే విధంగా ఇప్పటి వరకు చేసిన పరిశోధనలు, సెమినార్లు, ఆచార్యుల వివరాలు తెలుసుకుని క్షేత్ర దర్శనానికి వచ్చే వారికి ప్రత్యేకంగా గైడ్‌లను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు.



## కుంభమేళాలో టీటీడీ ఉద్యోగి అదృశ్యం..

### పోలీసులకు ఫిర్యాదు

**విశ్వంభర, అమరావతి :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో తిరుమల, తిరుపతి దేవస్థానానికి చెందిన ఉద్యోగి ఒకరు అదృశ్యమైన సంఘటన కలకలం సృష్టిస్తోంది. ఆలయ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు, టీటీడీ ఉద్యోగులు ఆయన ఆచూకీ కోసం గాలిస్తున్నారు.కుంభమేళాలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేసింది. ఇందుకుగాను టీటీడీకి చెందిన 2వందల మంది ఉద్యోగులను, సిబ్బందిని విధులకు అక్కడికి పంపించారు. కుంభమేళా ప్రారంభం నాటి నుంచి అక్కడే ఉన్న ఉద్యోగుల్లో దీవేటి సుబ్రహ్మణ్యం అనే ఉద్యోగి బుధవారం నుంచి కనిపించకుండా పోయాడు.దీంతో స్థానిక పోలీసులకు, టీటీడీ ఈవోకు ఉద్యోగులు సమాచారం అందించారు. నిన్నటి నుంచి ఉద్యోగి సుబ్రహ్మణ్యం కోసం కుంభమేళాలో గాలింపు మొదలు పెట్టారు. ఉద్యోగి ఆచూకి కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని టీటీడీ అధికారులు వెల్లడించారు.

## విశాఖలో కేంద్ర మంత్రుల కాన్వాయ్‌కు ప్రమాదం..

### మూడు కార్లు ధ్వంసం

**విశ్వంభర, అమరావతి :** కేంద్ర ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రుల కాన్వాయ్‌కి ప్రమాదం జరిగింది. ఏపీలోని విశాఖపట్నంకు వచ్చిన కేంద్ర ఉక్కు, గనులశాఖ మంత్రి కుమారస్వామి , సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌లో కార్లు ఒకదాని వెనుక ఢీ కొన్నాయి.ఇటీవల కేంద్రం విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు రూ. 11,440 కోట్లు మంజూరు చేసిన అనంతరం తొలిసారిగా గురువారం విశాఖ స్టీల్ ప్లాంట్ సందర్శనకు వచ్చిన కుమారస్వామికి ఎయిర్‌పోర్టులో కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు.అనంతరం ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు పార్లమెంట్ సభ్యులు విశాఖకు కాన్వాయిలో బయలు దేరారు. కొంత దూరం వెళ్లిన తరువాత షీలానగర్ వద్ద ముందు వెళ్తున్న కాన్వాయిలో ఒక కారు డ్రైవర్ సడెన్‌గా బ్రెక్ వేయడంతో వెనుక నుంచి వచ్చిన వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కేంద్ర మంత్రులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. బీజేపీకి చెందిన మాజీ ఎంపీ జీవీఎల్‌కు చెందిన కారుతో పాటు మరో మూడు కార్లు ధ్వంసమయ్యాయి.

## పల్నాడు జిల్లాలో దారుణం..

### బతికుండగానే కన్న తండ్రిని కాలువలో పడేసిన కుమారుడు

**విశ్వంభర, ఈపూరు:** పల్నాడు జిల్లా ఈపూరు మండలం బద్రుపాలెం వద్ద దారుణం చోటు చేసుకుంది. ఓ వ్యక్తి .. బతికుండగానే కన్న తండ్రిని కాలువలో పడేసిన ఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నూజెండ్లకు చెందిన గంగినేని వెంకటేశ్వర్లు తన తండ్రి కొండయ్య(85)ను కారులో తీసుకొచ్చి బద్రుపాలెం వంతెనపై నుంచి సాగర్ కాలువలో పడేశాడు.ఈ ఘటన చూసిన గ్రామస్థులు వృద్ధుడిని కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. వృద్ధుడిని కాలువలో పడేసిన అనంతరం కారులో పరారవుతున్న వెంకటేశ్వర్లును గ్రామస్థులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారమందించారు. పోస్టుమార్టం నిమిత్తం కొండయ్య మృతదేహాన్ని వినుకొండ ఆసుపత్రికి తరలించారు. వినుకొండ గ్రామీణ సీఐ ప్రభాకర్, ఈపూరు ఎస్సై ఉమా మహేశ్వర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

## ఏపీలో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద రద్దీ

### ఫిబ్రవరి 1 నుంచి కొత్త ఛార్జీలు

**విశ్వంభర, అమరావతి:** ఏపీలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ విలువల సవరణ జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువల సవరణ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ విలువకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలు సవరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి సవరించిన విలువలు అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌ను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశించారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల రిజిస్ట్రేషన్ విలువల పెంపు, తగ్గింపు చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఏపీలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద రద్దీ నెలకొంది. గుంటూరులో రాత్రయినా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఏడాది ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకు ఒకసారి రిజిస్ట్రేషన్ విలువలు, స్ట్రక్చర్ విలువలను సవరించాలి. కానీ వైకాపా ప్రభుత్వం ప్రత్యేక రివిజన్ పేరుతో విలువలను పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపింది. వీటిపై సమీక్షించిన కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువలను సవరించాలని నిర్ణయించింది.

## మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి

**విశ్వంభర, సూర్యాపేట:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని ఈ అసమర్ధ ప్రభుత్వానికి కళ్ళు తెరిపించి జ్ఞానోదయం కలిగించాలని తుంగతుర్తి లోని మహాత్మా గాంధీ విగ్రహానికి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ సూర్యాపేట జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ గుజ్జ దీపిక ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతులను, నిరుద్యోగులను, విద్యార్థులను, మహిళలను, వృద్ధులను, ఉద్యోగులను, కార్మికులను అన్ని రంగాల వారిని మోసం చేసింది.దశాబ్దాల పాటు దగా పడ్డ తెలంగాణ బిడ్డలు మళ్లీ అవే కష్టాలు, అవే కన్నీల్ల లో చిక్కుకుని విలవిలాడుతున్న వేళ ఈ దద్దమ్మ కాంగ్రెస్ సర్కారుకు 420 హామీలు అమలు చేసే బుద్ధినివ్వాలని మహాత్మా గాంధీకి సవినయంగా ప్రార్థిస్తున్నాము. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి నియోజకవర్గం లోని పాలు మండలాల మాజీ ప్రజాప్రతినిధులు పార్టీ మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు



**విశ్వంభర, తిరుమల :** మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం దర్శనానికి వచ్చిన సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువతో సన్మానించారు.

## ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం



**విశ్వంభర, తిరుపతి:** తిరుపతికి చెందిన బ్లిస్ హోటల్స్ గ్రూప్ చైర్మన్ ఎం. సూర్యనారాయణ రెడ్డి దంపతులు టీటీడీ ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్ట్ కు రూ.10,00,116 విరాళాన్ని గురువారం అందించారు. ఈ సందర్భంగా చెక్‌ను టీటీడీ అదనపు ఈవోసిహెచ్ వెంకయ్య చౌదరి కి తిరుమలలోని అడిషనల్ ఈవో క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జి.భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## తిరుమల శిలాతోరణం వద్ద చిరుత సంచారం



**విశ్వంభర, తిరుమల:** తిరుమలలో చిరుత సంచారం కలకలం రేపింది. తిరుమల శిలాతోరణం వద్ద గురువారం సాయంత్రం చిరుత సంచరిస్తున్నట్లు గుర్తించిన భక్తులు.. తితిదే, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం సర్వదర్శన టోకెన్ల క్యూలైన్ సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తులను తితిదే అప్రమత్తం చేసింది.

## అచ్యుతాపురం బ్రాండిక్స్ పరిశ్రమ ఎదుట మహిళా కార్మికుల ఆందోళన

**విశ్వంభర, విశాఖపట్నం:** అరగంట అదనంగా పనిచేయాలని ఒత్తిడి చేయడంతో పాటు, పదేళ్లుగా వేతనాలు పెంచలేదని ఆరోపిస్తూ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని బ్రాండిక్స్ పరిశ్రమ మహిళా ఉద్యోగులు ఆందోళనకు దిగారు. కంపెనీలో అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపిస్తూ వేలాది మంది కార్మికులు బ్రాండిక్స్ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. తెల్లవారు జామున 3గంటలకు ఇంటి నుంచి బస్సులో బయలుదేరి పరిశ్రమకు వచ్చి.. రాత్రి 10.30గంటల వరకు పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచకపోగా, ఆదివారం కూడా పనిచేయిస్తూ కుటుంబాలకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పరిశ్రమకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



## పెట్టుబడులు సాధించే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలి

### - సీఎం చంద్రబాబు

**విశ్వంభర, అమరావతి:** ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) 3వ సమావేశం ప్రారంభమైంది. ఇందులో 15 ప్రాజెక్టులకు సంబంధించి పెట్టుబడులకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకోనున్నారు. రూ.44,776 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలపనున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. గత రెండు సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టుల స్థితిగతులపైనా ఇందులో చర్చించనున్నారు.ఒప్పందాలపై పరిశ్రమల యాజమాన్యాలతో నిరంతర చర్చలు జరిపి సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు తెలిపారు. అధికారులు, మంత్రులు పెట్టుబడులను ఎప్పటికప్పుడు సమీక్షించి త్వరితగతిన ఫలితాలు చూపించాలన్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్న నేటి పరిస్థితుల్లో ఫలితాలు రావాలంటే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసి చూపాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర స్థాయిలో అనుమతులు, క్షేత్ర స్థాయిలో పనులపై కలెక్టర్లతో సమీక్ష చేయాలని ప్రధాన కార్యదర్శికి తెలిపారు. పెట్టుబడులపై దిగ్గజ సంస్థల నుంచి, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల నుంచి వస్తున్న స్పందన సంతృప్తికరంగా ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి పెట్టుబడులు సాధించేందుకు ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు



## పుంగనూరు ఓటర్ల కన్నా పెద్దిరెడ్డి పాపాల లిస్టే ఎక్కువ: పంచుమర్తి అనురాధ

**విశ్వంభర, అమరావతి:** రాష్ట్రంలో అత్యంత అవినీతిపరుడు జగన్ అయితే.. ఆయన్ను మించిన వ్యక్తి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని ఏపీ శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు పుంగనూరు ఓటర్ల లిస్టు కన్నా పెద్దిరెడ్డి అవినీతి, పాపాల లిస్టే ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు. ఆయన పగలు పూజలు.. రాత్రంతా దోపిడీలు చేస్తుంటారని ఆరోపించారు. పెద్దిరెడ్డి అవినీతి సామ్రాజ్యం మండల స్థాయి నుంచి కేంద్రం వరకు పాకిందన్నారు. శివశక్తి పాల డైయిరీ ద్వారా రైతుల రక్తాన్ని పీల్చుతున్నారన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో అసైన్డ్ భూములు, పుంగునూరు మండలం రాగానిపల్లెలో భూములు కొట్టేయలేదా అని ప్రశ్నించారు. రేణిగుంట పరిధిలోని 20 ఎకరాల ప్రభుత్వ భూమి పెద్దిరెడ్డి భార్య పేరున ఎలా వచ్చిందని అనురాధ నిలదీశారు.



## కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్ఎస్ ఆగ్రహం

### గాంధీ విగ్రహానికి వినతి

**విశ్వంభర, మిర్యాలగూడ ;** మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు భాస్కర్ రావు నిర్దేశానుసారం కాంగ్రెస్ ఇచ్చిన 420హామీలు పూర్తి చేయనందుకు నిరసనగా మిర్యాలగూడ పట్టణంలోని గాంధీ విగ్రహానికి స్థానిక నేతలతో కలిసి ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు... అలవికానీ హామీలతో కాంగ్రెస్ అధికారంచేపట్టింది.తీరా గెలిచాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. తులం బంగారం, నాలుగు వేల పెన్షన్, రైతు భరోసా రూ.15 వేలు ఇలా అనేక హామీలను విస్మరించిందని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ప్రశ్నించే గొంతుకులపై ఉక్కు పాదం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజల తరఫున పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా పేదల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. పేదల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిలుస్తోందని అన్నారు.



## 1న కెటిఆర్ సభను విజయవంతం చేయాలి

### - దోమ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ గౌడ్

**విశ్వంభర, పరిగి ;** కుల్కచర్ల మండల పరిధిలోని దాస్య నాయక్ తండాలో డా॥ బి. ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవనీకి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి సారధ్యంలో జరిగే కార్యక్రమనీకి తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వస్తున్నారని దోమ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.శ నివారం ఉదయం 11:30 నిముషాలకు విగ్రహ ఆవిష్కరణ,సభను దోమ మండలంలోని నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.



## చికిత్స పొందుతూ వ్యక్తి కన్నుమూత

### అనుమానాస్పద మృతిగా కేసు నమోదు.. : ఎస్సై రమేష్ బాబు

**విశ్వంభర, నెల్లికుదురు:** చికిత్స పొందుతూ వ్యక్తి కన్నుమూసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నరసింహుల గూడెం గ్రామానికి చెందిన చల్లమల్ల గుట్ట స్వామి(54) ఈనెల 6న తన ఇంటి ముందు ఉన్న చెట్లను తొలగిస్తూ చదును చేస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన పెద్దూరి నర్సయ్య గుట్టయ్యను నెట్టి వేశాడు. దీంతో ఆయనకు దెబ్బలు తగిలాయి. ఆసుపత్రికి వెళ్ళినా నొప్పి తగ్గలేదు. తిరిగి మళ్లీ హాస్పిటల్కు వెళ్లాడు. కిడ్నీ,లివర్ డ్యామేజయిందని చెప్పడంతో ఎంజీఎం లో చికిత్స కోసం అడ్మిట్ చేశారు.చికిత్స పొందుతూ ఈనెల 29(బుధవారం) కన్నుమూశాడు. గతంలో గుట్టయ్యకు మద్యం అలవాటు ఉంది. నెట్టివేసిన దెబ్బ మూలంగానో,లేని పక్షంలో మద్యం తాగడం వలననో చనిపోయి ఉండవచ్చు. ఈ మేరకు గుట్టయ్య భార్య హైమ చేసిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



## ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్కులు పంపిణీ

**విశ్వంభర, పరిగి :** మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డుకు చెందిన బసప్ప కు గురువారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మూడవ వార్డ్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎజాజ్, అడ్వకేట్ ఆనంద్ గౌడ్ లబ్ధిదారునికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. వారు మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





**మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం తెలంగాణ రాష్ట్ర ఏవీఓపీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆఫీస్ ప్రాంగణం వాసవి సేవకేంద్రంలో మహాత్మా గాంధీ విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షుడు మలి పెద్ది శంకర్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, కోలేటి దామోదర్,సేవకేంద్రం అధ్యక్షుడు కొల్లూరు రమేష్, నచం ప్రభాకర్, రావికంటి శ్రీనివాస్, కోలేటి రమేష్, కోలేటి శ్రీనివాస్, చంద్రప్రకాష్, పబ్బతి శ్రీనివాస్, నటరాజ్, ఏవీఓపీపీ కొమురవెల్లి సుధాకర్, అగీర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.**

**- విశ్వంభర, హైదరాబాద్**



# నేడు ఇంగ్లాండ్‌ను ఢీకొట్టనున్న మహిళల టీమిండియా!

**కౌలాలంపూర్‌:** మలేషియా వేదికగా జరుగుతున్న అండర్-19 వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్‌లో భాగంగా టీమిండియా ఇంగ్లాండ్‌తో జనవరి 31న తలపడనున్నది. ఐసీసీ టోర్నీలో ఇప్పటి వరకు టీమిండియా వరుస విజయాలతో సెమీ ఫైనల్ వరకు చేరింది. ఇక కీలకమైన సెమీస్‌లోనూ నిక్కీ ప్రసాద్ నేతృత్వంలోని యువ భారత్ జోరును కొనసాగిస్తే ఫైనల్‌కు చేరుకోనున్నది. గ్రూప్ దశలో వెస్టిండిస్, మలేషియా, శ్రీలంకపై వరుస విజయాలను నమోదు చేసి సూపర్ సిక్స్‌కు చేరింది. సూపర్ సిక్స్ దశలో తొలి మ్యాచ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో, రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టుపై 150 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది.

**త్రిష జోరు కొనసాగాలని..**

సూపర్ సిక్స్ దశలో స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ అమ్మాయి త్రిష గొంగడి అద్భుత బ్యాటింగ్‌తో అలరించింది. అండర్-19 టీ20 వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారిగా సెంచరీ చేసిన బ్యాటర్‌గా చరిత్ర లిఖించింది. స్కాట్లాండ్ జట్టుపై 59 బంతుల్లోనే 10 పరుగులు చేసింది. ఇందులో 13 ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో కేవలం 53 బంతుల్లోనే అజేయ సెంచరీ చేసింది. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో మరో ఓపెనర్ జీ కమలినీ సైతం 42 బంతుల్లో 51 పరుగులతో రాణించింది. టోర్నీలోని ఐదు మ్యాచుల్లో త్రిష 76.66 సగటుతో 230 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బ్యాట్స్‌వుమెన్స్ దేవినా పెర్రిన్ 131 పరుగులతో రెండో స్థానంలో ఉంది. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో భారత్ బౌలర్లు అద్భుత ప్రదర్శన చేసి 58 పరుగులకే ఆలౌట్ చేశారు. ఈ మ్యాచ్‌లు ఆయుషి శుక్లా ఎనిమిది పరుగులు ఇచ్చి నాలుగు వికెట్ల పడగొట్టింది. వైష్ణవి శర్మ ఐదు పరుగులు ఇచ్చి మూడు వికెట్లు, గొంగడి త్రిష ఆరు పరుగులు ఇచ్చి మూడు వికెట్ల చేసింది. వైష్ణవి ఇప్పటి వరకు 12 వికెట్ల పడగొట్టగా.. ఆయుషి పది వికెట్ల తీసింది.

**భారత జట్టు :** నిక్కీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చల్కే, జీ త్రిష, జీ కమలిని, భావికా అహిరే, ఈశ్వరి అవసరే, మిథిలా వినోద్, జోషితా వీజే, సోనమ్ యాదవ్, పరుణికా సిసోడియా, కేసరి ధృతి, ఆయుషి శుక్లా, ఆనందిత కిషోర్, వైష్ణవ్, ఎండీ షబ్నం.

**ఇంగ్లాండ్ జట్టు :** అబి నార్గ్రోవ్ నార్గ్రోవ్ (కెప్టెన్), ఫోబ్ బ్రెట్, ఒలివియా బ్రిస్డెన్, టిల్లీ కోర్టీన్ కోల్‌మన్, ట్రూడీ జాన్సన్, కేటీ జోన్స్, షార్లెట్ లాంబార్ట్, ఈవ్ ఓనీల్, దేవినా పెర్రిన్, జెమిమా స్పెన్స్, షార్లెట్ స్టబ్స్, అమృతా సురేన్‌కుమార్, ప్రిషా థానవాలా, ఎరిన్ థామస్, గ్రా థానవాలా.

# ఇది కదా దురదృష్టమంటే.. ఇలానూ రనౌట్ అవుతారా?

**ముంబయిః** క్రికెట్‌లో అనేక విధాలుగా బ్యాటర్లు ఔటవుతుంటారు. క్యాచ్, బౌల్డ్, రనౌట్.. ఇలా పెవిలియన్‌కు చేరతారు. వీటిల్లో బ్యాటర్ల తప్పిదం లేదా ఫీల్డర్ అద్భుత ప్రదర్శన ఉంటుంది. పొరపాటు చేసి ఔటైతే ఆ బ్యాటర్ కూడా బాధపడదు. కానీ, ఔట్ విషయంలో తన పాత్ర ఏమీ లేకుండానే పెవిలియన్‌కు చేరితే ఆ బాధ మాటల్లో చెప్పలేం. ఇదే పరిస్థితి దక్షిణాఫ్రికా - ఇంగ్లండ్ జట్ల అండర్-19 విభాగంలో ఓ బ్యాటర్‌కు ఎదురైంది. అతడు ఔటైన తీరు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. పాపం.. ఇంతకంటే దురదృష్టకరమైన ఔటయ్యేదెవరూ ఉండరని కామెంట్లు వస్తున్నాయి. అసలేం జరిగిందంటే?



ఇంగ్లండ్ - దక్షిణాఫ్రికా అండర్-19 జట్లు అనధికారిక టెస్టు మ్యాచ్‌ను ఆడాయి. ఇంగ్లండ్ బ్యాటర్ ఆర్యన్ సావంత్ క్రీజ్‌లో ఉన్నాడు. సఫారీ జట్టు బౌలర్ జాన్ రోల్స్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ కొట్టాడు. షార్ట్ లెగ్‌లో ఉన్న ఫీల్డర్ జోరిచ్ వాన్ హెల్మెట్‌ను తాకిన బంతి మళ్లీ స్టంప్స్ వైపు వచ్చింది. అప్పటికి షాట్‌ను కొట్టిన సావంత్ క్రీజ్ బయట ఉన్నాడు. బెయిల్స్‌ను బంతి పడగొట్టడంతో రనౌట్ అయినట్లు ఫీల్డింగ్ జట్టు అప్పీలు చేసింది. మరోవైపు బ్యాటర్ మాత్రం షాక్‌కు గురైనట్లు అలాగే కాసేపు క్రీజ్‌లో ఉండిపోయాడు. అయితే, తొలుత హెల్మెట్‌ను తాకిందని అంతా భావించినా.. రిప్లేలో మాత్రం ఫీల్డర్ మోకాలిని బలంగా తాకినట్లు కనిపించింది. అప్పటికే వాన్ బాధతో అక్కడే పడిపోయాడు. వెంటనే జట్టు సహచరులు వచ్చి అతడికి సపర్యలు చేశారు. అయితే, ఈ ఘటనపై అభిమానులు విభిన్నంగా స్పందించారు. ''దానిని డెడ్ బాల్‌గా పరిగణించాలి'.. ''పాపం క్రికెట్‌లో అత్యంత దురదృష్టమైన బ్యాటర్ ఇతడేనేమో'' అనే కామెంట్లు వస్తున్నాయి.

# ఉస్మాన్ ఖవాజా డబుల్ సెంచరీ

**గాలే:** శ్రీలంకతో జరుగుతున్న ఫస్ట్ టెస్ట్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా డబుల్ సెంచరీ చేశాడు. అతను 232 రన్స్ చేసి ఔటయ్యాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేస్తున్న ఆస్ట్రేలియా తాజా సమాచారం ప్రకారం 143 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 600 రన్స్ చేసింది. శ్రీలంకలో సచిన్ చేసిన డబుల్ సెంచరీ రికార్డును ఖవాజా బ్రేక్ చేశాడు. 2010లో సచిన్ 37 ఏళ్ల వయసులో డబుల్ సెంచరీ నమోదు చేశాడు. ఆ మ్యాచ్లో అతను 347 బంతుల్లో 203 రన్స్ చేశాడు. అయితే ఖవాజా 38 ఏళ్ల వయసులో డబుల్ సెంచరీ చేయడం విశేషం. 15 ఏళ్ల క్రితం సచిన్ నమోదు చేసిన ఓల్డెస్ట్ ప్లేయర్ రికార్డును ఖవాజా బ్రేక్ చేశాడు. శ్రీలంకలో డబుల్ సెంచరీ స్కోర్ చేసిన తొలి ఆసీస్ బ్యాటర్‌గా కూడా ఖవాజా నిలిచాడు. టెస్టుల్లో ఆస్ట్రేలియా తరపున మైఖేల్ స్లేటర్ అత్యధికంగా 219 రన్స్ చేయగా, ఇప్పుడు ఆ రికార్డును ఖవాజా దాటేశాడు.



### ప్రపంచ పికిల్‌బాల్ లీగ్‌లో

# హైదరాబాద్ సూపర్‌స్టార్స్, డిల్లీ దిల్‌వాలేపై విజయం

**విశ్వంభర, బషీర్ బాగ్:** ప్రపంచ పికిల్‌బాల్ లీగ్‌లో హైదరాబాద్ సూపర్‌స్టార్స్ 4-1 తేడాతో డిల్లీ దిల్‌వాలేపై తిరుగులేని విజయం సాధించింది. ఎడ్వర్డో ఇరిజారీ పురుషుల సింగిల్స్‌లో మెరుపు ఆరంభాన్ని అందించారు. మాక్స్ ఫ్రీమాన్‌పై 24-9తో విజయం సాధించి వెనక్కి తిరిగి చూసుకోలేదు. మహిళల డబుల్స్‌లో సూపర్‌స్టార్లు ఎదురుదెబ్బ కొట్టారు. ఇక్కడ కరోలినా ఓవ్‌జారెక్‌తో కలిసి లుడోవికా స్కియాకీ అరంగేట్రం చేసింది. హైదరాబాద్‌కు తక్కువ స్కోరింగ్ అయినా 14-7 విజయాన్ని సాధించింది. పురుషుల డబుల్స్ హోరాహోరీ పోరులో హైదరాబాద్ తన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. డిల్లీ నుంచి సెకండ్ హాఫ్‌లో పోరాటం ఉన్నప్పటికి, రాస్ విట్టేకర్, మాక్స్ ఫ్రీమాన్ 10-8తో కెంటా మియోషి, లియాండర్ లాజారోలను అధిగమించారు. లైన్‌లో టై కావడంతో.. మహిళల సింగిల్స్‌లో మదలీనా గ్రిగోరియు తన శక్తిని ఉపయోగించి అలెక్సా షుల్‌ను 22-8తో ఓడించి, హైదరాబాద్‌కు విజయాన్ని అందించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మరో గట్టి పోటీ కనిపించింది. డిల్లీ ప్రయత్నాలు చేసినప్పటికి హైదరాబాద్ 11-9తో



తమ ఆధిపత్యాన్ని చూపిస్తూ విజయాన్ని సొంతం చేసుకుంది.లీగ్ నిర్ణయాత్మక దశ వైపు వెళుతుండగా అందరి దృష్టి రేపటి పోటీపైనే ఉంది. ముంబై పికిల్ పవర్ బెంగళూరు జవాన్లతో తలపడుతుంది. పూణే యునైటెడ్ డిల్లీ దిల్‌వాలేతో తలపడుతుంది. పికిల్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగింది.

# ఆ ఆలోచనే లేదు.. టెస్టుల్లో రీఎంట్రీనే నాకు ముఖ్యం

## కరుణ్ నాయర్

**ముంబయిః** విజయ్ హజారే ట్రోఫీలో శతకాలు బాదేశాడు. దాదాపు 390 సగటుతో 779 పరుగులు చేశాడు. అంతకుముందు భారత్ తరఫున టెస్టుల్లో ట్రిపుల్ సెంచరీ చేశాడు. కానీ, తన ప్లేస్‌ను మాత్రం నిలబెట్టుకోలేదు. ఇప్పుడు దేశవాళీలో అదరగొట్టినా.. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక కాలేకపోయాడు. దానికి కారణమేంటో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ తెలిపిన సంగతి తెలిసిందే. మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ.. ప్రస్తుతం అతడి బ్యాటింగ్ స్థానం ఖాళీగా లేదని వెల్లడించాడు. కనీసం బ్యాకప్‌గానైనా తీసుకొంటే బాగుండేదన్న వ్యాఖ్యలూ వినిపించాయి. కానీ, కరుణ్ నాయర్‌కు మాత్రం ఛాంపియన్స్ ట్రోఫీ ఆలోచనే లేదని.. టెస్టుల్లో రీఎంట్రీ ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిపాడు. ''విజయ్ హజారే ట్రోఫీ లేదా ఇతర ఏ టోర్నమెంట్‌లోనైనా నా ప్రదర్శన అత్యుత్తమంగా ఉండాలనే ప్రయత్నిస్తా. అప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ గురించి ఆలోచనే లేదు. అయితే, ఓ మాట చెబుతా. ప్రతిఒక్కరికీ కలలు ఉంటాయి. ఫలానాది సాధించాలని ఎవరైనా అనుకుంటేనే అప్పుడు దాని గురించి ఎక్కువగా ఆలోచిస్తారు. లక్ష్యం అందుకోవడానికి ఏం చేయాలనే దానిపై దృష్టిపెడతారు. కానీ, ఏం జరుగుతుందనేది ఎప్పుడూ



మన మనసులో ఆందోళన ఉండటం సహజం. నేను ఇప్పటికీ భారత్ తరఫున టెస్టు క్రికెట్ మళ్లీ ఆడాలనేదే నా లక్ష్యం. ఇప్పటికే చాలా ఇంటర్వ్యూల్లో ఇదే మాట చెప్పా. నా మైండ్‌లో ఇదొక్కటే ఉంది. నన్ను ఛాంపియన్స్ ట్రోఫీకి తీసుకుంటారా? లేదా అనేది ఎప్పుడూ ఆలోచించలేదు. కాబట్టి, నేనేమీ దాని గురించి బాధ పడలేదు'' అని నాయర్ వెల్లడించాడు.

**సచిన్ నుంచి ప్రశంసలు..**

''విజయ్ హజారే ట్రోఫీలో నాణ్యమైన ఆటతీరు కనబరిచినందుకు సచిన్ తెందూల్కర్ నుంచి నాకు ప్రశంసలు అందాయి. నా చిన్ననాటి హీరో అభినందిస్తుంటే గొప్ప అనుభూతి. నాకెంతో ప్రత్యేకమైన క్షణాలు అవే. నిజంగా దిగ్గజ క్రికెటర్ నుంచి అలాంటి మాటలు ఆశీర్వచనాలే. కానీ, మున్ముందూ ఇదే ఆటతీరును ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. ప్రతి మ్యాచ్.. ప్రతి ఇన్నింగ్స్ ఇక్కడ కౌంటే. ఇకనుంచి నా దృష్టి అలానే ఉంటుంది'' అని సీనియర్ క్రికెటర్ తెలిపాడు.

# రంజీల్లో అలరించిన మయాంక్ అగర్వాల్..!

### నిరాశ పరిచిన కేఎల్ రాహుల్..!

**ముంబయిః** భారత జట్టు స్టార్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్ దేశవాళీ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. దాదాపు ఐదేళ్ల తర్వాత దేశవాళీ క్రికెట్ ఆడుతున్న రాహుల్ నిరాశ పరిచాడు. కర్ణాటక కెప్టెన్ మయాంక్ అగర్వాల్ మాత్రం అద్భుతమైన హాఫ్ సెంచరీతో అలరించాడు. కర్ణాటక – హర్యానా మధ్య గ్రూస్-సీ మ్యాచ్ బెంగళూరు వేదికగా బుధవారం మొదలైంది. ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ కర్ణాటక తరఫున బరిలోకి దిగాడు. అభిమానులు బ్యాట్‌తో అలరిస్తాడని ఆశించగా.. నిరాశపరిచాడు. నెంబర్ త్రీలో బ్యాటింగ్‌కు వచ్చిన రాహుల్ కేవలం 26 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అన్షుల్ కాంబోజ్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. రాహుల్ ఆస్ట్రేలియా పర్యటనలోనూ కాస్త ఇబ్బందికరంగానే కనిపించాడు. స్టార్ ప్లేయర్ కర్నాటక తరఫున మార్చి 2020లో బెంగాల్‌తో తన చివరి మ్యాచ్ ఆడగా.. చాలా సంవత్సరాల తర్వాత రంజీ మ్యాచ్ ఆడుతుండగా.. బ్యాట్‌తో పరుగుల వరద పారిస్తాడని అభిమానులు ఆశించగా.. రాహుల్ బ్యాట్ మాత్రం మూగబోయింది. ఆస్ట్రేలియా పర్యటనలో రెండు ఇన్నింగ్స్‌లో రాహుల్ రాణించినా.. మిగతా అన్ని ఇన్నింగ్స్‌లో ఫెయిల్ అయ్యాడు. పెర్త్ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో 77 పరుగులు, గబ్బా టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 84 పరుగులు మాత్రమే చేశాడు. మిగతా ఎనిమిది ఎన్నింగ్స్‌లో 115 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో టీమిండియా 1-3 తేడాతో ఓటమి పాలైన విషయం తెలిసిందే. కేఎల్ రాహుల్ ఇంగ్లాండ్‌తో త్వరలో జరిగే మూడు వన్డేల సిరీస్‌తో పాటు ఆ తర్వాత జరిగే చాంపియన్స్ ట్రోఫీ ఆడనుండగా.. అప్పటి వరకు రాహుల్ ఫామ్‌లోకి వచ్చి బ్యాట్‌తో రాణించాలని కోరుకుంటున్నారు. ఇక హర్యానాతో జరిగిన మ్యాచ్‌లో కర్ణాటక కెప్టెన్ మయాంక్ అగర్వాల్ ఆకట్టుకున్నాడు. ఎనిమిది ఫోర్లు, మూడు సిక్సర్ల సహాయంతో 91 పరుగులు చేశాడు. తొలి రోజు ఆటముగిసే సరికి కర్ణాటక ఐదు వికెట్ల నష్టానికి 267 పరుగులు చేసింది. కృష్ణన్ శ్రీజిత్ 18, యశోవర్ధన్ పరంతప్ 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

# అమెజాన్‌లో మరోసారి తొలగింపులు

**ముంబయిః** ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి పెద్ద ఎత్తున ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైంది. తాజా రౌండ్ తొలగింపులో కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ఉద్యోగులను ఇంటికి పంపనుంది. కార్యకలాపాలను క్రమబద్ధీకరించడంతో పాటు ఖర్చుల్ని తగ్గించేందుకు అమెజాన్ సిద్ధమవుతోంది. అందులో భాగంగా తాజా తొలగింపులు చేపట్టనుంది. కంపెనీ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు కంపెనీ విస్తృత వ్యూహంలో భాగంగా ఈ చర్యలు చేపడుతోంది. అమెజాన్ కార్యకలాపాలు చురుగ్గా సాగడానికి 'లే ఆఫ్‌లు' దోహదపడతాయని కంపెనీ పేర్కొంది. లేఆఫ్‌లపై కంపెనీ ప్రతినిధి బ్రాడ్ గ్లాసర్ స్పందించారు. ఉద్యోగుల తొలగింపు నిజమేనని పేర్కొన్న ఆయన ఈ నిర్ణయం సులభమైనది కాదన్నారు. కస్టమర్లకు మరింత చేరువయ్యేందుకు, ఉనికిని



బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం సాయపడుతుందన్నారు. లేఆఫ్‌ల కారణంగా ప్రభావం ఎదుర్కోనున్న ఉద్యోగులకు తాము సాయం అందిస్తామని ఆయన తెలిపారు.అమెజాన్ సీఈఓగా ఆండీ జస్సీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కంపెనీ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా లేఆఫ్‌లను ప్రకటిస్తూనే వచ్చారు. కార్యకలాపాలను విస్తృతం చేసే కఠిన చర్యల్లో భాగంగా వరుసగా ఉద్యోగులను ఇంటికి పంపుతున్నారు. 2022లో ఏకంగా 27వేల మంది ఉద్యోగులను అమెజాన్ తొలగించింది. తాజాగా కమ్యూనికేషన్ విభాగంలోని ఉద్యోగులపై ఈ వేటు పడింది. అయితే ఎంత మందిపై ఈ ప్రభావం పడనుందనే విషయాన్ని మాత్రం కంపెనీ వెల్లడించలేదు.



# లాభాల్లో ముగిసిన మార్కెట్ సూచీలు.. నిఫ్టీ@23,200

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కాసేపు ఒత్తిడికి లోనయ్యాయి. ఆ తర్వాత ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో రాణించిన సూచీలు చివరకు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 76,598.84 (క్రితం ముగింపు 76,532.96) వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. కాసేపు లాభ నష్టాల మధ్య కొనసాగిన సూచీ ఇంట్రాడేలో 76,401.13 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఫార్మా షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో రాణించిన సూచీ 76,962.88 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని చేరింది. చివరికి 226 పాయింట్ల లాభంతో 76,759 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86 పాయింట్ల లాభంతో 23,249 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, నెస్లే ఇండియా, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, ఎంఅండ్‌ఎం, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభపడ్డాయి. టాటా మోటార్స్, ఐటీసీ హోటల్స్, బజాజ్‌ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, జొమాటో, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76.05 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,788.60 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# అకిరా నందన్‌తో పనిచేయడానికి సిద్ధం : విష్ణు వర్ధన్




నటుడు పవన్ కళ్యాణ్ కుమారుడు అకిరా నందన్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా వున్నానని కోలీవుడ్ దర్శకుడు విష్ణు వర్ధన్ ఆసక్తి వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ నటించిన పంజా చిత్రంతో తెలుగులోకి అరంగేట్రం చేసిన విష్ణు వర్ధన్, ఈ నెల 30న థియేటర్లలోకి రాబోతున్న తన తాజా చిత్రం ప్రేమిస్తావా విడుదలకు ముందు నిర్వహించిన ప్రెస్ మీట్ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.

అకిరాతో సినిమాను పంజా సీక్వెల్‌గా లేదా స్పెషల్ ప్రాజెక్టుగా దర్శకత్వం వహిస్తారా అనే ప్రశ్నకు విష్ణు వర్ధన్ సమాధానం ఇస్తూ.. "నేను ముందుగానే ప్రాజెక్టులు ప్లాన్ చేయను. ప్రతిదానికీ సరైన సమయం అవసరం. పంజా కూడా ముందుగా ప్లాన్ చేసినది కాదు. నేను ఇంకో తెలుగు సినిమా చేయకపోతే, నా తల్లి నన్ను వదిలిపెట్టదు" అని అని అన్నారు.

పంజా తర్వాత తాను మరో తెలుగు చిత్రానికి ఎందుకు దర్శకత్వం వహించలేదో వివరిస్తూ, తనకు ఆఫర్లు వచ్చినప్పటికీ, తాను ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నానని వివరించారు.

## బాలీవుడ్ పై షాకింగ్ కామెంట్స్ చేసిన రెజీనా



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో చాలా కాలం బాలీవుడ్ దే హవా నడిచిందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే రాను రాను హిందీ సినిమాల హవా తగ్గిపోయి దక్షిణాది చిత్రాల ఇమేజ్ పెరిగిపోయింది. ఇప్పుడు హిందీ సినిమాలో సౌతిండియన్ యాక్టర్లున్నారంటే క్రేజ్ అమాంతం పెరిగిపో-తుందంటే.. దక్షిణాది యాక్టర్లు ఎలాంటి ప్రభావం చూపించారో అర్థం చేసుకోవచ్చు. ఇదే విషయం గురించి చిట్‌చాట్‌లో మాట్లాడింది రెజీనా కసాండ్రా.

మగిజ్ తిరునేని డైరెక్షన్‌లో అజిత్ కుమార్ నటిస్తోన్న పట్టుదలలో వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది రెజీనా. ప్రస్తుత పరిస్థితుల గురించి రెజీనా మాట్లాడుతూ.. బాలీవుడ్‌లో గతంలో క్లిష్ట పరిస్థితులుండేవి. సౌతిండియన్ యాక్టర్లకు అక్కడ అవకాశాలు దొరకడం కష్టంగా ఉండేది. అప్పట్లో మీరు సౌత్ నుంచి వచ్చారని తెలిస్తే అవకాశాలు ఇచ్చేవాళ్లు కాదు. దీనికి భాషాపరమైన ఇబ్బందుకు కూడా కారణం కావొచ్చు. కానీ కరోనా తర్వాత ఇండస్ట్రీలో పరిస్థితులు మారిపోయాయి. సౌతిండియా యాక్టర్లకు వాళ్లు కూడా అవకాశాలిస్తున్నారు. తమ సినిమాలకు ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరవేయాలంటే దక్షిణాది నటీనటులను ఎంపిక చేయడం తప్పనిసరైందంటూ చెప్పుకొచ్చింది. అంతేకాదు తాను హిందీ సినిమాకు సైన్ చేశానని.. త్వరలోనే వివరాలు కూడా షేర్ చేసుకుంటానంది. పట్టుదల సినిమాలో నాది పాజిటివ్ రోల్ లేదా నెగెటివ్ రోల్ అని మాట్లాడుకుంటున్నారు. ప్రేక్షకుల-కు నా పాత్ర గురించి ఆ విధంగా మాట్లాడుకోవడం ఎంతో నచ్చిందని పేర్కొంది.

## మహా కుంభమేళాలో పవిత్ర స్నానం చేసిన పూనం పాండే






పవిత్ర మహాకుంభ మేళాలో పవిత్ర స్నానం చేసేందుకు ప్రతిరోజూ కోట్లాది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటున్నారు. ఇక బుధవారం (జనవరి 29) మౌని అమావాస్య సందర్భంగా దాదాపు ఎనిమిది నుంచి పది కోట్ల మంది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కాగ మహా కుంభమేళాలో పవిత్రసంగమంలో స్నానం చేయడం వల్ల అన్ని పాపాలు తొలగిపోతాయని చెబుతాంటారు. అందుకే సామాన్యులతో పాటు పలువురు సెలబ్రిటీలు ఈ పుణ్యస్నానాన్ని ఆచరిస్తున్నారు. బీజేపీ ఎంపీ, నటి హేమమాలిని, దర్శకుడు కబీర్ ఖాన్, హాస్యనటుడు సునీల్ గ్రోవర్, కొరియోగ్రాఫర్ రెమో డిసౌజా, మరాఠీ దర్శకుడు ప్రవీణ్ తర్డే వంటి ప్రముఖులు ప్రయాగ్‌రాజ్‌లో పవిత్ర స్నానం చేశారు. ఇప్పుడు వివాదాస్పద నటి పూనమ్ పాండే కూడా ఈ జాబితాలో చేరింది. ఎప్పుడూ బోల్డ్ ఫొటోస్, కామెంట్స్ తో నిత్యం వార్తల్లో ఉండే పూనమ్ ఇటీవల ప్రయాగ్‌రాజ్‌కి వెళ్లింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తోందీ అందాల తార. తాజాగా తన ఇన్‌స్టా స్టోరీలో త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరిస్తున్న చిత్రాలను పంచుకుంది. ఈ ఫొటో క్యాప్షన్ గా 'నా పాపాలన్నీ కొట్టుకుపోయాయి' అని రాసుకొచ్చింది. పూనమ్ పాండే షేర్ చేసిన ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. వీటిని చూసిన నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. కొంతమంది మహాకుంభ్‌లో పవిత్ర స్నానం చేస్తున్న ఆమె ఫొటోలను చూసి ట్రోల్ చేయడం ప్రారంభించారు. కాగా బుధవారం మహాకుంభ్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై కూడా పూనమ్ స్పందించింది. "ఇది చాలా దురదృష్టకర సంఘటన. అయితే ఈ ఘటనతో భక్తుల్లో విశ్వాసం, నమ్మకం తగ్గకూడదు. ఓం నమ శివాయ' అని చెప్పింది.

ఇక 45 రోజుల పాటు జరగనున్న మహా కుంభమేళాలో బుధవారం నాటికే 27 కోట్ల మంది పవిత్ర స్నానాలు ఆచరించినట్లు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ నెల 13న ప్రారంభమైన ఈ కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు జరగనుంది. సుమారు 40కోట్ల మంది వరకు భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

కాగా, ఈ మహా కుంభమేళాలో బుధవారం తెల్లవారుజామున తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. మౌని అమావాస్య సందర్భంగా కోట్లాది మంది భక్తులు ఒకేసారి తరలిరావడంతో సంగం ఘాట్ వద్ద జరిగిన తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోవడం విచారకరం.

## సల్మాన్‌ఖాన్‌తో మరోచాన్స్ కొట్టేసిన రష్మికమందన్నా

గతేడాది పుష్ప 2 ది రూల్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది కన్నడ సోయగం రష్మిక మందన్నా. ఈ భామ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉందని తెలిసిందే. ఇప్పటికే ఏఆర్ మురుగదాస్ డైరెక్షన్‌లో బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ నటిస్తోన్న సికిందర్ సినిమాలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తోంది. కాగా ఈ భామ మరోసారి సల్లూభాయ్‌తో రొమాన్స్ చేయబోతుందన్న క్రేజీ వార్త నెట్టింట రౌండప్ చేస్తోంది. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్షన్‌లో రాబోతున్న చిత్రం అట్లీ 6. సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్నాడు. ఈ మూవీలో కూడా రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించనుందని, దీనికి సంబంధించి సైన్ కూడా చేసిందని బీటౌన్ సర్కిల్ టాక్.

ఇదే నిజమైతే మరి అట్లీ రష్మికను సిల్వర్ స్క్రీన్‌పై ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. పాపులర్ ప్రొడక్షన్ హౌస్ సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుందని ఫిలిం నగర్ సర్కిల్ టాక్. ఒక సినిమా విడుదల కాకముందే మరో ఒకే స్టార్ హీరో మరో సినిమాకు సంతకం చేసి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది రష్మిక మందన్నా.

ప్రస్తుతం రష్మిక మందన్నా విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఛావా చిత్రంలో నటిస్తోంది. మరోవైపు శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో ధనుష్ నటిస్తోన్న కుబేరలో హీరోయిన్‌గా నటిస్తోంది. ది గర్ల్ ఫ్రెండ్ మూవీ కూడా చేస్తుంది.

## తెలుగులో యుక్తి తరేజాకు మరో ఛాన్స్



2023లో నాగశౌర్య హీరోగా వచ్చిన రంగబలి సినిమాలో హీరోయిన్ గా నటించిన యుక్తి తరేజా ఆ సినిమా తర్వాత మళ్లీ టాలీవుడ్‌లో కనిపించింది లేదు. వాస్తవానికి రంగబలి టైమ్ లో అందరూ యుక్తికి తెలుగులో వరుస అవకాశాలొస్తాయనుకున్నారు కానీ ఆ సినిమా ఫ్లాప్ అవడం, అమ్మడికి లక్ కలిసి రాకపోవడం వల్ల రంగబలి తర్వాత యుక్తి టాలీవుడ్‌లో కనిపించలేదు.

ఈ గ్యాప్ లో అమ్మడు నటించిన మలయాళ సినిమా మార్కో రీసెంట్ గా రిలీజై మంచి సక్సెస్ అందుకున్న విషయం తెలిసిందే. మార్కో విజయంతో అందరి దృష్టి ఇప్పుడు యుక్తి వైపు మళ్లింది. ఈ నేపథ్యంలోనే తనకు టాలీవుడ్ నుంచి ఓ క్రేజీ ఛాన్స్ వచ్చినట్టు తెలుస్తోంది. టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం సినిమాలో యుక్తిని ఎంపిక చేశారని టాక్.

రాజేష్ దండా నిర్మాణంలో రూపొందనున్న కె ర్యాంప్ సినిమా కోసం యుక్తి తరేజాను తీసుకున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఈ సినిమా గురించి టాలీవుడ్ ఫిల్మ్ సర్కిల్స్ లో మంచి టాక్ వినిపిస్తుంది. కథ బాగా వచ్చిందని అంటున్నారు. ఇలాంటి సినిమాలో యుక్తికి అవకాశమొచ్చిందంటే క్రేజీ ఆఫర్ అనే చెప్పుకోవాలి.

## సినిమాల్లోకి వస్తానంటే తండ్రి ఓ షరతు పెట్టాడు : అదితి శంకర్



తన తండ్రి పెట్టిన కండిషన్ మేరకే తన నటిస్తున్నానంది అదితి శంకర్. డైరెక్టర్ శంకర్ కూతురిగా అదితి ఇండస్ట్రీలోకి వచ్చింది. డాక్టర్ కోర్సు పూర్తి చేసిన ఆమె నటనపై ఆసక్తితో ఇండస్ట్రీకి వచ్చింది. తమిళంలో పలు చిత్రాలు చేసిన ఆమె ప్రస్తుతం తెలుగులో బెల్లంకోండ సాయి శ్రీనివాస్ భైరవం సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుంది. అదితి హీరోయిన్ మాత్రమే కాదు సింగర్ అనే విషయం కూడా తెలిసిందే. తండ్రి వారసురాలిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అదితి ఇక్కడ తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సంపాదించుకునే ప్రయత్నం చేస్తుంది.

ఇక ఆమె తమిళంలో నటించిన 'నేసిప్పాయ' మూవీ సంక్రాంతికి విడుదలైన మంచి విజయం సాధించిది. ఇప్పుడు ఈ మూవీ తెలుగులో 'ప్రమిస్తావా' పేరుతో రిలీజ్ అవుతోంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆమె తన సినీ ఎంట్రీపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఈ సందర్భంగా శంకర్ కూతురిగా ఇండస్ట్రీలో వచ్చారు కదా.. మీకు ఎలా అనిపిస్తుందని అని అడిగారు. దీనికి ఆమె స్పందిస్తూ.. "డైరెక్టర్ శంకర్ కూతురిని కావడం నాకు గర్వంగానే ఉంది. కానీ ఆయన పేరు చెప్పి సినిమా అవకాశాలు పొందాలని అనుకోవడం లేదు.

నా స్వంత టాలెంట్‌తోనే నేను ఎదగాలనుకుంటున్నారు. అందుకే ప్రతి సినిమాకి ముందు ఆడిషన్స్ ఇస్తాను. సినిమాలో సక్సెస్, ఫెయిల్యూర్స్ అనేవి మన చేతుల్లో ఉండవు. డబ్బు కోసం నేను సినిమాల్లోకి రాలేదు. ఆసక్తితోనే వచ్చాను. డాక్టర్ కోర్స్ పూర్తి చేసిన వెంటనే నా ఇష్టాన్ని డాడీకి చెప్పాను. సినిమాల్లో నటిస్తానని అడిగాను. నా అభిప్రాయాన్ని చెప్పగానే ఆయన బాగా ఆలోచించారు. ఆ తర్వాత సరే నీ ఇష్టం అన్నారు. కానీ దీనికి ఒక కండిషన్ పెట్టారు. నిర్ణిత గడువులోగా సినిమాల్లో సక్సెస్ కాకపోతే వైద్య వృత్తికి వెళ్లాలని చెప్పారు. ఆ నిబంధన మేరకు నేను సినిమాల్లోకి వచ్చాను.

అయితే నాకు హిస్టరీ, మైథలాజికల్ సినిమాల్లో నటించాలని ఉంది. తమిళంలో కొన్ని సినిమాలు చేశాను. ఇప్పుడు తెలుగులోకి ఎంట్రీ ఇవ్వబోతున్న. బెల్లంకోండ సాయి శ్రీనివాస్‌తో ఓ మూవీ చేస్తున్నా. నాన్న దర్శకత్వంలో నటించాలని ఉంది. ఆయన పిలుపు కోసం వెయిట్ చేస్తున్నా. అది త్వరలోనే రావాలని కోరుకుంటున్నా" అని చెప్పుకొచ్చింది. ఇక తనకు తమిళ హీరోల్లో రజనీకాంత్ సర్ ఇష్టమని, హీరోయిన్లలో నిత్యా మీనన్, సాయి పల్లవిలు అంటే ఇష్టమని చెప్పింది. కాగా అదితి మొదట కార్తీ హీరోగా వచ్చిన విరమన్ చిత్రంతో నటిగా అరంగేట్రం చేసింది. ఆ తర్వాత మావీరన్, నెసిప్పాయ చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం తమిళంలో వన్స్‌మోర్, తెలుగులో భైరవం సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

## మొదటి సినిమా పై సంతకం చేసిన మోనాలిసా



ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మోనాలిసా భోస్లే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విషయం తెలిసిందే. దాంతో పూసలమ్ముకునే 16 ఏళ్ల అమ్మాయి రాత్రికి రాత్రే ఇంటర్నెట్ సెన్సేషన్‌గా మారిపోయింది. ఆమె అందానికి ఫిదా అయిన వారు మోసాలిసాతో ఫొటోలు, వీడియోల కోసం ఎగబడ్డారు. చివరికి ఆమెను అక్కడ ఉండేందుకు కూడా వీలు లేకుండా చేశారు.

కుంభమేళాలో మోనాలిసా ఎక్కడ కనిపించినా వెంటపడి మరీ ఫొటోలు దిగడం చేస్తుండడంతో ఆమె వ్యాపారం దెబ్బతింది. దాంతో చేసేదేమిలేక మోనాలిసా తండ్రి ఆమెను అక్కడి నుంచి వెనక్కి పంపించేశారు. అయితే, ఆమె తాలూకు వీడియోలు, ఫొటోలు అప్పటికే నెట్టింట వైరల్‌గా మారాయి. దాంతో ప్రస్తుతం ఎక్కడ చూసినా ఆమె పేరే మార్మోగిపోతోంది.

ఇప్పుడు ఏకంగా బాలీవుడ్ చిత్రంలో నటించే ఆఫర్ కొట్టేసింది మోనాలిసా. తాజాగా ఆమె తన తొలి చిత్రానికి సంతకం కూడా చేసేసింది. దర్శకుడు సనోజ్ మిశ్రా ఇటీవల తాను ప్రకటించినట్లుగా తన చిత్రంలో ఆమెకు అవకాశం ఇచ్చారు. 'ది డైరీ ఆఫ్ మణిపూర్' పేరుతో తెరకెక్కనున్న తన మూవీలో మోనాలిసాకు ఛాన్స్ ఇవ్వడం జరిగింది.

ఈ నేపథ్యంలోనే తాజాగా సనోజ్ మిశ్రా స్వయంగా మోనాలిసా ఉండే మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు వెళ్లారు. ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో చర్చించారు. అనంతరం తాను ఆఫర్ చేసిన చిత్రంలో నటించేందుకు ఆమె నుంచి అంగీకార పత్రంలో సంతకం తీసుకున్నారు. ఇక చిత్రీకరణకు ముందు ముంబయిలో మోనాలిసాకు యాక్టింగ్ నేర్పించనున్నారు. ఈ చిత్రంలో రాజ్‌కుమార్ రావు సోదరుడు అమిత్ రావు నటిస్తున్నట్లు సమాచారం.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS లక్ష్యం సమాజహితం తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com